# ప్రాచీన భారతంలో చార్వాకం

సి.వి.

SCANNED
31/12/2019

# ప్రాచీన భారతంలో చార్వాకం

సి. వి.

ప్రగతి సాహితి
విజయవాడ

ప్రథమ ముద్రణ :
1983 నవంబరు

6553
Cat-1385
211.4
సి వి ప్రాచీన

వెల : 6-00

కవర్ డిజైన్ :
నందలాల్

సుందరయ్య గ్రంధాలయ సంస్థ
A C. No. 88,866
హైదరాబాద్-500 044.

బైండింగ్ :
శ్రీ దీనదయాళ బైండింగ్ వర్క్స్
విజయవాడ - 2

ప్రింటింగ్ :
శ్రీ పుష్ప ప్రింటర్స్
విజయవాడ - 2

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రాచీన భారతంలో చార్వాకం | 5 |
| 2. | రామాయణంలో చార్వాకం | 51 |
| 3. | ప్రాచీన భారతంలో హేతువాద తత్వవేత్తలు | 63 |
| 4. | మధ్యయుగాల్లో చార్వాకం | 81 |
| 5. | అనుబంధం | 131 |

# 1. ప్రాచీనభారతంలో చార్వాకం

గతి తర్కం, గతి తార్కిక చారిత్రక భౌతికవాదం గురించి తెలుగులో ప్రామాణిక గ్రంథాలు వొచ్చాయి. ఇది సంతోషదాయకమైన విషయం. అయితే, యావత్ అంధవిశ్వాసాలకీ సమాధిగట్టి, పాలక–పురోహితవర్గాల నిరంకుశాధికారాన్ని బహిరంగంగా సవాల్ జేసి, బానిస సమాజ పునాదుల్ని మొదలంటా పెకలించ ప్రయత్నించి, మానవ సమానత్వాన్ని వాడవాడలా ప్రబోధించి వినూత్న తాత్విక విప్లవ సందేశాన్ని అశేష సామాన్య ప్రజల కందించి, ప్రప్రథమ సాంస్కృతిక విప్లవకారులుగా, సాంఘిక తిరుగుబాటుదార్లుగా జీవించి, భీకర చిత్రహింసలకి గురిచేయబడి, భారతదేశ చరిత్రలో అజరామరులై అమరులైన చార్వాక భౌతికవాదులను గురించి, వారు ప్రతిపాదించిన భౌతికవాదం గురించి, నేటివరకు తెలుగులో ఒక్కగానొక్క ప్రామాణిక గ్రంథం రాకపోవడం, అత్యంత విచారకరమైన విషయం.

## I

మానవుడు నేడుచూస్తోన్న వివిధరూపాలు ధరించకపూర్వం–జీవం అనేక కోట్ల సంవత్సరాల క్రితం అతిసూక్ష్మదశలో అవతరించింది. ఆనాడు భూమండలం జీవాన్ని ధరించడానికి వీల్లేనంత భయంకరమైన ఉష్ణోగ్రతతో మండుతుండేది. ఆ ఉష్ణం తీవ్రత క్రమేణా తగ్గి, భూమ్మీద వున్న బొగ్గు, ప్రాణవాయువు, తేమ, తదితర పదార్థాలు సంయోగం చెంది మొదటి జీవపదార్థాన్ని సృష్టించాయి. ఆనాటి నుండి జీవపదార్థం వాతావరణానికి అనుగుణ్యంగా మార్పుచెంది, సూక్ష్మాతిసూక్ష్మమైన ఎమీబా

నుండి కొన్ని లక్షల సంవత్సరాల పాటు విభిన్నరూపాలుగా పరిణామం చెందింది. భూమిపై జీవపదార్థం ఉనికిలోకొచ్చిన నాటినుండి పరిసర ప్రకృతిలోని పరిస్థితుల కనుగుణ్యంగా తనని తాను మలచుకొంటూ పరిణామం చెంది, ఆ సుదీర్ఘ పరిణామంలో మహోన్నతమైన మానవుని దశకు నేడు చేరుకొంది. ప్రకృతిపాశాలకు బానిసైన పశువును మానవునిగా మలిచి, జ్ఞానం చైతన్యం వాక్కుల్ని కల్పించిందే సృజనాత్మకశ్రమ.

మనిషి, మనిషిగా బతకడం ప్రారంభించి రెండున్నర లక్షల సంవత్సరాలకన్నా యెక్కువ కాలేదని శాస్త్రవేత్తలు అంటోన్నారు. ఈ సుదీర్ఘపరిణామక్రమంలో మానవుడు ఎన్నో అవాంతరాల్ని అధిగమించి, వివిధ దశలను దాటి, నేటి చైతన్యవంతుడైన మానవుడుగా రూపురేఖలు దిద్దుకొన్నాడు.

ఈ విధంగా పరిణామం చెందిన ఆదిమ మానవుని జీవనపరిస్థితులు మహాదుర్భరంగా, భయంకరంగా వుండేవి. "కన్ను పొడుచుకున్నా కని పించని కటిక చీకటి; కదిలితే కోటిముళ్ళు గుచ్చుకునే కాఱడవి; మెదిలితే కోరలను మెఱ మెఱలాడించే మృగతండం; ఆనాటి మానవుని జీవితమే ఇబ్బందుల పుట్ట; ఇక్కట్టుల గుట్ట; కావి ఎక్కడో ఏదో వెలుగురేఖ తళుక్కుమంటోంది."

## ఆదిమ మానవుడు:
## మూఢమత విశ్వాసం

మిడిమిడి జ్ఞానంతో వున్న నాటి ఆదిమ మానవునికి ప్రకృతి రహస్యాలను అవగాహన చేసికొనడం అసాధ్యమైంది. పిపీలికం మొదలు బ్రహ్మాండం వరకూ ఏ విధంగా ఉనికిలోకి వొచ్చాయో తెలియని అతడు ప్రకృతివైపు వొక్కసారి చూచేప్పటికి తారెత్తిపోయాడు. చిత్రవిచిత్రమై,

సంధ్యారాగసంశోభితమైన అనంతాకాశం, సాయంసమయానికే చీకటి కోనలా మారిపోతోంది; మైళ్ళపర్యంతం వ్యాపించిన విశాల పర్వత శ్రేణులు, మహోన్నతమైన పర్వతశిఖరాలు, అనంతమయిన సముద్రాలు, సమస్త జంతుజాలం, భీకరారణ్యాలు, అంతూపంతూలేని ఎడార్లు- ఇవన్నీ ఏ విధంగా ఎవరిచేత ఎందుకు ఎప్పుడు ఉనికిలోకి వొచ్చాయో ఆదిమ మానవునికి అర్థంగాలేదు. ప్రకృతిలో తన దృష్టికి కనిపించే వస్తువులను; సంఘటనలను, శాస్త్రీయదృక్పథంతో అవగాహన చేసికోలేని నాటి మానవుడు తనకన్న పూర్తిగా భిన్నమైన ఏదో మహాశక్తో, మహాశక్తులో ప్రకృతి ఉనికికి కారణభూతమై వుండవొచ్చుననే నిర్ణయానికొచ్చాడు. అతడు అప్పటికింకా "ప్రకృతి గర్భంనుంచి బొడ్డుకోసుకుని బయట పడలేదు. ఇంకా ప్రకృతిలో వొహభాగంగానే ఉంటోన్నాడు." (ఎంగెల్స్) ఆదిమ మానవుడు తనచుట్టూ జరిగే సంఘటనల కన్నిటికీ ప్రాణం పోసే వాడు. వాటికి తెలివినీ, చైతన్యాన్నీ ఆపాదించేవాడు. తన చుట్టూవున్న ప్రపంచాన్ని తనవంటిదిగానే చూచేవాడు. "ప్రకృతి శక్తులకు దైవత్వం ఆరోపించడం ద్వారా మొట్టమొదటి దేవుళ్ళు ఏర్పడ్డారు. మత సిద్ధాంతాలు అభివృద్ధి చెందినకొద్దీ, ఈ దేవుళ్ళు, ప్రకృతి శక్తులతో తమకు గల సంబంధాన్ని వొదిలించుకొని ఊహా ప్రపంచంలోకి వెళ్ళిపోయారు." (ఎంగెల్స్)

## ప్రకృతి శక్తుల పూజ

"ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో (ప్రైవేటు ఆస్తి, వర్గాలు, ఉనికిలోకి రాని ఆదిమ సమాజం) మానవుడు మరికొంత పురోగమించి పశుపోషణ నేర్చుకొన్నాడు. దానితో మానవసంఘంలో ప్రప్రథమంగా పని విభజన జరిగింది. వేటాడేవారూ, పశువుల్ని పోషించేవారూ విడివడ్డారు. పశువుల్ని మచ్చికచేయడం ద్వారా పాలూ పెరుగూ లభించేవి. తిండికొరత

కొంచెం తగ్గింది. కొంత విశ్రాంతి లభించింది. పశువుల కవసరమైన పచ్చగడ్డి కోసం గుంపులు గుంపులుగా వీరు దేశ దేశాలు తిరిగారు. ఈ విధమయిన సంచారక తెగలుగానే ఆదిమార్యులు భారతదేశానికొచ్చారు." (డాంగే—భారతదేశం)

ఉరుములు, మెరుపులు, భయంకరమైన తుఫానులు, పిడుగులు ఎలా కలుగుతున్నాయో, సూర్యచంద్రాదులు, కోటానుకోట్ల నక్షత్రాలు, వేయేల - యీ యావత్ ప్రకృతి యొక్క ఉనికికి కారణం తెలియని నాటి ఆదిమమానవుడు, వీటినన్నిటినీ వివిధ ప్రకృతి శక్తులుగా భావించి పూజింప నారంభించాడు. ఋగ్వేదంలో గోచరించే ప్రకృతిశక్తుల పూజ, యీ సత్యాన్నే తెలియజేస్తుంది. వైదికార్యులు వివిధ ప్రకృతిశక్తులను దేవతలుగా భావించి ఏ విధంగా పూజించారో తెలుసుకునేందుకు ఋగ్వేద సూక్తులు మన కెంతో తోడ్పడతాయి.

ఆదిమార్యుల దేవతలందరిలోకి అతిముఖ్యుడు అగ్ని (నిప్పు) దేవుడు. ఇతడు దేవపూజలకూ, యజ్ఞయాగాది కర్మకాండకూ అధిదేవత. ఋగ్వేదసూక్తుల్లో వైదికార్యులు అగ్నిదేవుని హవ్యవాహనుడు, ధూమ కేతువు, జాతవేదుడనీ వర్ణించి పూజించారు. ఇంద్రుడు యుద్ధానికి అధిదేవత. వరుణుడు ఆకాశదేవత. వాయువు గాలిదేవత. వీరేగాక ఉషస్సు, పృథ్వి, సోమ, అశ్వినీకుమారులనూ, సూర్యచంద్రాదులనూ, ప్రకృతి దేవతలుగా భావించి వైదికార్యులు పూజించారు.

వారు "తమ చుట్టూ వున్న చీకటినీ, మంచునూ, జంతువులనేగాక సుదూరంలోని వేకువనూ, సూర్యరస్మినీ, సుఖనివేశాలనూ, తమ కల్పనా శక్తిద్వారా, తమ భావనాబలం ద్వారా చూడగలిగారు. రేపటి వేకువను చూపించి,మాపటి చీకటి పోగలదన్న ధైర్యం కల్పించి, సమిష్టి కృషికై వారిని పురికొల్పడంలో వారి కవిత రూపొందింది." ప్రాచీన విజ్ఞానానికి

మహోన్నత చిహ్నలూ, ఆదిమార్యుల కవితానేశానికి పట్టుగొమ్మలూ, అత్యంత ప్రాచీన కాలంలోని ఉత్తమ జానపదగేయ సాహితికి ప్రత్యక్ష నిదర్శనాలైన వేదాలలోని సూక్తులు నాటి వైదికార్యుని భయాన్ని, ఆనందాన్ని, అమాయకత్వాన్ని ప్రకృతిని గూర్చి అతనికున్న అశాస్త్రీయ దృక్పధాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. చీకటితో సతమతమవుతున్న నాటి వైదికార్యులు ఉషస్సును (పేకువ) చూచి ఏ విధంగా నిలువెత్తున పొంగి దానిని వో ప్రకృతి దేవతగా భావించి పూజించారో చూడండి.

"తిరోధానమైన జగము
తెఱ తొలగించిన దిదిగో
విశ్వమ్ముల మేలుకొల్పి
వికసించిన దుషోదేవి."

(రుగ్వేదం)

నాటి మానవుడు సూర్యుని గూడా వోహ ప్రకృతిశక్తిగా భావించి ప్రశంసించాడు—

"మేలుకొండీ జనుల్ మేలుకొండీ నరుల్
మన జీవరక్షకుడు చనుదెంచుచున్నాడు
చీకటులు విచ్చినవి-వేకువలు విరిసినవి
రవి వచ్చు మార్గమును సవరించిన దుషస్సు
ఎచట అన్నము దొరకు నచటి కేగుద మింక
మేల్కొనుడు మేల్కొనుడు
మేల్కొనుం డిక జనులు."

(రుగ్వేదం)

మిలమిలా మెరుస్తూ నవయవ్వన సౌందర్యవతిలా వున్న ఉషఃకాంతను వెంటాడి, సూర్యుడు చీకట్లను బద్దలుకొట్టుకుని వొస్తున్నాడని వర్ణించే యీ గేయం చూడండి—

"మిలమిలలాడే మానవ
లలన వోలు నుషోదేవి
వెంట నంటి ఆదిత్యుడు
వెడలుచుండెనూ."

(రుగ్వేదం)

మానవాభ్యుదయానికి అత్యంత ప్రధానమయిన శక్తిగా ఉపయోగ పడిన అగ్నిని- నాటి వైదికార్యుడు ప్రకృతిశక్తిగా భావించి ఈ విధంగా పూజించాడు-

"సంగర రంగమ్మున నుత్తుంగ వేగ బృంహితమై
చెంగులు వేసుక వెళ్ళే రంగుల హయరాజమట్లు
వింగికెగయు నీ యగ్నిని పొంగుతీయువారెవ్వరు?"

(రుగ్వేదం)

గాలిని వాయుదేవుడిగా భావించి ఇలా ప్రశంసించాడు -

"మీరు వాన కురిపిస్తే
సారవంతమగు భూములు
సస్యవంతమగు నేలలు
శక్తివంతు లగుదురు
మా సర్వమానవాళి నిజం."

(అధర్వణ వేదం)

ఆనాటి వైదికార్యుడు పరిసర ప్రకృతినిఏవిధంగా విశుద్ధ హృదయంతో పలకరిస్తున్నాడో చూడండి.

"ఓవనీ ఓవనీ ఓ అరణ్యానీ!
దారితప్పిన బాటసారి చందమున
దిగులుగా నుంటి వదేమిటి జననీ!
ఎక్కటి భీతి జనించదా నీకు?"

"ఒరులకు నపకార మొనరించి యెరుగ
నట్టి దానవు; ఒక్క యాటవికుండు
నిచ్చట నిన్ పల్కరించకయున్న
బెంబేలు వడిపోని బిత్తరి వీవు
కమ్మని నీదు ఫలమ్ముల దినుచు
హాయిగా జీవించనగు వేయి యేండ్లు."

(కృష్ణ యజుర్వేదం)

శాస్త్రవిజ్ఞానంకానీ, ప్రకృతినీ, సమాజ జీవితాన్నీ, అదుపులోకి తీసుకోగల శక్తిగానీ లేని అనాగరికదశలో ప్రాచీన జనసమూహాలన్నీ యిలాంటి ఊహాత్మక వర్ణనలకి పుట్టుగడ్డలుగా ఉంటాయి." (ఎంగెల్స్)

## మతం పుట్టుక

ఆదిమ మానవుడు తన పరిసర ప్రకృతిని, శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకోలేని అసహాయస్థితిలో ఉన్నప్పుడు, అతని అజ్ఞానానికి ప్రతిబింబంగా దేవుడు మతము అనే భావాలు ఉద్భవించాయి. అంచేత, మతానికీ, దైవ భావానికీ, మానవ అజ్ఞానమే ప్రధాన ప్రాతిపదిక అనేది సుస్పష్టం. మానవ అజ్ఞానం నుండి మూఢమతవిశ్వాసం బయల్దేరింది. తత్ఫలితంగా ప్రకృతి శక్తులను వివిధ దేవతలుగా భావించి పూజించే సాంప్రదాయం ఉనికిలోకి వొచ్చింది. ఇది వొక్క వైదికార్యుల విషయంలోనే గాక, అత్యంత ప్రాచీనమైన ఈజిప్షియన్, బాబిలోనియన్, మెసపొటేమియన్ సంస్కృతుల్లో సైతం కొట్టవొచ్చినట్టు కానవచ్చే నగ్నసత్యం. స్థలాభావం చేత ఆ వివరాల్లోకి ప్రస్తుతం వెళ్ళడం సాధ్యం కాదు.

ఈ వివిధ దేవతల ప్రీతికోసం, యజ్ఞయాగాది క్రతువుల్లో జంతు, నరబలుల్ని యిచ్చేవారు. బైబిల్‌లోని పాత నిబంధనలో నాటి మానవుడు యెహోవా దేవునికి నర, జంతు, బలుల్ని సమర్పించిన ఉదాహరణలు కోకొల్లలు. ఈ యజ్ఞ యాగాది కర్మకాండను నిర్వహించేందుకు పురోహితులు-పూజార్లు-అనేవర్గం వొకటి ప్రత్యేకంగా నాటిసమాజంలో ఉనికిలోకొచ్చింది. ఈ పురోహితవర్గం నాటి అమాయక జనసామాన్యాన్ని తన కబంధహస్తాల్లో పెట్టుకొని, క్రమేణా వారిని దోచుక తినే పరాన్నభుక్కు-వర్గంగా తయారైంది. ఈవర్గం ప్రజాసామాన్యంపై తమ గుత్తాధికారాన్ని సుస్థిరం చేసికొనేందుకు మరిన్ని మూఢమతవిశ్వాసాల్ని సృష్టించింది. ఆగ్రహంతో మండిపోయే దేవుళ్ళని బలిసమర్పణ ద్వారా శాంతింప జేయగలశక్తి- దేవుడితో మాట్లాడి ప్రజలకి మేలు కలుగజేసే శక్తి—భగవత్ ప్రసాదితమయిన దివ్యదృష్టితో భవిష్యత్తులోకి చూడగల శక్తి ఇలాంటి అమాంబాపతు శక్తియుక్తులన్నీ, యీ దోపిడీ పూజారివర్గానికి వున్నాయని పామరజనాన్ని నమ్మించారు. ఈ విధంగా సమస్త సాంఘిక రంగాల్లో తమ నితాంత నిరంకుశాధికారాన్ని భద్రపరుచుకొని సుస్థిరం జేసుకొనేందుకూ, పరాన్న భుక్కులై సామాన్య ప్రజల కష్టార్జితాన్ని రాబందుల్లా దోచుకతిని తెగబలిసేందుకు వీలుగా యజ్ఞయాగాది కర్మకాండనీ, తద్దినాల్నీ, పూజా పునస్కారాల్నీ సృష్టించారు. మనిషి పుట్టిందగ్గిర్నుంచి, కాటిలో అతణ్ణి పాతిపెట్టేంతదాకా, ప్రతి దశలోనూ పచ్చి మోసపు కర్మకాండని సృష్టించి, యీ పురోహిత పరాన్నభుక్కులు దేశంమీద పడి దోచుక తిన్నారు.

# II

## రుగ్వేదంలో నాస్తికబీజాలు

మానవజాతికి సంక్రమించిన అతి ప్రాచీనమూ, అమూల్యమైన తాత్విక సాహితీ వారసత్వం — రుగ్వేదం. వైదికార్యుల్లో ఏ క్షణాన జిజ్ఞాస ప్రారంభమైందో ఆ సమయానే, అస్తి — నాస్తి — విచికిత్స: ఉన్నాడు — లేడు — అనే సదసత్సంశయం ప్రారంభమైంది. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం రుగ్వేదమే!

రుక్కు అనగా గీతం. ప్రకృతి శక్తులను గూర్చి వైదికార్యులు ఆనంద పారవశ్యంతో గానం చేసిన గీతాలే రుగ్వేద రుక్కులు. 1017 రుక్కులు గల రుగ్వేదం, 10 మండలాలుగా (ప్రకరణలు) విభజింపబడింది. వైదికార్యుల సాంఘిక రాజకీయ మత పరిస్థితులను అవగాహన జేసికోవడానికి యీ రుక్కులు మనకు దోహదం జేస్తాయి. క్రీ. పూ. 1200 నుండి 1000 సంవత్సరాల మధ్యకాలంలో యీ రుక్కులు రచించబడ్డాయని మాక్స్‌ముల్లర్ వంటి పాశ్చాత్య విద్వాంసులు అభిప్రాయబడ్డారు. క్రీ.పూ. 6000 సంవత్సరాల ప్రాంతంలో రుగ్వేదం రచింపబడిందని భారతీయ పండితులు భావిస్తున్నారు.

మొదట రుగ్, యజుర్, సామ వేదాలే వుండేవి. వీటిని త్రయీ (మూడు) అని పిలిచేవారు. అనంతర కాలంలో మంత్ర తంత్రాల్తోకూడిన అధర్వణ వేదం వచ్చి యీ జాబితాలో కలిసింది. మహాభారతాన్ని పంచమ వేదంగా తదనంతర కాలంలో పరిగణించారు. ఎప్పుడు, ఎందుకు, దేన్ని వేదాల లిస్టులో కలిపారో, కలిపిన వారినే అందుకు కారణం అడగాలి.

ఏ ప్రకృతి శక్తులపై వైదికార్యులకు ప్రబలమయిన విశ్వాసం ఉండేదో, ఆ శక్తులపైననే వారికి అవిశ్వాసంకూడా సమానాంతరరేఖలా పెరుగుతూ వొచ్చినట్లు కవిపిస్తోంది. ప్రాచీన భారతీయ హేతువాదానికి బీజాలు, రుగ్వేద సూక్తుల్లోనే మనకు ప్రధమంగా దర్శనమిస్తాయి. "యుద్ధవీరులారా ఇంద్రుడనేవాడుంటే, మీరు ఇంద్రునికోసం స్తోమమును భజించండి. వేమర్షియగు భార్గవుడు, ఇంద్రుడనేవాడు లేడంటోన్నాడు. ఆ ఇంద్రుణ్ణి యెవరు చూశారు?" అని చెబుతోన్న ఈ క్రింది రుగ్వేద రుక్కును చూడండి—

"ప్రసుస్తోమం భరత వాజయన్త ఇంద్రాయ సత్యం యది సత్య మస్తినేంద్రో స్తీతినేమతిత్వ ఆహ కఈం దదర్శక మభిష్టవాయ. (8-100) దీన్నిబట్టి ఇంద్రుడు వొహ అంధవిశ్వాసమని తేలుతోంది.

జనులు ఎవరిని ఘోరమైన వ్యక్తియని అంటోన్నారో, ఆ ఇంద్రు డెక్కడున్నాడు? జనులు ఇంద్రుడనేవా డొహడు లేడంటోన్నారు. ఆ ఇంద్రుడు భయపెట్టి శత్రువుల ధనాన్ని దొంగిలిస్తాడు. కాబట్టి ఇంద్రుణ్ణి విశ్వసించండి - ఇంద్రుణ్ణి నమ్మండి" అని చెప్పే యీ రుక్కును చూడండి—

"యంస్మా పృచ్ఛన్తి కుహసేతి ఘోరే ముతే మాహుర్నైషో స్తీ త్యేనం సో అర్య పుష్టీర్విజ ఇవా మినాతి శ్రద్ధస్మై ధత్త సజనాస ఇంద్రః" (2-12-5). ఈ సూక్తం ద్వారా ఆ కాలంలో ఇంద్రుని పట్ల గాఢమైన అనుమానం వున్నట్లు స్పష్టమవుతోంది. ఈ విధంగా ప్రకృతి శక్తుల పట్ల, ప్రధానంగా ఇంద్రుని యెడల అవిశ్వాసాన్ని ప్రకటించిన భాగాలు కొన్ని వున్నాయి. మంత్రకాలం నాటికే దేవతలపట్ల అనుమానం కలిగిందని చెప్పేందుకు ప్రబలమైన సాక్ష్యాలున్నాయి. ఇంద్రుని అస్తిత్వాన్ని (ఉనికిని) నిరాకరించినవారు (అనింద్రాః); వైదికమతంలో శ్రద్ధ

లేనివారు (అశ్రద్ధాః); రుగ్వేదంలో అనేకచోట్ల ప్రస్తావించ బడ్డారు. అంతేగాదు - సర్వదేవతల అస్తిత్వాన్ని సైతం నిరాకరించినవారు గూడా రుగ్వేదంలో ప్రస్తావించబడ్డారు: వారిని, వేదం-అదేవాః అని నిరసించింది. ఏ సమయంలోనూ దేవతల్ని కొలవనివారు (కదాచన ప్రజిగతాః): ప్రార్థనల్ని ద్వేషించేవారు (బహ్మద్వేషః); దేవతల అస్తిత్వాన్ని శంకించిన వారు (కిమిదినః); మతహీనులు (అవ్రతాః) వేదంలో ఎన్నోచోట్ల ప్రస్తావించబడ్డారు: మానవమేధస్సు ఏ మహోజ్వల శుభసమయాన ఆలోచించడం ప్రారంభించిందో, నాటినుండే యీ విచికిత్స వేరులు తన్నుకొన్నది. మంత్రాలు అనర్థకాలని ప్రతిపాదించిన కౌత్సుని, యాస్కుడు స్వని రుక్తంలో మహోగ్రవాదంతో ఖండించాడు.

# III

భారతీయ తత్వశాస్త్ర చరిత్రలో చార్వాక భౌతికవాదం, మహోజ్వల అధ్యాయాన్ని సృజించింది. చార్వాక సిద్ధాంతాన్ని గురించి రాయబడిన స్వతంత్ర గ్రంధాలు మనకు అందలేదు. వైదిక మతానికి చెందిన రుషులూ, వారి జోహుకుందారులైన రాజులూ యీ సిద్ధాంత గ్రంథాల్ని నిర్దాక్షిణ్యంగా బుగ్గిపాల్జేయడమే-ఇందుకు కారణం.

ఈ సిద్ధాంతాన్ని ఖండించినవారు, తమ విమర్శకు ఉపయోగించు నంతవరకు, ప్రతిపాదించిన ఉల్లేఖనల ద్వారానే, చార్వాక భౌతికవాదాన్ని సూక్ష్మంగానైనా అవగాహన చేసుకోవడానికి వీలు కలుగుతోంది. శంకరాచార్యులు రచించిన "సర్వదర్శన సార సంగ్రహం", విజయనగర యుగానికి చెందిన మాధవాచార్యులు రాసిన "సర్వదర్శన సంగ్రహం" యీ సిద్ధాంత అవగాహనకు ప్రధానంగా అవకాశమిస్తోన్నాయి.

ఇవేగాక, చార్వాక భౌతికవాద అధ్యయనానికి ఈ క్రింది గ్రంథాలు గూడా కొంత సమాచారాన్ని అందజేస్తాయి. హరిభద్రసూరి రాసిన

షడ్దర్శన సముచ్చయం; వాల్మీకి రామాయణం—అయోధ్యకాండ; మహాభారతంలోని శాంతి పర్వం; ఛాందోగ్య, బృహదారణ్యక, కఠ, మైత్ర్యుపనిషత్తులు, ప్రబోధచంద్రోదయం, వేణీసంహారం నాటకాలు.

నాస్తిక సిద్ధాంత బద్ధ విరోధులైన వీరి గ్రంథాల్లో, మనకులభించే కొటేషన్లు, అధికాధికంగా వక్రచిత్రణలు, అసత్యాలు అర్ధసత్యాల్తో కూడి వుంటాయని వేరేగా చెప్పనవసరంలేదు. అయితే, యీ గ్రంథాలకన్న మనకు వేరే గత్యంతరంలేదు గాబట్టి, గుడ్డికన్ను కన్న మెల్లకన్ను మేలనే దృష్టితోనే వీటిపై మనం ఆధారపడాలి:

## చార్వాకులకు పూర్వమున్న సాంఘిక పరిస్థితులు

బానిసవిధానంపై యేర్పడ్డ వర్ణవ్యవస్థ, వైదికార్యుల సమాజంలో బాగా పాతుకొని పోయిన పిదప, అగ్రవర్ణాలకి చెందిన బ్రాహ్మణ క్షత్రియులు, క్రింది వర్ణాలైన వైశ్య శూద్రులపై దారుణమైన అధికారాన్ని చలాయించ ప్రారంభించారు.

వేదకాలంలో ఉనికిలోకొచ్చిన యజ్ఞయాగాది కర్మకాండ, రాను రాను యాంత్రిక నిర్జీవకాండగా మారి, మతమూ దేవతల పేరిట జాతర్లలో జంతువుల్ని నరికే దారుణ హింసాకాండగా పరిణమించింది. ఈ కర్మకాండకీ, పరలోకంలో పొందబోయే అమాంబాపతు ప్రయోజనాలకీ బ్రహ్మముడి వేయబడింది: వైదిక కర్మకాండను జోరుగా సాగించవలెనంటే, పాలకవర్గాల్లోనేగాక, ప్రజల్లోగూడా అంధవిశ్వాసాన్ని విపరీతంగా పెంచడం, నాటి పురోహిత వర్గానికి ప్రధాన జీవితావసరంగా పరిణమించింది. ఈ అంధవిశ్వాసం నశిస్తే, యజ్ఞయాగాదులకీ, దినాలూ తద్దినాలకీ, గిరాకీ తగ్గుతుంది. ఫలితంగా, పరాన్నభుక్కు పురోహిత వర్గం, కూడూ గుడ్డలేని బికారుల్లా తయారవుతారు.

ఎంతో శ్రమకోర్చి, ధనాన్ని వెచ్చించి, యీ కర్మకాండని కొనసాగించినా, ఏనుగు లద్దెలా వీసమెత్తు ఫలితం సైతం కలగడంలేదు। ఇలాంటి పరిస్థితులతో కళ పెళ లాడుతోన్న నాటి సమాజంలో, అట్టడుగున వున్న క్రింది కులాలకు, ప్రత్యేకంగా శూద్ర బానిసలకు, చార్వాకులచే ప్రతిపాదింపబడిన భౌతికవాదం, మహత్తర సందేశాన్ని అందజేసింది. చార్వాక భౌతికవాదుల్లో అత్యధిక సంఖ్యాకులు బానిసలనుంచి వొచ్చినవారు. సేనానాయకుల వొద్ద, కలవారి కొంపల్లో, బానిసలుగా బతికిన వీరు, మూగవోయిన నాటి పీడిత ప్రజాసామాన్యం వాంఛల్ని నిర్ద్వంద్వంగా ప్రతిధ్వనింపజేశారు. పూజారివర్గం ప్రచారంజేస్తున్న యావత్ కర్మకాండ, పురోహితవర్గ కుక్షింభరత్వానికి ప్రప్రథమ సాధనమనే చిదంబర రహస్యాన్ని, సామాన్య జనంలో ప్రచారం జేయడంద్వారా, ప్రాచీన భారత సాంస్కృతిక విప్లవోద్యమంలో అగ్రశ్రేణిలో నిలిచారు. తమ వాదనా పటిమతో, యజ్ఞయాగాదులూ, దినాలూ తద్దినాలు యిత్యాది కర్మకాండలోని గుట్టును బట్టబయల్జేశారు. పరాన్నభుక్కులైన నాటి వైదిక పురోహితవర్గం భుక్తి యావత్తూ, యజ్ఞయాగాది కర్మకాండని నిరాఘాటంగా కొనసాగించడం పైనే పూర్తిగా ఆధారపడివుందని చార్వాకులు బాహాటంగా ప్రచారం జేశారు। ఈ నిర్జీవ, అర్థరహిత కర్మకాండ వెనక దాగియున్న పూజారివర్గ పచ్చి స్వార్థాన్నీ, వంచననీ, దోపిడినీ పయోముఖ విషకుంభత్వాన్నీ వారు నగ్నంగా కడిగివేశారు.

## మనుస్మృతి : వర్ణవ్యవస్థ

చార్వాక భౌతికవాద విప్లవం, గౌతమ బుద్ధునికి పూర్వంనాటిది. బుద్ధుడు క్రీ. పూ. 563లో జన్మించాడు. అంచేత, చార్వాకులు క్రీ. పూ. 6వ శతాబ్దంనించి క్రీ. పూ. 4వ శతాబ్దం మధ్యవున్న కాలానికి చెందినవారై వుండాలి.

క్రీ. పూ. 7–5 శతాబ్దాల మధ్యకాలంలో, ఉత్తర భారతంలోని సమాజం సంధియుగంలో వున్న దశలో, మనుస్మృతి రచన జరిగి వుండవొచ్చునని చరిత్రకారుల అభిప్రాయం.

స్మృతి అంటే ధర్మశాస్త్రం. మనువు రాసింది గాబట్టి మనుస్మృతి అనే పేరిట చలామణీలో కొచ్చింది. ఈ మనుధర్మశాస్త్రంలో అజ్ఞాత ధర్మశాస్త్రవేత్తలు దొంగతనంగా జొప్పించిన ప్రక్షిప్తాలు యెన్నివున్నాయో ఆదిమధ్యాంత రహితుడైన ఆ పరమాత్మకే తెలియాలి!

మనుస్మృతి చదువుతోంటే, నాటి సాంఘిక పరిస్థితులూ, ఆచార వ్యవహారాలూ, విధినిషేధాలూ, సమకాలీన ధర్మశాస్త్రవేత్తల అభిప్రాయాలూ మనకు లీలామాత్రంగా గోచరిస్తాయి. ఉత్తర భారతంలో నిరంకుశ రాచరికాలు వృద్ధిజెందుతూ, ఆదిమ గణసమాజం క్షీణించిపోతోన్న దశలో, ఆ గణసమాజం ఆత్మ రక్షణార్థం చేసిన విఫల ప్రయత్నాల్ని మనుధర్మ శాస్త్రం మనకు చూపుతుంది.

మనుస్మృతి కాలంనాటికే సమాజంలో వర్ణభేదాలు స్థిరపడిపోయాయి. వైదిక సాంఘిక వ్యవస్థలో ప్రప్రధమంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులనే మూడు వర్ణాలు మాత్రమే వుండేవి! అనంతరం సృష్టించబడిందే శూద్రవర్ణం. వెరసి–చాతుర్ వర్ణ వ్యవస్థ. ఈ వ్యవస్థను భగవంతుడు సృష్టించాడని వైదిక పురోహిత వర్గం ప్రచారం జేసింది. భగవద్గీతలోని శ్రీకృష్ణపరమాత్మద్వారా చెప్పించింది. అయితే, పంచముల్ని ఏ వంచకులు సృష్టించారో వారు నేటికీ చెప్పలేదు. ఈ చాతుర్ వర్ణ వ్యవస్థలో పావురాళ్ళగూళ్ళలాంటి అనేకానేక అంతరవర్ణాలుగూడా వున్నాయి.

మనుధర్మశాస్త్ర ప్రకారం, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు లకి సమాజంలో యీ క్రింది విధంగా బాధ్యతలు విభజించబడ్డాయి.

అధ్యాపన మధ్యయనం
యజనం యాజనం తధా
దానం ప్రతిగ్రహం చైవ. (88-1-అ)

చదువుకోవడం, చదువుచెప్పడం, యజ్ఞం చేయడం, చేయించడం, ఒకరికి దానం చేయడం, ఇతర్లనుండి దానం పుచ్చుకోవడం యివి బ్రాహ్మణుని విధులు.

ప్రజానాం రక్షణం దాన
మిజ్యాఽధ్యయన మేవచ
విషయేష్వ ప్రసక్తిశ్చ. (89-1-అ)

ప్రజల్ని రక్షించడం, ఒకరి కివ్వడం, చదువుకోవడం, బ్రహ్మచర్య ధర్మాల్ని నిర్వర్తించడం, భోగాలయందు అనాసక్తి చూపడం—యివి క్షత్రియుని విధులు.

పశూనాం రక్షణం దాన
మిజ్యాఽధ్యయన మేవచ
వణిక్పథం కుశీదం చ
వైశ్యస్య కృషిమేవచ. (90-1-అ)

పశురక్షణం, దానంచేయడం బ్రహ్మచర్య విధుల్ని నిర్వర్తించడం, చదువుకోవడం, వ్యాపారం - వడ్డీవ్యాపారం చేయడం, వ్యవసాయం చేయడం-యివి వైశ్యుని విధులు.

ఏతేషా మేవ వర్ణానాం
శుశ్రూషా మనసూయయా. (91-1-అ)

అసూయా ద్వేషాల్లేకుండా పై మూడు వర్ణాలకూ సేవ (అడ్డమైన చాకిరీ) చేయడం ఒక్కటే శూద్రుల విధి!!!

ఈ విధుల విభజనను గమనిస్తే, బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలు పాలక వర్గాలుగా ఉత్పత్తిరంగంనుండి పూరాగా దూరమైనట్లు, యావత్ సామాజికోత్పత్తి భారం వైశ్య శూద్రులపై పడినట్లు స్పష్టంగా గోచరిస్తుంది. ప్రత్యేకంగా శూద్ర బానిసలు జేసిన అడ్డమైన చాకిరీ వర్ణనాతీతం.

"శక్తే నాపిహి శూద్రేణ నకార్యోధన సంచయః
శూద్రోహి ధన మాసాద్య బ్రాహ్మణానేవ బాధతే."

(మనుస్మృతి)

శూద్రుడు ధనసంపాదనకు సమర్థుడైనా, ధనాన్ని సమకూర్చరాదు. అలా ధనాన్ని సంపాదిస్తే, బ్రాహ్మణులమైన మనకు వారు సేవ (చాకిరి) చేయరు అని మనుధర్మశాస్త్రవేత్త ఘంటాపథంగా చెప్పాడు. అంచేత చాకిరియే శూద్రధర్మం! ఈ విధంగా కోట్లాది శూద్రులు అజన్మాంతం బానిసలుగా పుట్టి, బానిసలుగానే చచ్చారు.

మధ్యాసియానుండి భారతదేశంలోకి ప్రవేశించిన ఆర్యులు, వేలాది సంవత్సరాలుగా యిక్కడ వుంటోన్న ఆదిమవాసుల్ని యుద్ధాల్లో ఓడించి, బానిసల్ని జేసి, చాకిరీకి పెట్టారు. వారే శూద్రులు. ఆదిమార్య గణాల్లో ప్రథమంలో కేవలం సౌకర్యంకోసం ప్రారంభమైన యీ వర్ణవిభజన, తరాలు గడిచేకొలదీ, పాషాణంలా గడ్డకట్టి దుర్భేద్యమైన నేటి కుల వ్యవస్థగా రూపుదాల్చింది. మంత్ర తంత్రాల సహాయంతో యుద్ధ విజయాలకై కృషిజేసే పురోహితునికి, వైదిక సాంఘిక వ్యవస్థలో అత్యంత ప్రముఖమైన స్థానం లభించింది. యుద్ధోపజీవులై గణాన్ని రక్షించే క్షత్రియుల ప్రాధాన్యాన్ని గూర్చి వేరేగా చెప్పనవసరంలేదు. మనువు ఏమంటున్నాడో చూడండి!

"నా బ్రహ్మ క్షత్ర మృధ్నోతి
నా క్షత్రం బ్రహ్మవర్ధతే
బ్రహ్మ క్షత్రంచ సంపృక్తం
ఇహచాఽముత్రవర్ధతే.

బ్రాహ్మడు లేనిదే క్షత్రియుడు వృద్ధిజెందడు. క్షత్రియుడు లేనిదే బ్రాహ్మణునికి వృద్ధిలేదు. అంచేత, ఉభయులూ కలిస్తేనే ఇహమూ పరమూ లభిస్తాయి. ఈ విధంగా చేతిలో కత్తివున్న క్షత్రియుడూ, శిరస్సులో కంతిరితనమూ - నోట్లో మంత్రమూవున్న పురోహితుడూ దోపిడీ దొంగలుగా మారి, సామాజికోత్పత్తిలో వాటా సంపాయించారు. మానవ చరిత్రలో సాంఘిక దౌర్జన్యకాండ ఎక్కడైనా జరిగివుంటే, అట్టిది మనుధర్మశాస్త్రం ప్రతిపాదించిన కిరాతకం ముందు బలాదూర్ అని చెప్పితే అతిశయోక్తిగాదు. ఇంతటి అమానుషమైన పీడనని ప్రాచీన భారతంలోని ప్రజాసామాన్యం యెందుకు భరించినట్లు? ఇందుకు వొక్కటే వొక్క కారణం కన్పిస్తోంది. నాటి శూద్ర-పంచమ బానిసలు ఆయుధాలు ధరించకూడదు. అవి లేకుండా సాయుధ తిరుగుబాటు సాధ్యంగాదుగదా!!

## బానిస విధానం

వర్ణ వ్యవస్థ ఏర్పడడంతో సమిష్టి ఉత్పత్తి భగ్నమై, వ్యక్తిగత ఉత్పత్తి అమల్లోకొచ్చింది. వ్యక్తిగత ఉత్పత్తి వల్ల వ్యక్తిగత ఆస్తి, ఆ ఆస్తిలో తరతమ భేదాలూ వొచ్చాయి. ధనికులూ బీదలూ; దోపిడీ చేసేవారూ _ దోపిడీ చేయబడేవారూ; బానిస యజమానులూ- బానిసలూ; బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలూ-వైశ్య శూద్రులూ-సమాజంలో విరోధివర్గాలుగా అవతరించాయి. ధనధాన్యహిరణ్య గోసంపదకీ బానిసలకీ తామే



...గ్రంథాలయ ...
A. C. No. ...

యజమానులమని అగ్రవర్ణాలకు చెందినవారు చెప్పుకున్నారు. ఈ విధంగా అసల్లోకి వచ్చిందే బానిస యజమాన సాంఘిక వ్యవస్థ. శూద్రులు ఆనాడు ప్రధానమైన బానిసవర్గంగా పరిగణింపబడి ఊడిగంజేసే వారు. కాలక్రమేణా యీ బానిసవర్గ పరిధిలోకి వ్యవసాయ పశుపాలక వర్తకాలను నిర్వహించిన వైశ్యులుగూడా బలవంతంగా యీడ్వబడ్డారు. ఈ విధంగా శ్రమ విభజనా, వ్యక్తిగత ఉత్పత్తీ, మారకం, సొంత ఆస్తీ, వర్ణ వ్యవస్థకీ బానిస విధానానికీ మూలకారణాలయ్యాయి. "పూర్వం బానిసను పురుష మేథాగ్నిలో ఒక్కమారుగా చంపేసేవారు. నేతు అతని ప్రాణం పోకుండా అట్టిపెట్టి, ఆర్యద్విజుల దోపిడీ సన్న సెగలో అనుక్షణమూ కాగుతుండడానికి అవకాశం కల్పించారు- బానిసకు ప్రాణం వచ్చింది. బానిస యజమానికి సంపద వచ్చింది." (డాంగే బారతదేశం-183వ పేజి.)

యాజ్ఞవల్క్యుడు వంటి బ్రహ్మావాదులు, రాజులనించి వేలాది బానిసలను కానుకలుగా పొందేవారు. ఏనుగులూ గుర్రాలూ బలిసిన ఆంబోతులతో పాటు దాసదాసీలుగూడా ఆస్తిగా పరిగణించబడ్డారు. దాసదాసీల్ని గుర్రాలూ గొర్రెల్లా అవసరమున్నంతవరకు ఉపయోగించుకొని, ఆ తర్వాత నిర్దాక్షిణ్యంగా అమ్మివేయవొచ్చు. అదేమిటని అడిగే నాథుడు లేడు. భార్యనించి దూరంజేసి భర్తనీ, తల్లినించి వేరుజేసి పిల్లనీ, సంతలో పశువుల్లా అమ్మేయవొచ్చు. వారి ఆస్తిని లాక్కోవొచ్చు. 100 దాసీలను దక్షిణగా పొందిన మంత్రాలు రుగ్వేదంలో వున్నాయి!

## వైదిక రుషుల వడ్డీ వ్యాపారం

వైదికరుషులు పరమధర్మమూర్తులనీ, నోట్లో వేలు పెట్టినా కొరకడం చేతగాని అమాయకులనీ, మనకు అనూచానంగా నూరిపోస్తోన్న విషయం! అయితే యీ వైదిక రుషిపుంగవులు, షేక్స్పేరియన్ షైలాకుల కన్న నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించేవారనీ, కాబూలీవాలాలకన్న కిరాతకంగా

వ్యవహరించేవారనీ, అత్యధిక సంఖ్యాకులైన ప్రజలకీ, ఆఖరికి పండితుల వేషా లేసుకొన్న పామరులకీ తెలియదు. మన వైదిక రుషులు, వడ్డీ వ్యాపారులుగా దిగంత విశ్రాంతమైన కీర్తి ప్రతిష్టల నార్జించారు:రుగ్వేదం-10వ మండలకర్త- నాసదీయసూక్త రచయితయైన దీర్ఘతమసుడు ఎ-క్లాస్ వడ్డీవ్యాపారి. ఆతనివొద్ద వున్న బానిసలు, ఆ నరరూప పశువు కిరాతక ప్రవర్తనను భరించలేక, ఎదురుతిరిగి, తలమీద కత్తితో గంట్లు పెట్టి, కాళ్ళూచేతులు కట్టి, ఏటిలో తోసిపారేసినట్లు మనకు రుగ్వేదం ద్వారానే తెలుస్తుంది. (రుగ్వేదం 1-22-158.) కణ్వమహర్షి, తనకు అప్పులవాళ్ళు వడ్డీ అసలు ఫాయిదాల్తో అప్పులు చెల్లించడం లేదనీ, అంచేత ఆ అప్పులు పూర్తిగా వసూలయ్యేట్లు తోడ్పడమనీ పవిత్ర హృదయంతో దేవుణ్ణి ప్రార్థించినవే రుగ్వేదంలోని 1-36-15;16 మంత్రాలు. ఆ కాలంలో గౌతముడు మరొహ తెగబలిసిన రుషివర్యుడు. దీర్ఘశ్రవుడనే వైదిక రుషి వణిక్ ప్రముఖుడు. వ్యాపారం జేసేప్పుడు లాభనష్టాలు మామూలేగదా ?! అంచేత వ్యాపారంలో పూరాగా దివాలాదీసి, బోర్డులు తిప్పేసిన రుషిపుంగవులుగూడా వున్నారు. అజీగర్తుడనే వైదిక రుషి, మరొక రుషికి చెల్లించాల్సిన వడ్డీ అసలు ఫాయిదాల్ని ముట్టజెప్పడానికి, తన కుమారుడైన శునశ్శేపుణ్ణి సంతలోని ఎద్దులా అమ్మివేశాడు. మానవుల్ని బానిసలుగా అమ్మివేసిన యీ విధమైన ఉదాహరణలు మనకు వైదిక వాఙ్మయంలో కోకొల్లలుగా దొరుకుతాయి. విశ్వామిత్రుడి కివ్వాల్సిన అప్పును చెల్లించేందుకు, తాళిగట్టిన భార్యనే సత్యహరిశ్చంద్రుడు నిర్దాక్షిణ్యంగా అమ్మివేశాడు. అయినా అతడు పురాణ పురుషుల జాబితాలో మహనీయుడే! ఈ విధమైన తప్పుడు రాతలు రాసినవాళ్ళకీ, వాటిని నమ్మేవాళ్ళకి సిగ్గులేదా?! మంది కొంపల్ని ముంచి, పరరాజుల కోటలు బద్దలగొట్టి, ఇతర్ల గొర్రెలూ బర్రెల్నీ దోచకొచ్చి తమకి కట్టబెట్టాలని వైదిక రుషులు ఇంద్రుణ్ణి ప్రార్థించిన ప్రార్థనలు అనేక రుగ్వేదమంత్రాల్లో

వున్నాయి: 60 వేల గుఱ్ఱాలూ, 10 వేల పాడి ఆవులూ, 2 వేల లొట్టి పిట్టలూ, తాము పొందామని గొప్పలు చెప్పుకున్న వైదిక పురోహితులు, మనకు దానస్తుతుల్లో దర్శనమిస్తారు. పరమ నిష్ఠాగరిష్ఠులైన నాటి వైదిక రుషివరేణ్యులు, బానిసయజమానులుగా వడ్డీ వ్యాపార్లుగా తెగ బలిసిన ధనవంతులుగా పూజార్లుగా రాజపురోహితులుగా వ్యవహరించి, దోపిడీ పాలకవర్గాలతో కలిసి, దోచుకొచ్చిన మూటల్లో వాటా పంచుకొన్నారు. ఉత్పత్తి సాధనాలైన భూమి, బానిసలు, పశువులపైనేగాక, ఉత్పత్తికి వినియోగపడే పనిముట్లపై సైతం వారు అత్తపెత్తనం చలాయించారు. పాలక - పురోహిత వర్గాధిపత్యాన్ని ధిక్కరిస్తే, బతికుండగా రాజదండం, చచ్చింతర్వాత నరకం వుంది జాగ్రత్త- అంటో అశేష సామాన్యప్రజల్ని హెచ్చరించారు. స్వయం నియమిత ధర్మశాస్త్రవేత్తల వేషాలేసుకొన్న యీ పరాన్నభుక్కులు, తమ హక్కుల్ని తామే నిర్ణయించుకొని, సమాజంలోని అత్యధిక ప్రజానీకానికి విధుల పేరిట అడ్డమైన చాకిరీని అంటగట్టి, ఆజన్మాంతం అగర్భదారిద్ర్యాన్ని ఆస్తిగా సంక్రమింపజేశారు. ఈ గర్భదరిద్రులు దారుణ నిరంకుశ శాసనాలకి వ్యతిరేకంగా తిరగబడ్డప్పుడు, వారి పీకలు కోయించి, కోట గుమ్మాలపై వేలాడదీయించారు. తమ వర్గ ప్రయోజనాల్ని కాపాడే నిరంకుశరాజు దైవాంశసంభూతుడని సామాన్య ప్రజల్లో ప్రచారం జేశారు.

## ప్రాచీన భారతంలో బానిసల తిరుగుబాట్లు

దోపిడీవర్గానికి చెందిన నాటి వైదిక రుషులపై బానిసలు తిరుగుబాటు జేసిన ఘటనలు గురించి రుగ్వేదంలోని 1-22-158 వ మంత్రం అత్యంత స్పష్టంగా వివరించింది. దురదృష్టవశాత్తూ, ప్రాచీన భారతంలోని యీ బానిసల తిరుగుబాట్లు దేశవ్యాపిత రాజకీయ విప్లవరూపం సంతరించు

కోలేదు. బానిసలు ఒక వర్గంగా తమ యజమానులపై తిరుగుబాటు జరిపిన ఉదాహరణలు యింతవరకూ చరిత్రకందలేదు. చెదురు మదురుగా జరిగిన సంఘటనలను గూర్చే మనకు కొంత సమాచారం అందుతోంది. ఏది ఏమైనా, ప్రాచీన భారతంలో బానిసల తిరుగుబాట్లపై మరింత లోతుగా పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## నాస్తిక శబ్ద నిర్వచనం

సుప్రసిద్ధ వ్యాకరణ పండితుడైన పాణిని, నాస్తిక శబ్దాన్ని యీ విధంగా నిర్వచించాడు — "అస్తి నాస్తి దిష్టమ్మతిః" (4-4-60). ఈ సూత్రానికి, కాశికాకారుడు యీ విధంగా వ్యాఖ్యానం చెప్పాడు. పరలోకం వున్నదనే మతికలవాడు ఆస్తికుడు. పరలోకం లేదనే మతి కలవాడు నాస్తికుడు. అంటే— పరలోకాన్ని అంగీకరించినవాడు ఆస్తికుడు - దాన్ని నిరాకరించినవాడు నాస్తికుడు.

పరమ కిరాతకులైన జర్మన్ నాజీలకు గురువుగా పరిగణింపదగిన మనువు, నాస్తిక శబ్దాన్ని మరో విధంగా నిర్వచించాడు. వేదప్రామాణ్యాన్ని ధిక్కరించేవాడూ, వేదం ప్రమాణ గ్రంథం కాదని వాదించేవాడూ నాస్తికుడు—అని మనువు అన్నాడు. దేవుడు లేడు అనేవాడు—నాస్తికుడు అని కొందరువ్యాఖ్యానించారు. వీరిప్రకారం సాంఖ్య,మీమాంస,దర్శనాలునాస్తిక తత్వశాస్త్రాలుగా పరిగణించవలసి వొస్తుంది. అయితే, నాస్తికుడు సైతం యీ తత్వశాస్త్రాలను నాస్తిక సిద్ధాంతాలుగా అంగీకరించడు: "నాస్తికో వేద నిందకః"- అని నాస్తిక శబ్దాన్ని మరికొందరు నిర్వచించారు. వేద ప్రామాణ్యాన్ని తిరస్కరించినవారిని, వేద నిందకులుగా జమకట్టారు. దీన్నిబట్టి, వేద ప్రామాణ్యాన్ని నిరాకరించిన బౌద్ధ, జైన, సాంఖ్య, వైశేషికులు సైతం నాస్తికులేనా?! అయితే, కాలక్రమేణా ఒక్క చార్వాకులకే వేద నిందకులనే ముద్ర స్థిరపడిపోయింది!

# చార్వాక సిద్ధాంత మూలపురుషు డెవరు ?

"బార్హస్పత్యస్తు నాస్తికః" అని హేమచంద్రుడు తన నిఘంటువులో రాశాడు. బృహస్పతి సిద్ధాంతాన్ని అనుసరించేవాడు– బార్హస్పత్యుడు. బృహస్పతి నాస్తిక వాదానికి మూలపురుషుడని తరతరాలనించి వొస్తున్న సాంప్రదాయం. అంచేతనే మాధవాచార్యులు సర్వదర్శన సంగ్రహంలో చార్వాకుని గురించి వర్ణిస్తూ, బృహస్పతి మతానుసారి – అనే విశేషణాన్ని తగిలించాడు. దేవతల గురువూ, ప్రముఖ పురోహితుడైన బృహస్పతి, నాస్తిక సిద్ధాంత మూలపురుషుడనే సాంప్రదాయం ఏ విధంగా వొచ్చిందో లోతుగా ఆలోచించవలసిన విషయం.

రాక్షస నాశనానికై యీ దుష్టవిద్యను (చార్వాకాన్ని) బృహస్పతి సృష్టించాడనీ, ఆ విధంగానే బ్రహ్మగూడా, దేవతలకు వుపదేశించిన దానికన్న భిన్నమైనవిద్యను అసురులకు ఉపదేశించాడనీ మైత్ర్యుపనిషత్తులో (7.8) వొహ కధ వుంది. ఛాందోగ్యోపనిషత్తులో గూడా, అసురులు దేహాత్మవాదులని వర్ణించారు. దేవతల తరపున ఇంద్రుడూ, అసురుల పక్షాన విరోచనుడూ, తత్వోపదేశంకోసం ప్రజాపతి దగ్గిరకి వెళ్ళారట. ప్రజాపతి వారికి వొహ నీటికుండలో ప్రతిబింబాన్ని చూపి, ఆ ప్రతిబింబమే ఆత్మయని బోధించాడట. పిపప ఇద్దరూ వెళ్ళిపోయారట. ఇంద్రుడికి సందేహం వొచ్చి మళ్ళీ వెళ్ళగా, ప్రజాపతి అతనికి నిజమైన తత్వాన్ని ఉపదేశించాడట. అసుర రాజైన విరోచనుడు, శరీరమే ఆత్మ అనుకొని, అసురులకు శరీరమే ఆత్మయని బోధించాడట. అసురుడంటే ఎవరు ? దానహీనుని, శ్రద్ధాహీనుని, యజ్ఞవిరోధిని, ఆసురుడని "శిష్టులు" పరిగణిస్తారు. పురోహితవర్గానికి చెందిన పండిత నామధారులే యీ శిష్టులు।

# చార్వాకుడు

మాధవాచార్యులు, సర్వదర్శన సంగ్రహంలో చార్వాకునిగురించి వర్ణిస్తో, బృహస్పతి మతానుసారి - నాస్తికవాద శిరోమణి-అని ప్రశంసించాడు. అంచేత బృహస్పతి తర్వాత హేతువాద సిద్ధాంతకర్తగా చాలా మంది చార్వాకునే పరిగణిస్తోన్నారు. చార్వాకుడనే పేరిట ఎవరైనా చారిత్రక వ్యక్తి వున్నాడా? కాక, హేతువాద సిద్ధాంత బద్ధవిరోధులే యీ కల్పితవ్యక్తిని సృష్టించారా-అనేది నిర్దిష్టంగా తేలని విషయం.

చారు+వాక =చార్వాక. చారు=ఆకర్షణీయమైన, వాక్=వాక్యములు పలుకువాడు. మహాభారతంలో చార్వాకుడనే వ్యక్తి వున్నాడు. వేణీసంహార నాటకంలో, ప్రబోధచంద్రోదయంలో చార్వాకుడున్నాడు. కొందరు ప్రబుద్ధులు, బుద్ధుని చార్వాకుడుగా వర్ణించారు. వాస్తవానికి బుద్ధుడు వేరు; చార్వాకుడు వేరు!

# లోకాయతులు

చార్వాక భౌతికవాదుల్ని, లోకాయతులు లోకాయతికులు లౌకాయతికులు అనే పేర్లతో పిలిచారు. సంస్కృత నైషధకర్తయైన శ్రీహర్షుడు, నైషధకావ్యం 17వ సర్గ-94వ శ్లోకంలో, లోకాయత శబ్దాన్ని నాస్తికార్థంతో ప్రయోగించాడు. అమరటీకాకారుడు, లోకాయతమంటే చార్వాక శాస్త్రమని రాశాడు. లోకాయతం-తర్కశాస్త్రానికి పర్యాయపదమని శబ్దకల్పద్రుమకారుడు రాశాడు. మానవ మేధస్సు సృష్టించగలిగిన ఉత్కృష్ట తర్కశాస్త్రాన్ని, చార్వాక హేతువాదులు అభివృద్ధిజేసినట్లు, దీన్నిబట్టి అర్థమవుతోంది. అంచేతనే పురోహితవర్గ సోంబేర్లు, చార్వాకుల్ని వితండవాదులూ శుష్కతర్క ప్రియులని నోరారా తిట్టారు.

పరలోక సంబంధమైన ఆత్మ, పరమాత్మ, మోక్షం, పూర్వజన్మ,

పునర్జన్మ, స్వర్గనరకాలు, కర్మసిద్ధాంతం యిత్యాది సరుకంతా, పారలౌకిక విషయాల కిందకి వొస్తుంది. ఈ పారలౌకిక విషయా లన్నిటినీ నిరాకరించి, వాటిని అత్యంత దారుణంగా గేలిజేసి, మానవ జీవితానికి ప్రప్రథమ ప్రాతిపదిక యీ లోకమూ, యీ లోకానికి చెందిన సుఖఃదుఖాలని ప్రతిపాదించి, అశేష సామాన్య ప్రజల్లో విశేష ప్రచారం జేసినవారు గాబట్టే, వారికి లోకాయతులు అనే అన్వర్ధ నామం వొచ్చిందని భావిస్తోన్నాను.

లోకాయత— అంటే ప్రజల్లో విశేషంగా వ్యాప్తి జెందినవారని అర్ధం. చెట్టూ పుట్టా కొట్టి, సేద్యం జేసేవారనే అర్ధంగూడా వున్నట్లు చెబుతోన్నారు. ఏది ఏమైనా, 2500 సంవత్సరాలకి పూర్వమే, లక్షోపలక్షల బానిసలకూ, దాసులకూ మహోజ్వల సందేశాన్ని అందజేసి, వారిలో ప్రగాఢ ఆత్మవిశ్వాసాన్ని కలగజేసి, యావత్ అంధవిశ్వాసాలకీ పాడెగట్ట యత్నించి, పరాన్నభుక్కులు సృష్టించిన పరమేశ్వరుడికి ఏడుకట్ల సవారీని సిద్ధంజేసి, పాలకవర్గ నిరంకుశాధికారానికి వ్యతిరేకంగా తిరగబడ్డ విప్లవకారులే లోకాయతులు. నాస్తికులు— చార్వాకులు— హైతుకులు -(వేదవిరోదులు) దేహాత్మవాదులు అనే పేర్లు వైదిక పండితులు వారికిచ్చిన వివిధ నామాలు. నాటి హేతువాదులు, తమని తాము లోకాయతులనే పేరుతోనే పిలుచుకొన్నట్లు కనిపిస్తోంది. లోకాయత ఉద్యమం, పాలకుల ఉద్యమం గాదు— పాలితుల ఉద్యమం. ఇది భూస్వాముల ఉద్యమం గాదు- పాలికాపుల ఉద్యమం. ఇది విజేతల ఉద్యమం గాదు- పరాజితుల ఉద్యమం. ఇది బానిస యజమానుల ఉద్యమం గాదు- బానిసల ఉద్యమం. ఇది యావత్ నిష్టదరిద్రుల, సంఘబహిష్కృతుల ఉద్యమం. భారతీయ కార్మిక- కర్షక ఉద్యమానికి పితామహుని లాంటి ఉద్యమం. ఇది- నా ఉద్యమం; ఇది - నీ ఉద్యమం; ఇది మన ఉద్యమం. ఒక్క మాటలో, నాటి యావత్ కష్టజీవుల సాంస్కృతిక- సాంఘిక విప్లవమే లోకాయత మహోద్యమం.

# IV

## చార్వాకుల జ్ఞాన సిద్ధాంతం

తపస్సుద్వారా ఆత్మజ్ఞానం సంపాయించగలమనీ, అదే వాస్తవమైన జ్ఞానమనీ బోధించిన భావవాదుల ప్రతిపాదనను చార్వాక భౌతికవాదులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఇంద్రియ జ్ఞాన మొక్కటే జ్ఞాన సముపార్జనకు మార్గమని వారు ఖచ్చితంగా చెప్పారు. కన్ను, ముక్కు, చెవి, నాలిక, చర్మం-యివి పంచేంద్రియాలు. కంటితో చూచి, ముక్కుతో వాసన పట్టి, చెవితో విని, నాలికతో రుచిచూసి, చర్మంతో తాకి, ప్రపంచాన్ని గూర్చి తెలుసుకొంటున్నాం. ఈ విధమైన ఇంద్రియ జ్ఞాన మొక్కటే వాస్తవమైన జ్ఞాన మనివారు ప్రతిపాదించారు. భావవాదులు సూచించే అనుమానం (ఇన్‌ఫరెన్స్) శబ్దప్రమాణం (టెస్టిమొని) యీ రెంటినీ వారు తోసి రాజన్నారు.

సృష్టి - స్థితి - లయాలకి కర్త, పునర్జన్మ దాతగా చెప్పబడే ఈశ్వరు డనేవాడు యెవ్వడూ లేడు. ప్రపంచ ఘటనలన్నీ స్వాభావికంగానే, సహజ సిద్ధంగానే జరుగుతున్నాయి. నిప్పుకి వేడి, నీటికి చల్లదనం, గాలికి సమశీతోష్ణాలు, స్వభావసిద్ధ లక్షణాలైనట్లే, జగద్వ్యాపారమంతా సహజ స్వభావం వల్లనే జరుగుతోంది.

"నిప్పు వేడిగాను, నీరు చల్లనిదిగా
గాలి సమపుతాకు గలదిగాను
ఏది వీని నిట్లు సృష్టించి యున్నది?
దాని యునికి ప్రకృతివలన కలుగు."

ఈ జగత్తు పంచేంద్రియాలకు ఎంతవరకు గోచరమవుతోందో, అంతవరకే వుంది. పంచేంద్రియాలు వ్యక్తీకరించే వస్తుసముదాయానికి భిన్నమైనది లేనేలేదు. పుణ్యపాపాలకి ఫలంగా చెప్పబడే స్వర్గనరకాలు, అప్రత్యక్షాలు కాబట్టి, పంచేంద్రియాలకు అందనివి కాబట్టి, ఆ స్వర్గనరకాలు లేనేలేవు. అప్రత్యక్షంగూడా వుందని చెప్పితే, కుందేటికొమ్ము, గొడ్రాలిబిడ్డ, గగనకుసుమంకూడా వున్నాయని ఒప్పుకోవలసి వొస్తుంది—అని వారు వాదించారు.

అదృష్టము (కంటికి కనిపించనిది) అనాఘ్రాతము (వాసన తెలియనిది) అశ్రుతము (వినపడనిది) అనాస్వాదితము (రుచికి అందనిది) అస్పృష్టము (స్పర్శకు అందనిది) అయిన స్వర్గమోక్షాది సుఖాల్ని కోరి, అత్యంత కష్ట భూయిష్టమైన తపస్సు జేస్తో జీవితాన్ని గడిపేవారు, దుస్సాహసానికి పాల్పడుతోన్నారని వారు అన్నారు. అప్రత్యక్షాన్ని ప్రత్యక్షంగా—కనిపించని దాన్ని కనిపించేదిగా—భావిస్తే జగత్తు ఉనికి నిరాకరింపబడుతుంది. ఇందుకు చార్వాకులు వొహ ఉదాహరణ యిచ్చినట్లు హరిభద్రసూరి రాసిన "షడ్దర్శన సముచ్చయం" అనే గ్రంథం ద్వారా మనకు తెలుస్తుంది.

తోడేలు పాదం (వృకపదం) చూడాలనే కోరిక వున్న భార్యకు, ఆమె భర్త ఉంగరంలోని రంధ్రంచే కల్పించబడిన తోడేలు పాదంయొక్క ఆకారాన్ని చూపించి, "ఇదే తోడేలు పాదం—చూడు" అని అన్నాడట। అమాయకురాలైన ఆమెకు ఉంగరంలోని రంధ్రాన్ని చూపడంద్వారా, తోడేలు పాదాన్ని చూపినట్లు అతడు భ్రమింపజేశాడు. ఆ విధంగానే, ధర్మవేషధారులూ, ధర్మచ్ఛద్మధూర్తులూ, వంచనాత్మక శిల్పంలో అందెవేసిన చేతులైన వేదాంతులు, ఏదో వొహ అనుమాన ప్రమాణాన్ని (ఇన్ ఫరెన్స్) చూపించి, స్వర్గలోక భోగాలచే అమాయకుల్ని మోసగించి,

ధార్మిక అంధత్వంలో అమాంతం కూలదోస్తారు - జాగ్రత్త - అని అనాడే -యిప్పటికి 2500 ఏళ్ళనాడే - వారు హెచ్చరించారు. ఈ ఉదాహరణద్వారా చార్వాక భౌతికవాదులు దాదాపు వెయ్యి సంవత్సరాలు ముందుకు చూడ గలిగారు. తాడును చూసి పాము అనుకొన్న విధంగా, మిధ్యయైన జగత్తును చూసి సత్యమని భ్రమించడం పొరపాటనే అడ్డగోలు ముడ్డివాయిద్య తర్కంతో, ఆదిశంకరుడు యెందరినో వంచించిన విషయం మనం గుర్తు తెచ్చుకుంటే, చార్వాకులు యెంతటి దూరదృష్టిని ప్రదర్శించారో మనకు తేటతెల్లమవుతుంది.

# చార్వాక సిద్ధాంతాలు శత్రువుల వక్రభాష్యాలు

జగత్తు ఏ విధంగా వునికిలోకి వొచ్చింది. పంచేంద్రియాల సహాయంతో సంపాదించే జ్ఞానంకన్న ఇంద్రియాతీతమైన జ్ఞానమనేది వుందా? ఇత్యాది అంశాలను నాటి చార్వాకభౌతికవాదులు చర్చించారు. సర్వదర్శన సారసంగ్రహంలో, చార్వాకులు ప్రతిపాదించిన జ్ఞానసిద్ధాంతం వివరించ బడింది. ప్రాచీన తర్కశాస్త్ర సంబంధమైన జటిల పదజాలంతో కూడిన యీ వివరణను, తర్కశాస్త్రపండితులు వివరించితే మరింత న్యాయం చేకూరుతుంది. చార్వాకుల జ్ఞానసిద్ధాంతంలో, విరోధులు యిరికించిన వక్రీకరణలనూ, చేసిన వక్రభాష్యాలనూ పాలనించి నీటిని విడదీసినట్లు విడదీసినప్పుడే, ఆ సిద్ధాంత ఆధిక్యత స్పష్టంగా తెలుస్తుంది. అంచేత, ప్రాచీన తర్కశాస్త్ర కోవిదులు యీ పనిని చేయాలని వినయపూర్వకంగా మనవి చేస్తోన్నాను.

సంస్కృతభాష రబ్బరు లాంటిది. ఆభాషా పండితులూ, వ్యాఖ్యానకారులూ ఊసరవెల్లుల్లాంటివారు. ఏ ఏండ కా గొడుగు పట్టి, ఏరోటిదగ్గరా

పాట పాడే యీ పండితమ్మన్యులు, ఏ పదాన్ని, ఏ విధంగా విరిచి, ఏ అర్థం జెప్పారో ఎవరికీ తెలియదు. అంచేత, చార్వాక సిద్ధాంత బద్ధ విరోధులైనవారు రాసిన గ్రంధాల్ని చదివేప్పుడు, అప్రమత్తంగా వుండడం యెంతో అవసరం. లేదా—తాడే పాముగా మనముందు సాక్షాత్కరించి మనల్ని బోల్తా గొట్టించడం తథ్యం!

## ప్రాణికోటి పుట్టుక

నేల, నిప్పు, నీరు, గాలి, అనేవి నాలుగే భూతము లున్నాయని చార్వాకులు ప్రతిపాదించారు. పంచభూతాలను వారు అంగీకరించలేదు. అప్పటి కప్పుడే తీసిన తాటిరసంలో ఏ విధమైన నిషా (మదశక్తి) వుండదు. ఆ రసాన్ని నిలవజేసి, పులియ బెట్టినప్పుడే దానిలో కైపు పుడుతుంది. ఆ విధంగానే చతుర్ భూతాలు (నేల - నిప్పు - నీరు -గాలి.) వేరు వేరుగా వున్నప్పుడు, వాటిలో చైతన్యశక్తి వుండదు. అయితే, అవి కలిసి దేహ కారంగా పరిణమించినప్పుడు, యీ చతుర్ భూతాల సంయోగంవల్ల చైతన్యశక్తి ఉద్భవిస్తుంది. ప్రాణి శరీరం నశించగానే, దానిలోని చైతన్య శక్తి (ప్రాణం) గూడా నశిస్తుంది. అంచేత, చైతన్య సహితమైన దేహమే ఆత్మ. చైతన్య రహితమైన దేహమే శవం. ఇంతకి మినహా ప్రాణి దేహంలో ఆత్మ అనేది వేరుగా లేనేలేదు. ఉన్నదనడానికి ప్రమాణంలేదు. ప్రత్యక్ష ప్రమాణమే – ప్రమాణం. పరోక్షప్రమాణాలకు చింతాకంత విలువ సైతం లేదు.

ఈ భౌతికవాద సిద్ధాంతాన్ని, మరింత స్పష్టంగా వివరించేందుకు వారు యీ క్రింది ఉదాహరణ లిచ్చారు. పసుపూ సున్నమూ రసాయనిక సమ్మేళనం చెందినప్పుడు, యీ రెండు పదార్థాలకన్న భిన్నమైన, యీ రెండు రంగులకన్న వేరైన, మరో పదార్ధమూ - మరో రంగూ ఉనికిలోకొస్తోంది.

ఆ పదార్థం - పారాణి. దాని రంగు ఎరుపు. ఆ విధంగానే, ఆకులూ వక్కా-సున్నం కలిపి నమిలితే, నోరు ఎర్రబడుతుంది. ప్రాణికోటి పుట్టుకను గూర్చి చార్వాకులు ప్రతిపాదించిన యీ సిద్ధాంతానికి నాటి రసాయనిక, వైద్యశాస్త్రాల ప్రాథమిక పురోగతియే ప్రధాన ప్రాతిపదిక. నిరాకార, నిర్గుణ, పరబ్రహ్మద్వారా శూన్యంలోంచి సృష్టికార్యం జరిగించవని వారు అంగీకరించలేదు.

## మానవ జీవితం పట్ల చార్వాకుల దృక్పథం

మానవ జీవితం పట్ల చార్వాకులకున్న భౌతికవాద దృక్పథాన్ని, మాధవాచార్యులు, సర్వదర్శన సంగ్రహంలో యీ విధంగా వివరించాడు.

"యావజ్జీవం సుఖం జీవేత్ నాస్తి మృత్యోరగోచరః
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః ?"

"బ్రతుకు వట్టును సుఖముగా బ్రతుకవలయు
మృత్యు ముఖమున పడనివాడెవడు లేడు
బూదె నలుసులుగా మారిపోయినట్టి
కాయ మీయది - మరల నేగతిని వచ్చు ?"

జీవించినంతకాలం, సుఖంగా జీవించండి. కంటికి కనిపించని మృత్యువును యెరిగినవా డెవ్వడూ లేడు. చావకుండా శిలవేసుకొనేవాడూ లేడు. మరణించిన తర్వాత పిడికెడు బూడిదయై పోయే యీ దేహం, తిరిగి రాదని నాటి చార్వాకులు ప్రతిపాదించారు. ప్రాచీన ధర్మశాస్త్రాల ప్రకారం ధర్మం, అర్థం (ధన సంపాదన), కామం (సంసార జీవితం) మోక్షం అనేవి చతుర్విధ పురుషార్థాలుగా పరిగణించబడ్డాయి. పురు

షార్థాలు- అంటే- మానవ జీవిత ఆదర్శాలు - గమ్యాలు - అని అర్థం. అయితే, యీ పురుషార్థాల్లో మొదటిదైన వైదిక ధర్మాన్నీ, నాలుగోదయిన మోక్షాన్నీ చార్వాకులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు గాబట్టే వారు భౌతికవాదులుగా పరిగణింపబడ్డారు.

"త్యాజ్యం సుఖం విషయసంగమ జన్మ పుంసాం
దుఃఖోప సృష్టమితి మూర్ఖ విచారణైషా
వ్రీహీన్ జిహాసతి సితోత్తమ తండులాఢ్యాన్
కోనామ భోస్తుష కణోపహితాన్ హితార్థీ."

దుఃఖభూయిష్టమైన సంసారసుఖం పరిత్యజించదగింది - అని మూర్ఖులంటారు. శ్రేష్టమైన వరిధాన్యంలో తాలూ, తప్పా వున్నాయని ఎవరైనా వొదిలి పెడతారా? సంసార జీవితంలో దుఃఖమున్నది గాబట్టి, అది పురుషార్థం కాకుండాపోదు. ఎంచేతనంటే, అనివార్యమైన దుఃఖాన్ని వెనక్కి నెట్టి, సుఖాన్ని మాత్రమే అనుభవించాలి. ఇందుకు వారు మానవ జీవితానికి చెందిన యెన్నో ఉదాహరణ లిచ్చారు. చేపల్లో ముళ్ళున్నాయని, చేపల్ని తినడం మానివేస్తామా ?! ధాన్యం గింజలపై పొట్టున్నదని, అన్నం తినడం మానుకొంటామా ?! అడవిజంతువులు పంటల్ని నాశనం జేస్తాయని, దుక్కి దున్నకుండా వూరుకొంటామా ?! బిచ్చగాళ్ళున్నారని కుండల్లో వండుకోవడం మానివేస్తామా? అంచేత అనివార్యమైన దుఃఖాన్ని పరిహరించి, ప్రతి వ్యక్తీ సుఖాన్ని తప్పక అనుభవించాలి. దుఃఖభూయిష్టమనే కారణం వల్ల, జీవిత సౌఖ్యాల్ని అనుభవించని పిరికి పంద, పశువుతో సమానమని వారు ఖండితంగా చెప్పారు :

కులం - మతం - దేవుని పట్ల చార్వాకులు ఈ క్రింది భావాల్ని ప్రచారం జేశారు.

**కులం** : వర్ణవ్యవస్థ స్వార్థపరుల సృష్టి. మానవ సౌభ్రాతృత్వం ఊహాజనితమైన ఆశయం మాత్రం గాదు. భౌతిక నీతిశాస్త్రం ( Materialist Ethics) అసాధ్యం గాదు సరిగదా, భౌతికనీతి (Materialist Morality) మొత్తం నీతిశాస్త్రంలో అత్యంత ఉదాత్తమైన నీతి యని వారు గాఢంగా విశ్వసించారు.

**మతం** : అతీతశక్తికి, వొక వ్యక్తి జేసే దాసోహమే- మతం.

**దేవుడు** : సర్వశక్తిమంతుడైన దేవుడు వున్నాడనే భావం - తర్క విరుద్ధమైంది. దేవుడే నిజంగా వుంటే, అన్ని అనుమానాలూ తీర్చ డానికి, అతడు మానవుల కెందుకు కన్పించడు ?!

**మోక్షం** : దేహ నాశనమే మోక్షం. దేహ విచ్ఛిత్తియే, వ్యక్తికి లభించే ముక్తి.

**నరకం** : భౌతిక కారణాల వల్ల కలిగే భౌతిక బాధ తప్ప మరెట్టి నరకమూ లేదు.

## వేద ప్రామాణ్య నిరాకరణ

రుగ్వేదం, యజుర్వేదం, సామవేదమనే మూడు వేదాలూ, (త్రయీ)అసత్యాలూ, పరస్పర విరుద్ధాలూ, పునరుక్తుల్తో, పాడిందే పాడరా పాసిపళ్ళ దాసరీ అన్న చందంగా వున్నాయి. కర్మకాండను ప్రమాణంగా (అధారిటి) భావించే పూర్వ మీమాంసకులు, ఉత్తర మీమాంసకులను దూషిస్తారు. జ్ఞానకాండను ప్రమాణంగా పరిగణించే ఉత్తర మీమాంస కులు, పూర్వ మీమాంసకుల్ని గేలిజేస్తారు. అంచేత యీ మూడువేదాలూ మూర్ఖుల ప్రలాపాలని చార్వాకులు విమర్శించారు. చార్వాకుల కాలంనాటికి వేదాల్లో చివరిదైన అధర్వణవేదం, వేదాల జాబితాలోకి యెక్కలేదు.

అంచేత వారు మూడు వేదాల్నే పరిగణనలోనికి తీసుకున్నారు. వారేమన్నారో చూడండి -

"అగ్నిహోత్రం త్రయీ వేదాస్త్రిదండం భస్మగుంఠనమ్
బుద్ధి పౌరుష హీనానాం జీవికేతి బృహస్పతి."
"అగ్నిహోత్రంబు వేదత్రయంబు మరియు
బూదెపూతయు దండంబు పుచ్చికోలు
పౌరుషము బుద్ధియును లేని వారలకును
బ్రతుకుదెరువుగా జేసిరి బ్రహ్మగారు॥

మూడు వేదాల్నీ వల్లించడం, బూడిద పూసుకోవడం, దండకమండలాలు ధరించడం, సిగ్గూబిడియం బుద్ధీజ్ఞానం లేనివాళ్ళకి బతుకుదెరువుగా బ్రహ్మ కల్పించాడని వారు ఖరాఖండీగా చెప్పారు.

## యజ్ఞయాగాలు

మోక్షమే లేకపోతే, లక్షోపలక్షల ధనాన్ని ఖర్చుబెట్టి, శరీరాన్ని తీవ్రంగా కష్టబెట్టి, వేదపండితులూ, రాజులూ యజ్ఞయాగాల్ని యెంచేత చేస్తున్నారని చార్వాకుల్ని కొందరు ప్రశ్నించారు. వైదిక ధర్మపరాయణులమని బాకాలూదే యీ కొంగ జపం రాయుళ్ళు-దొంగ కొంగలు- (ధూర్త బకములు) యజ్ఞయాగాది కర్మకాండని తమ జీవనోపాదికి ప్రధాన సాధనంగా జేసికోవడమే అందుకు కారణమని వారు తెగేసి జవాబిచ్చారు.

పురోహితవర్గ పరాన్నభుక్కుల స్వార్ధ సంకుచిత ప్రయోజనాల కోసం సృష్టించబడ్డ యీ కర్మకాండని చార్వాకులు అత్యంత తీవ్రంగా గేలిజేసి, అపహాస్యం పాల్జేశారు. యజ్ఞ సమయంలో వధింపబడే పశువులు (తెల్లగుర్రాలు-నల్ల మేకలు) చచ్చింతర్వాత స్వర్గానికి వెళ్ళడమే నిజమైతే, యజ్ఞంజేసే యజమానులు - సోమయాజులు - ఆ యాగాల్లో తమతండ్రుల్నే

చంపి, సరాసరి స్వర్గానికి యెంచేత పంపరు-అని వారు ప్రశ్నించారు: చూడండి—

"క్రతువున జంపంబడు పశు
తతి స్వర్గంబరుగు జాడ తప్పనిచో, నా
క్రతువుల యజమానులు తమ
పితరుల నేల వధింప విడిచెదరౌరా?!"

రామాయణంలోని శ్రీరాముడూ, భారతంలోని ధర్మరాజూ అశ్వమేధ యాగాలు జేశారు. ఆ యాగాన్ని గూర్చి చార్వాకు లేమన్నారో చూడండి-

"అశ్వస్యాత్రహి శిశ్నంతు పత్నీగ్రాహ్యం ప్రకీర్తితమ్
భాండైస్తద్వత్పరం చైవ గ్రాహ్యజాతం ప్రకీర్తితమ్
మాంసానాం ఖాదనం తద్వన్నిశాచర సమీరితమ్."

అశ్వమేధ యాగంజేసే సోమయాజి భార్య, గుర్రం లింగాన్ని పట్టుకోవాలి: ఇది భాండుల సాంప్రదాయం. యజ్ఞయాగాల్లో పశువుల్ని చంపి, వాటి మాంసాన్ని భోంచేయడం రాక్షసాచారం.

"త్రయో వేదస్యకర్తారో భాండ ధూర్త నిశాచరాః
జర్భరీ తుర్భరీత్యాది వచస్మృతమ్."

మూడు వేదాలకూ భాండ, ధూర్త, నిశాచరులు కర్తలనీ, జర్భరీ తుర్భరీ మొదలైన వేద పండిత వాక్కుల్ని జ్ఞాపకం జేసుకోవాలనీ చార్వాకులు గేలిజేశారు. చూడండి -

"కావున ప్రేతకార్యములు కావు ఫలప్రదముల్, ద్విజాధముల్
జీవనమార్గముం గడువజేసి రుపాయము, వేదకర్తలున్
మూవురు, భండధూర్తులును మొండి నిశాచరులన్నవారు, వా
చావిధి వాగుచుండుదురు "జర్భరి తుర్భరి" యంచు పండితుల్."

"జర్భరీ-తుర్ఫరీ" అని చార్వాకులు చెప్పిన సంకేతం, రుగ్వేద మంత్రంలో వుంది.

"సృణ్యేవ జర్భరీ తుర్ఫరీ తూనైతో కేశ తుర్ఫరీ పర్ఫరీకా"
(10-106-6.)

## తద్దినాలు - పిండాలు

దినాలు, తద్దినాలు, మాసికాలు, యిత్యాది శ్రాద్ధకర్మల్నీ, చచ్చిన వాళ్ళకి వేసే పిండాల్నీ, పౌత్తర్ల బ్రాహ్మల్నీ చార్వాకులు ఏ విధంగా గేలిజేశారో చూడండి-

"గచ్ఛతామిహ జంతూనాం వ్యర్థం పాథేయకల్పనమ్
గేహస్థ కృత శ్రాద్ధేన పథి తృప్తిరవారితా."

"చచ్చిపోయినవారికి శ్రాద్ధకర్మ
తృప్తికిని తాను హేతువౌనెడల, నింక
దిరుగు జంతువులకును పాథేయకల్ప
నంబు, లోకంబునందు వ్యర్థంబు గాదె?!"

పొరుగూళ్ళకి వెళ్ళేవాళ్ళు, తమవెంట దారిబత్తెం (పాథేయం) తీసుక వెళ్ళడం వ్యర్థం. ఎంచేతంటే, ప్రయాణం జేస్తోన్న వాళ్ళకి యింట్లో తద్దినంబెట్టి బ్రాహ్మలకి పిండాకూడు వేస్తే, మార్గమధ్యంలో వున్నవాళ్ళకి ఆ తిండి అంది, తృప్తిపడతారు గదా?!

"యది గచ్ఛేత్ పరలోకం దేహాదేష వినిర్గతః
కస్మాద్భూయో నచాయాతి బంధుస్నేహ సమాకులః"

"ఈ కాయ మీగి, పరమగు
లోకము వేంచేయుచో, "నలోపొలో" యని శో

కాకులులగు సఖి బంధుల
యాకలనము మరలజేయనయి రాదేలా?॥"

చనిపోయిన తర్వాత దేహాన్ని వొదిలిన జీవాత్మ, పరలోకానికి వెళ్ళడమే ఖాయమైతే, "అయ్యో బాబో" అంట్లో గుండే గుండే బాదుక లబోదిబో మనియేడ్చే భార్యాబిడ్డల గోడు విని, ఆ లోకానికి వెళ్ళినవాడు మళ్లీ యీ లోకానికి యెంచేత తిరిగిరాడు—అని చార్వాకులు, నాటి వైదిక పురోహితవర్గ బైరుగెడ్డాల్ని, సోంబేరుల్ని దిమ్మదిరిగిపోయే విధంగా ప్రశ్నించారు.

"స్వర్గ స్థితా యదాతృప్తిం గచ్ఛేయుస్తత్ర దానతః
ప్రాసాదస్యోపరిస్థానా మత్ర కస్మాన్నదీయతే."

"దానం బిచ్చినచో స్వ
గ్గానం బడియున్నవారు కడు తృప్తిపడం
గా, నిట మేడల నుండెడు
మానిసి మూకలకు నేల మరి యీయరహో?॥

ఈ లోకంలోని బ్రాహ్మలకి గోదాన, భూదాన, హిరణ్యదానాల్ని యిస్తే, చచ్చి స్వర్గానవున్న పితృదేవతలకు తృప్తికలిగే పక్షంలో, మేడపై వున్నవారికి కింద అంతస్తులోనే భోజనం పెట్టవొచ్చుగా—అని వారు ప్రశ్నించారు. అంచేత దినాలూ, తద్దినాలూ ఎండుగడ్డికన్న నిష్ఫలమైనవనీ, వైదిక పురోహితవర్గం తమ బతుకుదెరువు కోసం యీ మాయోపాయాల్ని పన్ని, జనం ధనాన్ని దొంగిలిస్తున్నారనీ వారు ఖచ్చితంగా చెప్పారు. మహాకవి వేమన ఏమన్నాడో చూడండి—

"పిండములను జేసి పితరుల తలపోసి
కాకులకును పెట్టు గాడ్దెలార!
పెంట తినెడి కాకి పితరుడెట్లాయెరా?
విశ్వదాభిరామ వినుర వేమ."

## స్వర్గ నరకాలు

నీతివంతంగా గడిపే మానవ జీవితంలో పొందే సుఖమే స్వర్గం. భౌతిక కారణాలవల్ల కలిగే దుఃఖమే నరకం. అంచేత, పురాణాల్లో వర్ణించబడ్డ రకరకాల నరకాలన్నీ పచ్చి అబద్ధాలు. పూర్వజన్మ, పునర్జన్మ, అనేవి లేనే లేవు. దేహ నాశనమే మోక్షం; ఇంతకన్న వేరేగా పరలోకంలో పొందే మోక్షం యేదీ లేదు. దేహమూ, ఆత్మా, రెండూ వొకటే. పుణ్య పాపాలూ, వాటివల్ల కలిగే స్వర్గ నరకాలూ లేవు. వర్ణాలూ, వర్ణాశ్రమ ధర్మాలూ మానవ కల్పితాలు. కుల ధర్మాలు కించిత్తు ప్రయోజనాన్ని కలగజేయవు అని చార్వాకులు ప్రబోధించారు. చూడండి—

> "స్వర్గములు లేవు—లేవు అపవర్గములును
> పారలౌకికమగు నాత్మ వేరలేదు
> వర్ణములు నాశ్రమాదులౌ వాని క్రియలు
> సుంతయేనియు ఫలమును జూపలేవు."

# V

## చార్వాకుల వేట

ఇలాంటి హేతుబద్ధమైన వాదనలతో, నాటి తుప్పుపట్టిన అంధ మత విశ్వాసాల్ని, వైదిక సాంఘికాచారాల్ని అత్యంత నిశితంగా విమర్శించి నాటి పామర జన జీవితాల్లో నూత్న ఆశాజ్యోతిని చార్వాకులు వెలిగించారు. అంచేతనే, నాటి పాలక—పురోహిత వర్గాలు, వీరినిగూర్చి దారుణమైన వక్రభాష్యాలు జెప్పారు. చార్వాకులు సాంఘిక అరాచక

వాదులనీ, వ్యక్తిగత దౌర్జన్యవాదులనీ, అవినీతిపరులనీ, దొంగలనీ, వ్యభిచారులనీ, దోపిడీదారులనీ, రాక్షసులనీ ప్రచారం జేశారు. మనువు—తన ధర్మశాస్త్రంలో వీరిని పాషండులనీ, నిరీశ్వరవాదులనీ తిట్టిపోశాడు. రామాయణ మహాభారతం లాంటి ఇతిహాసాల్లో, అష్టాదశ పురాణాల్లో, ధర్మశాస్త్రాల్లో, కావ్య, నాటక, ప్రబంధాల్లో, చివరికి నిఘంటువుల్లో సైతం చార్వాక శబ్దానికి అత్యంత జుగుప్సాకరమైన అర్థాన్నిచ్చారు। వాల్మీకి రామాయణం—అయోధ్య కాండలో సత్యకామ జాబాలికీ రామునికీ మధ్య సంభాషణ జరుగుతుంది. సంస్కృత భారతం—శాంతి పర్వం— 38, 39 అధ్యాయాల్లో; తెలుగు భారతం—శాంతి పర్వం—ప్రథమాశ్వాసం-60 నుండి 70వ పద్యం వరకు ధర్మరాజుకీ, చార్వాకునికీ మధ్య వివాదం రేకెత్తుతుంది. ప్రబోధ చంద్రోదయ మనే సంస్కృత నాటకం-ద్వితీయాంకంలో, నాటకకర్త చార్వాకుల్ని చెడదిట్టి వొదిలిపెట్టాడు, ఈ విధంగా సందర్భమున్నా లేకున్నా, సందుచేసుక చార్వాక భౌతికవాదం గూర్చి వక్రభాష్యాలూ, అసంబద్ధ చిత్రణలూ, అభూతకల్పనలూ, అసత్యాల్తో నింపివేశారు.

సిగపట్ల గోత్రానికి సిద్ధమైన త్రిమతకర్తలు—శంకర రామానుజ మధ్వాచార్యులు—చార్వాకుల విషయ మొచ్చేప్పటికి, కట్టగట్టుకొని ఏకమై అడ్డమైన తిట్లూ తిట్టారు. ఆ తర్వాత వారిలో వారికే కుమ్ములాట ప్రారంభమైంది. పరస్పర ద్వేషంతో, యావత్ దక్షిణ భారతాన్నీ దారుణ మారణహోమంలో దగ్ధంజేసిన యీ ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత మతస్థులు, వొకరి నొకరు నాస్తికులని తిట్టు కొన్నారు। "లింగార్చనా పరాశ్శైవా నాస్తికా సంప్రకీర్తితా" అని మధ్వులు శైవుల్ని తిట్టారు। మధ్వులు నాస్తికులేగాక పశుతుల్యులని గూడా లింగమతస్థులు ఆడిపోసు కొన్నారు। చూడండి-

"తప్త ముద్రాంకిత తను ర్నాస్తికం ధర్మ మాస్థితః పశుతుల్యాస్య విజ్ఞేయ సర్వకర్మ సు గర్హితః" అంటో శైవులు మధ్వ మతస్తుల్ని అడ్డమైన బూతులూ కూశారు.

యూరప్‌లో బైబిల్‌కీ, రోమన్ కేథలిక్ చర్చికీ వ్యతిరేకంగా శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధిజేయ యత్నించిన శాస్త్రవేత్తల్ని, కేథలిక్ చర్చికి చెందిన మతాధిపతులు ఏవిధంగా రాత్రింబవళ్ళూ వేటకుక్కల్లా వెంటాడి వేటాడి వారి చర్మాన్ని బెరడులా వొలిచి మండుతోన్న మంటల్లో నిర్దాక్షిణ్యంగా బూడిదపాల్జేసి, వారి గ్రంథాల్ని నిర్ధూమధామం గావించారో; ఆ విధంగానే ప్రాచీన భారతంలోని పాలకవర్గాల నిరంకుశాధికారానికీ, వర్ణ వ్యవస్థకీ, వర్గ దోపిడీకి వ్యతిరేకంగా తిరగబడ్డ చార్వాకుల్ని, వైదిక పురోహితవర్గ పరాన్నభుక్కులూ, బైరుగెడ్డాల రుషులూ, వారి గులాములైన రాజులూ పురుగుల్లా ఏరి పారవేసి, వారి అమూల్య గ్రంథాలు భవిష్యత్తరాలకి అందకుండా మంటల్లో కాల్చివేశారు. ఈ దహనకాండలో ఆదిశంకరుడు నిర్వహించిన పాత్ర అద్వితీయం! చార్వాకుల చెవుల్లో సీసం కాసి పోయించిన ఆ మహనీయుని పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాల్తో లిఖించాల్సిందే!!!

# చార్వాకులు తాయిగండ మతస్థులా?

విపరీత వేదాంతులూ, దొంగముట్టుల మాయలాడులూ, భర్తల్ని వొదిలేసిన భార్యలూ, మొగుళ్ళు బతికుండగానే ఏళ్ళ తరబడీ పుట్టింట్లో ఉండే మగనాళ్లూ, ముసిలిపీనిగల్ని కట్టుకొన్న పడుచు పెళ్ళాలూ, రాత్రింబవళ్ళూ పాతివ్రత్య మంత్రాన్ని వల్లించే నెరజాణలూ, జారపురుషుల భార్యలూ, పెళ్ళిగాని కన్యలూ, రుచులు మరిగిన విధవలూ,

పరస్త్రీల సంపర్కం కోరే వెధవలూ, యిత్యాది అమాంబాపతు సరుకు నాస్తికత్వాన్ని ప్రేమిస్తారని. నేటి స్వాములవార్లూ, దొంగనోట్ల బాబాలూ, పీఠాధిపతులూ, కవిసామ్రాట్లూ, రామభక్తాగ్రేసరులూ, మాతృశ్రీలూ ప్రచారం జేస్తోన్నారు. పై జాబితాలో ఏకరువు పెట్టబడ్డవాళ్ళు, స్వాములవార్ల మఠాల్లో, మతపీఠాల్లో, బాబాల శాంతి నిలయాల్లో, భజన సమాజాల్లో మనకి నిత్యం తటస్థపడుతుంటారు! అంచేత, యీఊరకుక్కల మొరుగుడుకి జవాబివ్వవలసిన అవసరం ఏమాత్రం లేదు!

చార్వాకులమతం-తాయిగండమతమని యీ లబ్ధాగ్రేసర చక్రవర్తులు ప్రచారం జేస్తున్నారు. తాయి అనగా తల్లి. గండ అనగా మగడు. తల్లిని విషయించే మతస్థులే చార్వాకులని వీరి ప్రచారం! అవును-ఏపని జేసేవాడికి ఆ ఆలోచనలే రావడం అత్యంత సహజం! సొంత కూతురైన సరస్వతిని, సయానా తండ్రియైన బ్రహ్మ అమాంతం పెళ్ళి జేసేసుకున్నాడు! అష్టాదశపురాణాల్లో మనుమరాళ్ళని ఏక్దం పెళ్ళాడిన పరమ రుషులూ, పురుషులూ మనకి సాక్షాత్కరిస్తారు! సగం పెట్టిన తర్వాత మేనత్తనే విషయం జ్ఞాపకానికొచ్చిన శ్రీకృష్ణ భగవానులూ, పదహారుపేలమంది గోపికాస్త్రీలతో శారద పున్నమి రాత్రుళ్ళలో కామకేళీ విలాసాలు జరిపిన శ్రీకృష్ణ పరమాత్మలూ, యీ భక్తాగ్రేసరుల మతంలోని దేవుళ్ళు. మదురా నగరిలో చల్లలమ్మడానికి వెళ్ళే గొల్లభామలతో రాజమార్గ మీద కొసరి కొసరి సరసాలాడుతూ, బలాత్కరించే రసికాగ్రగణ్యులూ యీ మతంలోనే వున్నారు! అంచేత కూతుళ్ళను పెళ్ళాడే దేవుళ్ళూ, దారుకావన ముని భార్యల్తో జారసాగరంలో పొర్లి దొర్లే పరమశివులూ, మనమరాళ్ళని వివాహమాడే రుషివర్యులూ, తల్లీ - పిల్లతో వొకేసమయంలో భోగించే పరమ రసికాగ్రగణ్యులూ - వొక్కమాటలో — తాయిగండ మతంగాళ్ళంతా ఏ మతంలో వున్నారో వేరేగా చెప్పనవసరం లేదు!

వ్యక్తిగత జీవితంలో పచ్చి వ్యభిచారులుగా ప్రవర్తించే మహాను భావులే, సాంఘిక జీవితంలో రామభక్తాగ్రేసరులుగా చలామణీ గావడం అందరెరిగిన విషయమే! దగ్గిరకొచ్చిన ఏపిల్ పళ్ళలాంటి కన్నెపిల్లల్తో కామకేళీ విలాసాలు సల్పే యీ ఆస్తిక సార్వభౌములే, నాస్తికులు- నీతి నియమరహితులని సిగ్గూ బిడియం విడిచి ప్రచారం జేస్తోన్నారు.

## చార్వాకులు జారులా - చోరులా ?

సుఖ దుఃఖ సమ్మిశ్రితమైన మానవజీవితంలో, దుఃఖాన్ని వెనక్కి నెట్టి, సుఖాన్ని నీతియుక్తంగా అనుభవించాలి - అని చార్వాకులు నాటి సామాన్య ప్రజానీకానికి బోధించి ఆశాసందేశాన్ని వినిపించారు. నీతి వంతంగా జీవితసుఖాల్ని అనుభవించడమే పరమ పురుషార్థమనీ, మానవ జీవిత ప్రధాన లక్ష్యమనీ వారు ప్రబోధించారు. వాస్తవ మిది కాగా - "అప్పుచేసి పప్పుకూడు తినాలి" అని వారు జనానికి బోధించారని వైదిక పండితమ్మన్యులు, వారి సిద్ధాంతాలకి వక్రభాష్యం జెప్పారు. చూడండి–

"బ్రతుకు నట్టును సుఖముగా బ్రతుకవలయు
బదులు చేసియు నేయి ద్రావంగవలయు ."

"భోజనం దేహి రాజేంద్రా ఘృత సూపం సమన్వితం" అంటో వందిమాగధుల్లా స్తోత్రపాఠాలు చదివి పొట్టలు నింపుకున్న వీరు, చార్వాకులు అప్పుచేసి పప్పుకూడు తినమని బోధించారని ప్రచారం జేయడంకన్న హాస్యాస్పదమైన విషయం మరొకటి వుంటుందా?!

"పిబ ఖాదచ జాత శోభనే! యదతీతం వరగాత్రి! తన్నతే సహి భీరు! గతం నివర్తతే సముదయమాత్ర మిదం కళేబరమ్." (షడ్దర్శన

సముచ్చయం - హరిభద్రసూరి) సుందరీ, తాగదగినది, తాగదగనిది అనే వివక్షత లేకండా మదిరను సేవించు. తిన దగినది, తినదగనిది, అనే విచక్షణ లేకండా మాంసాన్ని తిను. నీ యవ్వనం సఫలం గావించుకో. పోయిన యవ్వనం తిరిగి రాదు - అని చార్వాకులు బోధించారని హరి భద్రసూరి రాశాడు. చక్కని చుక్కలాంటి పిల్లని, పక్కలో పెట్టుక ఊరకుక్కల్లా అనుభవించమనీ, నీతి నియమాలూ, వావి వరుసలూ, పరువు మర్యాదలూ విడిచి, తిని తాగి పచ్చి వ్యభిచారుల్లా జీవితం గడప మని చార్వాకులు బోధించారని, యీ పురోహితవర్గ కాలసర్పాలు, వ్యాఖ్యాతల వేషాలు దాల్చిన యీ పచ్చి అబద్ధీకులు, యీ స్వయం నియ మిత ధర్మరక్షకులు, దోపిడీవర్గాల గేట్లదగ్గిర అహోరాత్రాలూ కాపలా గాసే యీ పుండాకోర్లు రాశారు. చార్వాక భౌతికవాదుల్ని గూర్చి యీ వ్యాఖ్యాతలు రాయని అబద్ధం లేదు; మేయని అశుద్ధం లేదు; తిట్టని తిట్టు లేదు; కొట్టని దెబ్బలేదు; పెట్టని హింసలేదు; అంటగట్టని నేరం లేదు.

ఈ భక్తాగ్రేసరులపై, వీళ్ల గులాములైన పాలకవర్గాలపై చార్వా కులు ఆరోపించాల్సిన ఆరోపణల్ని, వీరే చార్వాకులపై ఆరోపించడం మహాదారుణమైన విడ్డూరం: అంగనాలింగనాల్నీ, తాగుబోతు తనాన్నీ విశృంఖల విహారాన్నీ చార్వాకులు ప్రచారం జేశారని యీ పురోహితవర్గ గురివింద గింజలు రాశారు. అచ్చోసిన ఆంబోతుల్లా మగాళ్ళు, ఎద్దైన గేదెల్లా ఆడాళ్లూ పచ్చి వ్యభిచార జీవితం గడపాలని చార్వాకులు నిజంగానే బోధించి వుంటే, వారిని పిచ్చికుక్కలకింద జనం జమకట్టి, కీలూ కీలూ తొలగించి విరగదన్నేయరా?! చార్వాకులు రండతనాన్నీ, ముండతనాన్నీ, తాయిగండతనాన్నీ, ముండల ముఠాకోరుతనాన్నీ నిజంగానే బోధించి వుంటే, వాళ్ళని ఊరకుక్కలకింద ప్రజలు పరిగణించి వొళ్ళంతా వాయ

గొట్టరా!! ఊరి కుత్తరానికి పంపరా!! జార, చోర, భోగలాలసత్వాన్ని ప్రబోధించేవారిని లక్షోపలక్షల ప్రజలు అనుసరిస్తారా? అశేష సామాన్య ప్రజల హృదయ మందిరాల్లో చార్వాకం చోటు చేసుకొన్నప్పుడే, ఆ ఉద్యమం మహోగ్రమైన భౌతికశక్తిగా పరిణమించడానికి అవకాశం వుంటుంది. పాలకవర్గాల్ని బహిరంగంగా సవాల్ జేయగల ఛాలెంజింగ్ పొజిషన్‌లో చార్వాకు లున్నప్పుడే, వారిని పాలకవర్గాలు దుంపనాశనం జేయడానికి సిద్ధపడ్తారు. అప్పుడే పాలకవర్గ జోహుకుందారులైన పురోహితవర్గాలు అత్యంత నీతిబాహ్యమైన ప్రచారం జేసి, చార్వాకులపై జుగుప్సాకరమైన నేరాలు ఆరోపించడం జరుగుతుంది.

వాస్తవానికి అంగనాలింగనాల్ని గూర్చి రాసిం దెవరు? చెక్కిటపై చెక్కిట జేర్చి, మల్లె-మావీ పగిది పెనగి, కాముక శృంగార కేళిలో అలసిపోయే బాలామణిని పట్టుక వొదలని గోపాలుణ్ణి వర్ణించే జయదేవుడు లాంటి శృంగార కవులు కారా? జయదేవుని గీత గోవిందంలో అడుగడుగునా అంగనాలింగనాలు లేవా? కాళిదాసు కుమార సంభవంలో, నోటితో ఉచ్చరించడానికి వీల్లేని సంభోగ కేళీ వర్ణనలు లేవా? కాకతీయుల కాలంనాటి సామాజిక పరిస్థితులకు నిండుటద్దమైన శ్రీనాథుని క్రీడాభిరామంలో, తల్లీ కూతుళ్ళతో, అక్కా చెల్లెళ్లతో, వొహడే భోగించవొచ్చుననే జారధర్మాన్ని బ్రాహ్మణోత్తముడైన మంచనశర్మ, తన మిత్రుడైన టిట్టిభసెట్టికి బోధిస్తాడు. క్రీడాభిరామం- మధ్యయుగాల నాటి పాలక – పురోహితవర్గాల పచ్చి వ్యభిచార జీవితానికి సాహితీ ప్రతిబింబం గాదా? శ్రీనాథుని భీమఖండం, చాటువులు, పోతన భోగినీ దండకం, పెద్దన మనుచరిత్ర, సూరన్న కళాపూర్ణోదయం, భట్టుమూర్తి వసుచరిత్ర, ముక్కు తిమ్మన పారిజాతాపహరణం, రామకృష్ణుని పాండురంగ మహాత్యంలోని నిగమశర్మోపాఖ్యానం, జయదేవుని గీత

గోవిందం, క్షేత్రయ్య పదాలు, అన్నమయ్య మదురభక్తి కీర్తనలు, దాక్షిణాత్య ఆంధ్రనాయకరాజ యుగంలో పరిఢవిల్లిన పచ్చిబూతు సాహిత్యం - ఈ మొత్తం కావ్యనాటక ప్రబంధాల్ని చదివితే; తిని తాగి బోగంసానులవెంట, అంబోతుల్లా తిరిగిందెవరో తేటతెల్లమవుతుంది. పాలకవర్గాలు ఎంగిలి మెతుకులు విసిరితే రామవిలాసాలూ, విసరకపోతే రామవిలాపాలూ రాసిన కవిపండిత నామధేయులూ, రుష్యాశ్రమాల్లో ముండల ముతాకోరుల్లా జీవించి, సురా సోమ మైరేయాల్ని కడుపారా తాగిన ధర్మశాస్త్రవేత్తలూ, చార్వాకుల్ని జారులూ చోరులని కారుకూతలు కూయడం — గురివిందగింజ.... కింద నలుపెరగదనే పాత సామెతను గుర్తుకు తేవడం లేదా ?!

"లోకములోన కొందఱబలుల్.... తాటాకులలోన
వ్రాసిరి పరాంగన గూడినఁ బాపమంచు....ఎన్ని
పువ్వులన్ వ్రాలదు తేటి, యట్ల మగవాడను
వానికి దోసమున్నదే ?! (శేషం వేంకటపతి-శశాంక విజయం)

అని రాసిన దాక్షిణాత్య ఆంధ్రనాయక రాజయుగం నాటి కవి, ఏ జార ధర్మానికి ప్రతినిధి ? గుళ్లమీద చెక్కిన బొమ్మల దగ్గరనించి, బళ్ళో చెప్పే పాఠాలదాకా సమస్తం - రంకు సాహిత్యంతో నింపివేసిన వీరా - చార్వాకుల్ని జారులూ చోరులంటో తిడ్తోంది?! యమునా సైకత స్థలాల్లో సుందరాంగనల్తో సంభోగ శృంగారం వెలగబెట్టే జారుణ్ణి - దేవుణ్ణిగా నమ్మేవారే చార్వాకుల్ని నేడు తాయిగండ మతస్థులంటో దూషిస్తోన్నారు. బోగంసానుల్ని వాహకులంగా కేటాయించిన మతస్థులే, చార్వాకులు జారులంటో నోరు పారవేసుకొంటోన్నారు! మన వక్షోజ సాహితీ సామ్రాట్టులూ, అధరామృత కవితాకోవిదులూ, అహోరాత్రాలూ కష్టించి సృష్టించిన అష్టాదశ పురాణాల సంగతీ, మన మహోత్కృష్ట

ఇతిహాసాల విషయం ఏవిటి?! వేలాదివేల సుందరాంగుల్తో కులికిన విజయనగరాంధ్ర సామ్రాజ్య సార్వభౌముడు -కృష్ణరాయడు- రాయవేశ్యా భుజంగుడా? సాక్షాత్తూ దైవాంశ సంభూతుడా? ఈ ముండల ముఠా కోరుల్ని దైవాంశ సంభూతులుగా, వైదిక ధర్మరక్షకులుగా చిత్రించిన వారికి సిగ్గూ బిడియమూ మానాభిమానాల్లేవా? అత్యంత నీతిబాహ్యమైన జారజీవితాల్ని గడిపిన వీరు, వ్యభిచారులు కారు! మరి ఎవరు? దక్షిణ నాయకులు - శృంగార రసైక జీవనులు!

అంచేత, యీ దగుల్బాజీ రాతల్ని యిహనైనా కట్టిపెట్టి, చేసిన తప్పుడు ప్రచారానికీ, కూసిన తప్పుడు కూతలకీ చెంపలు వాయించు కోవడం సర్వదా శ్రేయస్కరం. అంతేగాని చార్వాకులు జారులూ చోరులూ అని నోరు పారవేసుకోవడం, దొంగతనం చేసిన దొంగ, "దొంగా దొంగా" అంటో కేకలువేస్తో పారిపోవడం వంటిది! ఏ పురాణం, ఏ కావ్యం, ఏ ప్రబంధం, ఏ ఇతిహాసమన్నా చదవండి - యీ పరమ భాగవతోత్తముల బతుకులు బయటపడతాయి.

## చార్వాకుల నేరా లేమిటి?

ఇంతకీ చార్వాకులు జేసిన నేరా లేమిటి?! మానవ జీవితంలోని దుఃఖాన్ని పరిహరించి, సుఖాన్ని అనుభవించి జీవితాన్ని ప్రేమించండి - అని చెప్పడమా? మానసిక స్వాతంత్ర్యం, మా జన్మహక్కని నేలా నింగీ ఏకమయ్యేట్లు నినదించడమా? పాలకులూ పాలితులూ, బానిసయజమానులూ బానిసలూ, అనే మానవకల్పిత కృత్రిమ భేదాల్ని మూలమట్టంగా పెకలించ ముందుకురకడమా? ఏ కారణం చేత, యీ పురోహిత వర్గాలకి చార్వాకులపై యింత కడుపుమంట? ఏ నేరం వారు జేశారని యీ కుందోదర కుబేర వర్గాల కింత ఆగ్రహం?

# భారతజాతి చరిత్రలో చార్వాకుల ప్రాధాన్యం

భారతదేశంలో క్రీ. పూ. 600 నాటికే, భౌతికవాదాన్ని రూపొందించి ప్రప్రథమంగా ప్రచారం జేసినవారు చార్వాకులు.

మానవ జీవితాన్ని గూర్చి చార్వాకులకున్న దృక్పథం భౌతికవాద సమన్వితం - హేతుబద్ధం - ప్రగతిశీలసహితం. బ్రతికిన ప్రతిక్షణం పాపభయంతో, నరకం ప్రాప్తిస్తుందేమోననే అనుమానంతో, జీవచ్ఛవంలా జీవించడం కన్న, నిర్భయంగా హాయిగా జీవిత సుఖాల్ని అనుభవించాలి - అనేదే చార్వాకభౌతికవాద సారాంశం. జన్మెత్తడమూ, జీవితం గడపడమూ పాపభూయిష్టమనే నిరాశావాద కూపంలో వున్న మానవుని, మూఢమత నమ్మకాలనుండి దూరంజేసి, ప్రగాఢ ఆత్మవిశ్వాస పూరితమైన జీవితంపై కోరిక కల్గించ యత్నించింది - చార్వాక భౌతికవాదం. వైదిక ఋషులు బోధించిన భావవాద తత్వశాస్త్రాన్ని ఖండించి, దోపిడీ వ్యవస్థకి వ్యతిరేకంగా భారతదేశ చరిత్రలో ప్రప్రథమ సాంఘిక విప్లవానికీ, తాత్విక రంగంలో అపూర్వమైన తిరుగుబాటుకీ పునాదుల్ని వేసింది చార్వాక భౌతిక వాదమే. "నాటి కాలానికి చార్వాకం చాలా అభివృద్ధిజెందిన తత్వశాస్త్రం. నీతి పునాదిగా యీ తత్వశాస్త్రాన్ని నిర్మించారు" అని అక్షయ కూమార మజుందార్ అన్నాడు. "సమస్త విలువలనూ ప్రపంచం నుంచి చార్వాకం చీపిరికట్టతో చిమ్మివేసింది. శివము, ఉత్తమము, పవిత్రము, కరుణామయమైనదంతా చార్వాకానికి సందేహాస్పదమైంది" అంటో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ వ్యాఖ్యానించడం సత్యానికి వెయ్యామడలంత దూరం!

మానవ సమానత్వాన్ని బోధించి, అంధవిశ్వాసాలపై ధ్వజమెత్తి, ప్రప్రథమ సాంఘిక తిరుగుబాటుదార్లుగా, భారతీయ సాంస్కృతిక విప్ల వోద్యమ వేగుచుక్కలుగా, జాతి చరిత్రలో మరణమెరగని స్థానాన్ని ఆక్రమించిన ఆ మహా వీరులకి, దేశం నాలుగు చెరగులా జయస్తంభా లెత్తించి, కీర్తిపతాకల్ని రెపరెపలాడించి, దారుణమైన వక్రీకరణల రూపంలో రామాయణ భారత భాగవత పురాణాల్లోకి జొచ్చిన చార్వాక భౌతికవాదులకి, మానవ విజ్ఞానాన్ని మథించి శోధించి మహోజ్వల కాంతి పుంజాల్ని విరజిమ్మి, మనోవాక్కాయకర్మల్లో కించిత్తు అవకాశవాదానికి సైతం తావీయని ఆ తేజోమూర్తులకి యివే నా నమోవాకాలు.

# 2. రామాయణంలో చార్వాకం

హిందువుల్లో కొందరికి, రామాయణం పారాయణగ్రంథం. వాల్మీకి రామాయణానికి అనువాదాలుగా రంగనాథ–భాస్కర-మొల్ల రామాయణాలు తెలుగులో వొచ్చాయి. యక్షగానాలు మొదలు అధ్యాత్మరామాయణ భజన కీర్తనల దాకా రామాయణ కథలు వందల్లాదిగా తెలుగు భాషలో రచింపబడ్డాయి.

రామాయణ పాత్రలకి అదునికత్వాన్ని అంటగట్టిన ప్రబుద్ధులు నేటి కాలంలో కొందరు లేకపోలేదు! వాల్మీకి సీతకీ, వీరు చిత్రించిన సీతకీ పోలికేలేదు. వాల్మీకి పాత్రలు పుత్తడి బొమ్మలు కాగా, వీరు చిత్రించిన పాత్రలు ఇత్తడి దిమ్మలు!

యుక్తాయుక్త జ్ఞానశూన్యులై, గుడ్డెద్దు చేలోపడ్డట్టు మొద్దుల్లా, రామాయణాన్ని పరమ పవిత్రగ్రంథంగా పారాయణం జేసేవారు ఎందరో వున్నారు. వాల్మీకి రామాయణాన్ని కొన్ని కులాలవారు-ప్రత్యేకంగా శూద్రులు-చదవరాదని, ఆ ఇతిహాసంలోని "ఫలశ్రుతి"లో రాక్షసమైన ఆంక్షను విధించారు! ఈ పారాయణ గ్రంథాన్ని పురోహితవర్గానికి చెందినవారిచే చదివించుకొని తరించాలిగాని, సొంతంగా చదివితే పాతకులు - ఘాతకులు - పతితులు - భ్రష్టులైపోతారని ఆ ఆంక్షద్వారా బెదిరించారు! ఈ పైశాచిక నిషేధంలో గర్భితమైయున్న చిదంబర రహస్య

88.866

మేమిటని పాఠకులకు సహజంగానే సందేహం వొస్తుంది. ఇంగితజ్ఞానమున్న పాఠకుడు, యీ పరమ పవిత్ర పారాయణ గ్రంధాన్ని స్వయంగా చదివితే, పరస్పరవిరుద్ధాలూ, అమానుష విషయాలూ, అసంబద్ధాలూ, అబద్ధాలూ, అత్యుక్తులూ, అతిశయోక్తులూ, అసత్యాలూ, అర్ధసత్యాలూ, అభూతకల్పనల్తో లుకలుకలాడే. దీనిలోని బండారం బయటపడిపోతుందనే భీతియే, యీ రాక్షస అంక్షలో దాగియున్న రహస్యం. యజ్ఞ గుండంలోంచి బయటికొచ్చిన యాగపురుషుడు ప్రసాదించిన పాయసాన్ని తిన్న దశరధుని రాణులకి గర్భం రావడం; దొప్పల్లో చిప్పల్లో భద్రపరచిన ఇంద్రియం చుక్కల్లోంచి మునీశ్వరులు పుట్టడం; మానవమాత్రులకి 10 తలలూ, 20 చేతులూ పుట్టుకరావడం; పరమ పవిత్ర స్థలాలుగా బాకాలూదబడిన మున్యాశ్రమాలు, మద్యమాంసాలకీ రంకుముండలకీ కేంద్రాలుగా మారడం; ముక్కుమూసుకొని తపస్సు జేసుకొంటున్న శూద్ర శంబుకుణ్ణి, అవతార పురుషుడైన రాముడు నిష్కారణంగా నరికివేయడం; కామించి వొచ్చిన శూర్పణఖ ముక్కూచెవులూ కోసివేయడం; అగ్ని ప్రవేశం జేసిన సీతని అనుమానించి, అవమానించి, అకారణంగా భీకరారణ్యాలకి తరిమివేయడం; యిత్యాది అనేకవిషయాలు స్వంతంగా రామాయణాన్ని చదివిన పాఠకునికి తెలుస్తాయి.

రామాయణంలో కన్పించే రామ రావణులు, నాటి ఆర్య ద్రావిడ దోపిడీ పాలకవర్గాలకి చెందినవారు. వీరిలో యెవరినీ సమర్ధించవలసిన అవసరం, నేటి పాఠకునికి లేదు. ఒకాడు ఇసిక తక్కెడ; మరొకాడు పేడతక్కెడ; దొందూ దొందే. రావణుని చెల్లెలైన శూర్పణఖను, రాముడు తన తమ్మునిచే ముక్కూ-చెవులూ కోయించాడు. ఆ కక్ష తీర్చు కోవడానికి రావణుడు, రాముని భార్యని లంకకి యెత్తు కెళ్ళాడు. రామ రావణ యుద్ధానికి కాంతా కనకాలు పైపై కారణాలుగా కన్పించినా, వాస్తవానికి ఆర్య ద్రావిడ పాలకవర్గాల మధ్య అధికారం రాజ్యవిస్తరణ

కోసం రగిలిన భయంకర శత్రుత్వమే. ఈ దారుణ మానవ మారణ హోమానికి దారిదీసింది.

ఈ చారిత్రక వాస్తవాన్ని మభ్యపెట్టి, నాటి దోపిడీ పాలకవర్గాలు రాజ్య విస్తరణకోసం పన్నిన కుట్రా కూహకాలకి, మసిపూసి మారేడుకాయ జేసి, కల్ల బొల్లి కథలు కల్పించి, అవతారాలు సృష్టించి, ఆయా పాత్రలచే ధర్మోపన్యాసాలు యిప్పించడం సాధారణంగా మనకు కన్పించే నగ్నసత్యం!

## అరవై వేల యేళ్ళు పాలించిన దశరధుడు

త్రేతాయుగంలో రామాయణగాధ, ద్వాపరయుగంలో భారతగాధ జరిగాయి. విచిత్రమేమంటే, రామాయణ భారతాలు రెంటిలోనూ పరశురాముడు తటస్థ పడతాడు. శివధనుర్భంగ సమయంలో కన్పించిన పరశురాముడు, అనంతరం జరిగిన భారతంలో భీష్మ కర్ణులకి శస్త్రాస్త్ర విద్యను గరిపిన ధనురాచార్యుడుగా దర్శన మిస్తాడు. ఆ విధంగానే, రామాయణంలో రాముని కుల బ్రాహ్మడుగా వ్యవహరించిన వసిష్ఠుడు, భారతంలో భీష్మునికి వేదవేదాంగాలు బోధించినట్లు కనపడుతోంది! ఈ రీత్యా, పరశురామ-వసిష్ఠులు ఎన్నివేల ఏళ్ళు జీవించారో పురాణ పండితులే వివరించాలి! అయోధ్య రాముని తండ్రి-దశరదుడు-అరవై వేల ఏళ్ళు పాలించాడు! శ్రీరాముడు పదకొండువేల సంవత్సరాలు రాజ్యం జేశాడు! ఇది సాధ్యమా-అని పాఠకులు అడిగితే, ఎంచేత సాధ్యంగాదనే జగదేక మూర్ఖులు యీ దేశంలో యింకా వున్నారు. అంతేగాదు; యీ విషయాల్ని తర్కబద్ధంగా సమర్ధించే పెద్దమనుషులు గూడా యీ దేశంలో యింకా

జీవిస్తోన్నారు: రామాయణం రంకు-భారతం బొంకు-అనే తెలుగు సామెతను యీ ప్రబుద్ధులు వింటే, కళ్ళలో నిప్పులుపోసుక, కాట్ల కుక్కల్లా ఎగబడతారు. అయితే, రామాయణంలోని రంకునూ, భారతంలోని బొంకునూ తలదన్నే ఎందరో మహానుభావులు యీ రెండు ఇతిహాసాల్లోనూ వున్నారు: ఈ గ్రంథాల్లో తారసిల్లే వ్యక్తులూ, వారి పుట్టు పూర్వోత్తరాలూ, చెప్పిన మాటలూ, చేసిన పనుల్నిగూర్చి హేతుబద్ధంగా చర్చించడం పాపకార్యంగా భావించి, ఆ విషయాల్ని డూడూ బసవన్నలా నమ్మి, వాటిని పరమసత్యాలుగా మింగేవారిని గూర్చి చేయగలిగిందేమీ లేదు. శరీరమంతా పూరాగా పుచ్చిపోయిన అహల్యా జారుడైన దేవేంద్రుడూ, బృహస్పతీ, అతడి భార్యగా – చంద్రుడి ఉంపుడుకత్తెగా పురాణాల్లో పేరుమోసిన తార, శుక్రాచార్యులూ, యిత్యాది పురాణ పురుషులకన్న రంకులవాళ్ళూ బొంకులవాళ్ళూ యీ రెండు ఇతిహాసాల్లో మనకు దివ్య సుందర సందర్శన మిస్తారు.

## శ్రీరామ - జాబాలి మధ్య తాత్విక వివాదం

చార్వాక భౌతికవాదుల కోవకి చెందినవాడే సత్యకామ జాబాలి. సత్యకామునికి పూర్వమే, మాతృస్వామిక సమాజ వ్యవస్థ అంతరించినా, ఆ వ్యవస్థకి జెందిన అవశేషాలుమాత్రం యాంత్రికంగా అనుసరింపబడ్డాయి. అందుకు ప్రత్యక్ష సాక్ష్యమే సత్యకామ జాబాలి – అనే పేరు. జాబాలి దాసి. ఆమె భర్త యెవరో, యెవరికీ తెలియదు. కలవారి యిళ్ళలో దాసిగావుంటూ, పాసిపనులు చేసికొంటూ అనేకమందిని సేవిస్తూ ఆమె కాలం గడిపింది. ఇంతకన్న ఎక్కువ వివరాలు ఆమెను గురించి ఛాందోగ్య ఉపనిషత్తు యివ్వలేదు. వాల్మీకి రామాయణంలోని అయోధ్యకాండలో, రామునికీ సత్యకామునికీ మధ్య యీ విధంగా వివాదం జరుగుతుంది.

జాబాలి శ్రీరామునితో యీ విధంగా అధర్మవాదం ప్రారంభించాడు-

"రామా, మహామేధావంతుడవూ ధైర్యశాలివైన నీకు యిలాంటి ప్రాకృత (పామర) బుద్ధి తగదు. ఎవని కెవడు బంధువు? ఎవని కెవని వల్ల ఏమి లభిస్తుంది? ఎవడికి వాడే పుడతాడు. ఎవడికి వాడే గిడతాడు. అంచేత, తల్లీ తండ్రీ యని యెవడు తాపత్రయ పడతాడో వాడు పిచ్చి వాడు! గ్రామాంతరం వెళ్ళేవాడు యెక్కడో వోహచోట వుంటాడు. ముందుకు వెళ్లేవాడు ఆ స్థలాన్ని వొదిలి మరోచోట వుంటాడు. ఈ విధంగా ఏ ప్రదేశమూ వాడిదికాదు. ఈ జీవయాత్రలో తల్లీ, తండ్రీ, పిల్లా జెల్లా, యిల్లూ డబ్బూ అంతా అలాంటివే. బుద్ధిగలవాడెవ్వడూ, వాటికోసం బాధపడడు. ఇలాంటి పరిస్థితిలో నీ తండ్రినించి సంక్రమించిన రాజ్యాన్ని నువ్వెందుకు వొదులుకోవాలి? ఆ విధంగా వొదులుకుని, విషమమూ దుఃఖభూయిష్టమైన వానప్రస్థాశ్రమాన్ని యెందుకవలంబించాలి? అంచేత, సమస్త ఐశ్వర్య సంపూర్ణమైన అయోధ్యకు వెళ్ళి హాయిగా పట్టాభిషేకం జేసుకో. పతివ్రత తన భర్తకోసం వేయికళ్ళతో యెదురుచూసేట్లు, అయోధ్య నీ కొరకు యెదురు చూస్తోంది. రాజపుత్రా- బ్రహ్మాండమైన రాజభోగాల్ని అనుభవిస్తో స్వర్గంలో దేవేంద్రునిలా, అయోధ్యలో నువ్వు స్వేచ్ఛగా విహరించు. దశరధుడు నీకేమీ కాడు; దశరధునికి నువ్వేమీ కావు. అతడొహ రాజు. నువ్వు మరో రాజువి. కాబట్టి, నేను చెప్పినట్లు చెయ్యి. ప్రాణికి తండ్రి ప్రధానకారణం గాదు. ఋతుమతియైన తల్లి గర్భాశయంలో మిళితమైన శుక్ల శోణితాలే ప్రధాన కారణం. తద్వారానే ప్రాణి పుడుతుంది. దశరదుడు యెక్కడికి వెళ్ళాలో అక్కడికే వెళ్ళాడు. ఇది సమస్త మానవులకీ స్వభావసిద్ధం. నువ్వు అనవసరంగా బాధపడుతోన్నావు. ఐహికభోగాలు (ఈలోకసంబంధమైన) త్యజించి డబ్బుకోసం ఏడ్చేవాళ్ళనీ, ధర్మంకొరకు నానా తంటాలు పడేవాళ్ళనీ చూస్తే నాకు జాలి వేస్తుంది. ఐహికభోగాలనుభవించే వాళ్ళదే

జన్మ. మిగతావాళ్ళు యీ లోకంలో నానా బాధలూ అనుభవించి చివరికి నశించిపోతారు. అష్టకా శ్రాద్ధమనీ, ప్రత్యాబ్దికమనీ, మనవాళ్ళు తద్దినాలు పెడుతుంటారు. ఈ కర్మకాండ పేరిట యెంతెంత అన్నం వ్యర్థమైపోతుందో ఆలోచించు: చచ్చినవాడు ఏమి తింటాడు?! వాడు తిన్నది మరొకనికి అందినట్లయితే, యెక్కడికో వెళ్ళినవానికి యింట్లోనే అన్నం పెడితే ముట్టుతుందిగదా?? దేవతల్ని పూజించు - యజ్ఞయాగాలు చెయ్యి - తపస్సు చెయ్యి - సమస్తమూ విడిచిపెట్టమని బోధించే గ్రంథాల్ని, డబ్బు దొంగిలించడంలో అత్యంత చతురులైనవారు సృష్టించారు. అంచేత, బుద్ధిమంతుడా — పరలోకమంటూ వొకటిలేదని తెలుసుకో. ప్రత్యక్ష ఫలితాన్ని కలగజేసే పనుల్ని మాత్రమే చెయ్యి. పరోక్ష లాభాలు కలగ జేసే పనుల్ని వెనక్కి ఈడ్చివెయ్యి. రాజ్యం స్వీకరించు. "కళ్ళకి కనిపిస్తున్నదే వుంది; కనబడనిది లేదు" - అనే సిద్ధాంతం, సర్వజన సమ్మతమైంది. నువ్వు దీన్ని అవలంబించు. లే - భరతుడు నిన్ను ప్రార్థిస్తున్నాడు - రాజ్యాన్ని స్వీకరించు." జాబాలి మాటలు విని సత్యనిష్ఠుడైన శ్రీరాముడు దృఢనిశ్చయంతో యిలా అన్నాడు—

"నా శ్రేయస్సుకోరి నువ్వు చెప్పిన మాటలు ఆచరించదగ్గవిగానే వున్నాయి. కాని నీ సూచనలు పూర్తిగా హానికరమైనవి. పైకి హితకరంగా కన్పించే యీ మాటలు అత్యంత ప్రమాదకరమైనవి. హద్దూ పద్దూ లేకండా తిరుగుతూ, పాపకార్యాలు చేస్తూ, వైదికధర్మం విడిచినవాణ్ణి సజ్జనులు దగ్గిరకి రానివ్వరు. ఒక వ్యక్తి అగ్రవర్ణస్తుడో అధమవర్ణస్తుడో, వీరుడో భీరుడో, శుచి గలవాడో అశుచిగలవాడో ఆ సంగతులన్నీ వాని ప్రవర్తనే స్పష్టంజేస్తుంది. వాస్తవానికి దుశ్శీలుణ్ణయి, పైకి శీలవంతుడుగా నటిస్తూ ధర్మమూ వైదిక ధర్మాచారమూ విడిచిపెట్టి లోకసంకరానికి దోహదం జేసే నీ ఉపదేశం ప్రకారం నడుచుకుంటే కార్యాకార్యాలూ మంచిచెడ్డలూ తెలిసిన జ్ఞానవంతుడు నన్ను ఆదరిస్తాడా? నేను నా తండ్రి

యెదట జేసిన ప్రతిజ్ఞను విడిచిపెట్టి నువ్వు చెప్పిన ప్రకారం నడిస్తే నా మాట ఎవడైనా వింటాడా? నాకు స్వర్గం ఏ విధంగా ప్రాప్తిస్తుంది? యధారాజా-తధాప్రజా అన్నట్లు, రాజు లేవిధంగా ప్రవర్తిస్తే ఆ విధంగానే ప్రజలూ నడుస్తారు. భూతదయాప్రధానమై, సనాతనమైన రాజధర్మానికి సత్యమే మూలం. లోకమంతా సత్యంతోనే వుంది. మహర్షులూ దేవతలూ సత్యమే గొప్పదని చెప్పారు. సత్యమే పరమధర్మం – అదే స్వర్గానికి మూలం. సత్యమే ఈశ్వరుడు – సత్యమే లక్ష్మి. సమస్తానికీ సత్యమే ఆధారం. దానాలకూ, యజ్ఞాలకూ, హోమాలకూ, తపస్సులకూ, వేదాలకూ సత్యమే మూలం. సత్యవంతుడు లోకాలు పాలిస్తాడు. కులాలు ఉద్ధరిస్తాడు. స్వర్గసుఖ మనుభవిస్తాడు. అసత్యవంతుడు నరకం పాలౌతాడు. సత్యవాక్య పరిపాలకుణ్ణయిన నేను, నా తండ్రి ఆజ్ఞను ఏవిధంగా జవదాటగలను? లోభ, మోహ, అజ్ఞాన, తామసాలవల్ల నేను నా తండ్రి ప్రతిజ్ఞను భంగ పర్చను. అసత్యవాదులూ, చంచల చిత్తులూ, చేసే హవ్యకవ్యాల్ని దేవతలూ పితృదేవతలూ స్వీకరించరు. క్షత్రియధర్మంలో అధర్మం ఎక్కువ; ధర్మం తక్కువ. అగ్ని, వాయువు, సోముడూ, పూర్వజన్మలో వేదవిహితమైన కర్మకాండను చేయడంవల్ల, తరువాత అగ్నిదేవుడు వాయుదేవుడు సోముడుగా వెలిశారు. ఇంద్రుడు నూరు యజ్ఞాలు జేసి దేవేంద్రుడైనాడు. మహర్షులు ఉగ్రమైన తపస్సుజేసి స్వర్గానికి వెళ్ళారు. భూతదయ, దేవబ్రాహ్మణ అతిథిపూజలు, స్వర్గాని కెళ్ళడానికి మార్గాలని పెద్దలు చెప్పారు. అంచేతనే, బ్రాహ్మణోత్తములంతా యీ విషయం గుర్తించి, ధర్మ మాచరిస్తో స్వర్గసుఖా లనుభవిస్తోన్నారు. నీది విషమబుద్ధి. నువ్వు అధర్మనిరతుడవు. నాస్తికుడవు. నిన్ను తనదగ్గిర జేర్చుకున్నందుకు నేను నా తండ్రిని నిందిస్తోన్నాను.

బుద్ధుడు పచ్చిదొంగ. అతడు పరమ నాస్తికుడు. కాబట్టి ప్రజలు నాస్తికుణ్ణి గర్హించాలి. పండితుడైనవాడు నాస్తికుడి మొహం చూడరాదు.

నీకు వెనకా - ముందున్నవారు అనేకానేక శుభకార్యాలు జేశారు. కాబట్టే, ఇహపరాలు జయించి ఆకాశంలో నక్షత్రాల్లా వెలుగొందుతోన్నారు. అంచేతనే బ్రాహ్మణులు యజ్ఞయాగాలు జేస్తోన్నారు. ధర్మపరాయణులూ సజ్జనసాంగత్యం చేసేవారూ, తేజశ్శాలురూ, దానధర్మ నిరతులూ నిర్దోషులైన మునులూ లోకానికంతకీ పూజ్యులు."

(వాల్మీకి రామాయణం - అయోధ్యకాండ.)

## రామాయణ రచనా కాలం

మౌర్యసామ్రాజ్యాన్ని పాలించిన బృహద్రదుని చంపి, మగధలో పుష్యమిత్రుడు శుంగవంశం స్థాపించాడు. ఈ వంశం క్రీ. పూ. 184 నుండి క్రీ. శ. 74 వరకు దాదాపు 112 సంవత్సరాలు మగధను పాలించింది. క్రీ. పూ. 184-147 వరకు పాలించిన పుష్యమిత్రుడు, భరద్వాజ గోత్రానికి జెందిన బ్రాహ్మణుడు. వైదికమతాన్ని పెంచి పోషించిన యీతడు యెన్నో అశ్వమేధయాగాలు జేశాడు. ఈ శుంగవంశపు రాజుల కాలంలోనే రామాయణ రచన జరిగి వుంటుందని, సుప్రసిద్ధ మార్క్సిస్టు మేధావి, బౌద్ధవాఙ్మయ బ్రహ్మయైన రాహుల్ సాంకృత్యాయన్ తన "ఓల్గా-సే-గంగా" గ్రంధంలో రాశాడు. "శుంగవంశపు రాజుల మన్ననలకోసం వాల్మీకి పుష్యమిత్రుని లేక అగ్నిమిత్రుని, రాముడనే పేరుతో కీర్తించాడు." (ఓల్గా-సే-గంగా-పేజి-213.)

రామాయణం త్రేతాయుగంలో రాయబడిందని వైదికపండితులు చెబుతోన్నారు. గౌతమబుద్ధుడు క్రీ. పూ. 563 లో జన్మించాడు. త్రేతాయుగంలో వాల్మీకిచే రచించబడ్డ రామాయణంలోనికి, తదనంతరం జన్మించిన గౌతమబుద్ధుడు ఏవిధంగా ప్రవేశించాడు? పల్నాటి బ్రహ్మనాయుడు, విక్టోరియారాణీ నాణేల్ని గూర్చి మాట్లాడినట్లుగా వుంది! ఇది

ఖచ్చితంగా ప్రక్షిప్తంగాదా!! తమకు అవసరమొచ్చినప్పుడల్లా, సందర్భ శుద్ధిలేకండా, కనీస చారిత్రక పరిజ్ఞానం సైతం లేకండా, విషయాల్నీ వ్యక్తుల్నీ ఇతిహాసాల్లోకి దొంగతనంగా దోపివేయడం యీ వైదిక రుషులకి పారంపర్యంగా సంక్రమించిన దగుల్బాజీ వారసత్వం.

## దొంగసృష్టి - అల్లా ఉపనిషత్తు

భారతీయ స్మృతి, పురాణేతిహాసాల్లో వేలుపెట్టని పండితుడు లేడు. ఛందస్సు నేర్చిన ప్రతికవీ, ధర్మబోధకునివేషం దాల్చిన ప్రతి ఆచార్యుడూ, ఎవరికి తోచిన శ్లోకాలు వాళ్లు రాసి, ఆ శ్లోకాలకి "సూత ఉవాచ-శౌనక ఉవాచ-వైశంపాయన ఉవాచ-భగవాన్ ఉవాచ" అనే పేర్లుబెట్టి పురాణేతిహాసాల్లో దోపివేశారు. వాస్తవానికి కురుక్షేత్ర సంగ్రామరంగంలో, కృష్ణుడు అంత పొడుగాటి భగవద్గీతను అర్జునుడికి చెప్పాడా? చెప్పేందుకి అవకాశమూ సమయమూ వుందా? చెప్పేవాడికి చాదస్తమున్నా-వినేవాడికి వివరముండొద్దూ?! ఇట్లాంటి అసంబద్ధాలూ, అబద్ధాలూ మన వేదపురాణ వాఙ్మయంలో కోకొల్లలు.

ఈ దొంగసృష్టి, ప్రపంచంలోని ఏ దేశ సాహిత్యంలో గూడా యింత నిర్భయంగా చేయబడలేదు. ఎవడో పొహకడుపు కక్కుర్తి పండితుడు మహమ్మదీయుల దేవుడైన "అల్లా" పేరిట వొక ఉపనిషత్తును సృష్టించి, దాన్ని వైదిక వాఙ్మయంలో దోపివేసిన సిగ్గుమాలిన పనిని ప్రస్తుతం ఉదహరిస్తున్నాను.

"ఓమ్ అస్మల్లాం ఇల్లామిత్రా వరుణో దివ్య నిధత్తా ఇల్లిల్లా వరుణో రజాపునర్దదుః హయామి మిత్రో ఇల్లాం ఇల్లిల్లాం వరుణో మిత్రో తేజకామాః హోతారమిన్ద్రో మహాసురింద్రా అల్లో జ్యేష్టమ్ శ్రేష్టమ్ పరమమ్ పూర్ణమ్ బ్రహ్మాణమిల్లమ్ అల్లోరసుర మహామతరకం

వరశ్చ అల్లో అల్లం అథల్ల వుక మాకకం అల్లాంవుకమనిః భేదకమ్ అల్లో యజ్ఞేన హుతహుత్వం అల్లా సూర్యచంద్రసర్వనక్షత్రాః అల్లో ఋషీణాంశ్చ దివ్యేంద్రాయ పూర్వయేయాయ పరమాణః అంతరిక్షా అల్లో పృథివ్యా అంతరిక్షం విశ్వరూపం దివ్యాని ధాతే ఇల్లిల్లా వరుణో రాజపునర్దదుః ఇల్లేకవర ఇల్లిల్లాతి ఇల్లిల్లాః ఇల్లా ఇల్లిల్లా అనాది స్వరూప అధర్వణో శాఖం హ్రూం హ్రీం జనాన్ పశూన్ సిద్ధాన్ జలచరాన్ అదృష్టం కురుకురు ఫట్ అసురసంహారిణీమ్ హ్రీం అల్లోరసుర మహామదరకం వీర్యశ్చ అల్లో అల్లాం ఇల్లిల్లాతి ఇల్లిల్లాః."

పాండిత్యం తెగ ముదిరి పాషాణపాకంలో పడ్డ కొందరు పండిత నామధారులు – అవ్యేతి ఇత్యత్ క్విప్ అవేఘూషాయై గృహ్ణాతి లా తిలా" అనే వ్యుత్పత్తిని పురస్కరించుకొని, "అల్లా" అనే శబ్దానికి తల్లి అనే అర్థాన్ని లాగారు!!! అంతటితో ఆగారా? అల్లా ఉపనిషత్తుకు విచిత్రమైన భాష్యం సైతం జెప్పారు! సిగ్గు యెగ్గూ లేని భాష్యాలు.

యజ్ఞయాగాలు జరిగే సమయాల్లో రాజస్థానాల్లోని పండిత పరిషత్తుల్లో, ఉపనిషత్ కాలంలో బ్రహ్మజ్ఞానం గూర్చి తీవ్రమైన వాదోప వాదాలు జరుగుతుండడం పరిపాటి. ఈ తాత్విక చర్చలు, వారాలు, నెలల పర్యంతం గూడా జరుగుతుండేవి. అందుక్కారణం, యజ్ఞాలు నెలలు సంవత్సరాలపాటు నిర్వహింపబడుతూండేవి! ఈ పరమ సత్యం గురించి పాఠక మహాశయులకి సందేహం రావొచ్చు. వైఖానస ఆగమ సూత్రాన్ని అందజేసిన విఖనస మహర్షి, శ్రీ లక్ష్మినారాయణ సహస్రహోమ కుండ క్రతువును (యజ్ఞం) నైమిశారణ్యంలో ప్రాచీనకాలంలో జరిపాడట! దీన్నే వ్యాసమహర్షి గూడా జరిపాడట! పన్నెండు సంవత్సరాలపాటు జరిగే యీ యజ్ఞంలో, 88 వేలమంది ఋత్విక్కులు ఆనాడు పాల్గొన్నారట! ఈ క్రతువునే శ్రీమాన్ నారాయణ రామానుజ జియ్యర్ స్వాములవారు,

1972 జూన్ 28వ తేదీనించి జూలై 10వ తేదీవరకూ, తిరపతిలో 12రోజుల పాటు 2వేల మంది ఋత్విక్కులచే లోకకల్యాణార్థం రంగరంగ వైభోగంగా జరిపించారు: (ఆంధ్రప్రభ వారపత్రిక–9–8–72.)

అంచేత, యీ తాత్వికచర్చలు అంత సుదీర్ఘంగా సాగడంలో లేశమంత ఆశ్చర్యం సైతం లేదు. ఈ చర్చల్లో పండిత పామరులూ, స్త్రీ పురుషులూ పాల్గొనేవారు. విదేహను పాలించిన జనకుడు (సీత తండ్రి) యజ్ఞం జేసేసమయాల్లో, అధ్యాత్మిక సమస్యలను గూర్చి తన ఆస్థానంలో వాదోపవాదాలు ఏర్పాటుజేసేవాడు. చర్చలో గెలిచినవారికి, బాగా బలిసిన వెయ్యి ఆవుల్నీ, ఒక్కొక్క ఆవు కొమ్ముకి కట్టిన పదేసి బంగారు నాణేల్నీ బహూకరించేవాడు: బ్రహ్మవాదిని యైన గార్గి, యాజ్ఞవల్క్య మహర్షిని, జనకుని పండిత పరిషత్‌లో ఢీకొనడం చరిత్రకందిన విషయమే. రాజు సింహాసనంపై ఆసీనుడై వుండగా, సభాసదుల సమక్షంలో, ప్రధాన పురోహితుడు ఈ తాత్విక చర్చను నిర్వహించేవాడు.

రామాయణంలోని శంబుకవధ దేనిని సూచిస్తుంది? ఏ పైశాచిక సంస్కృతిని ప్రతిబింబిస్తుంది? ఏ రాక్షసప్రవృత్తిని ప్రతిఫలింపజేస్తుంది? వైదిక పురోహితవర్గ దురాగతాలకీ కిరాతకాలకీ ఆగడాలకీ దుండగాలకీ శంబుకవధ ప్రత్యక్ష నిదర్శనం గాదా? పర్ణకుటీరాలూ సన్యాసాశ్రమాల్లోంచి పుట్టిన బ్రహ్మ జ్ఞానం, పురోహితవర్గానికి మాత్రమే చెందాలనే పైశాచిక కాంక్షకు ప్రత్యక్ష సాక్ష్యం గాదా? శూద్రశంబుకుని తపస్సు వొల్ల బ్రాహ్మణ బాలుని అకాల మరణం సంభవించిందని రామునివొద్ద కాకిగోల జేసి, ఆస్తికుడైన శంబుకుని రామునిచే నరికి వేయించిన పురోహితవర్గం నాస్తికుడైన సత్యకాముణ్ణి ముక్కముక్కలకింద కొట్టకుండా వొదిలి పెడుతుందని నేను భావించలేను. రామాయణాన్ని నిత్యం పారాయణం

జేసేవారికి, యీ కావ్యం చూసినప్పుడు, కంటిలో కారం పోసినంత ఆగ్రహం కలగవొచ్చు. అకారణ ద్వేషంతో, నిరాధారమైన నిందలు వేయడంగానీ, అనవసరమైన అభినందనలు కురిపించడంగానీ; యీ కావ్య రచనలో నా ఉద్దేశం కాదు. విప్లవ సాహితీ జగత్తులో, ప్రప్రథమ వచన కవితా మహాకావ్యంగా అవతరిస్తోన్న దీనిలోని బాగోగులను నిశితమైన విమర్శనాయుతదృష్టితో బేరీజు వేసే భారాన్ని, సాహితీ విమర్శకులకూ, పాఠకులకూ, భవిష్యత్తుకూ వొదిలి వేస్తున్నాను.

(సత్యకామ జాబాలి మహాకావ్యానికి 1972 అక్టోబరులో సి. వి. రాసిన తొలిపలుకు ఆధారంగా.)

# 3. ప్రాచీన భారతంలో హేతువాద తత్వవేత్తలు

ఉపనిషత్ యుగంలో బ్రాహ్మణ పురోహితుల్నీ, వడ్డీ వ్యాపారుల్నీ, రాజుల్నీ, వారి మోచేతి గంజినీళ్ళు తాగే భట్రాజుల్నీ, బైరుగెడ్డాల ఋషుల్నీ, వొక్క మాటలో చెప్పాలంటే యావత్ పీడక వర్గాల్నీ, వొక బ్రహ్మాండమైన భూతం వెంటాడ నారంభించింది. ఈ భూతమే-నాస్తిక ఉద్యమం; ఈభూతమే-లోకాయత మహోద్యమం.

హిందూ పురోహితవర్గం సృష్టించిన యజ్ఞయాగాది కర్మకాండనీ, మతం-దేవుడు-పరలోకం పేరిట వారు కొనసాగించిన సోంబేరు జీవిత విధానాన్నీ, సమస్త మూఢమత విశ్వాసాల్నీ, మానవుల్ని మృగాల్లాజేసిన బానిస విధానాన్నీ, మంత్రతంత్రాల్నీ, వేయేల, యావత్ బ్రహ్మాజెముళ్ళనీ, బహిరంగంగా గేలిజేసి, నడివీధిలో సవాల్‌జేసి, నీతికి పట్టాభిషేకం గట్టేందుకు ఈ నాస్తిక ఉద్యమం సిద్ధపడింది.

అత్యంత శక్తివంతమైన ఈ ఉద్యమాన్ని, విప్లవాత్మక విధ్వంస కరమైన ఈ ఉద్యమాన్ని రాజులూ, వారి జోహుకుందారులూ, బ్రాహ్మణ పురోహితులూ, బౌద్ధశ్రమణులూ, అంతా ఏకమై నాశనంచేసి, దాన్ని గోతిలో పాతిపెట్టేందుకు శతధా యత్నించారు. ఈ ఉద్యమంపై అత్యంత వికృతమైన వ్యాఖ్యానాలుజేసి, జనం దృష్టిలో దీన్నొక భయంకర కాల సర్పంగా చిత్రించేందుకు పడరానిపాట్లు పడ్డారు. ఇంతజేసినా ఈ నాస్తిక -

హేతువాద ఉద్యమం, రామాయణ భారతాల్లో, అష్టాదశ పురాణాల్లో, కావ్య, నాటక నిఘంటువుల్లో, ధర్మశాస్త్రాల్లో దర్శన గ్రంధాల్లో, బౌద్ధ, జైన, మత రచనల్లో ఈ విభిన్న శతృవుల ప్రయత్నాలన్నిటినీ వమ్ముజేసి నేటిదాకా జీవించగల్గింది.

ధర్మరాజు చార్వాక "రాక్షసుని" నడివీధిలో హత్యచేసినా, భారతంలోని భీష్ముడు నాస్తికులపట్ల అప్రమత్తంగా వుండాలని హెచ్చరించినా, ద్రౌపది వనపర్వంలో నాస్తికులను గూర్చి ప్రశ్నించినా, రాముడు జాబాలిని ఈసడించినా, భాగవతంలోని వేనుణ్ణి పూజారివర్గం నరికివేసినా, ప్రబోధ చంద్రోదయ నాటకకర్త-కృష్ణమిశ్రుడు-చార్వాకులపై పేడ కళ్ళాపు జల్లినా, ఆదిశంకరుడు నాస్తికుల చెవుల్లో సీసం కాసిపోసినా, "పండితారాధ్య చరిత్ర"లో పాల్కురికి సోమన నాస్తికుల్ని దుంప నాశనం గావించానని బీరాలు పల్కినా, ఈ మహోద్యమం ఇన్నివేల ఏళ్ళ తర్వాతగూడా నాశనం చేయబడలేదు. దీన్ని నాశనంజేసే శక్తి ఈ భూమండలంలో ఏ శక్తికీ లేదు.

ఇంతటి శక్తి గల్గిన ఈ నాస్తిక-హేతువాద ఉద్యమం మట్టిలోంచి ఎందరో మణి మాణిక్యాల్ని సృజించగల్గింది. ఆగర్భదరిద్రంలో జనించిన బానిసల్ని అసాధారణమైన తాత్వికుల్ని గావించింది. ఆ విధంగా ప్రాచీన భారతంలో ప్రభవించిన నాస్తిక-హేతువాద తత్వవేత్తల్నీ, వారి సిద్ధాంత ధోరణుల్నీ ప్రస్తుతం ప్రస్తావిస్తాను.

భారతదేశంలో ప్రప్రధమంగా నాస్తికత్వానికి రూపకల్పన జేసిన మహోదాత్త చారిత్రులు - ప్రాచీనభారతంలోని బానిసలే. గౌతమబుద్ధునికి పూర్వం వీరు జీవించారు. దేశ సంచారులైన ఈ సన్యాసులు, వైదిక మత వ్యతిరేక తాత్విక ధోరణులకి ఆద్యులు. విభిన్న సిద్ధాంత ధోరణులకి చెందిన వీరంతా నాస్తికత్వాన్నీ, బ్రాహ్మణ వ్యతిరేకవాదాన్నీ బోధించారు.

వర్ణవ్యవస్థను ఆమూలాగ్రంగా ద్వేషించిన వీరు దానిపై నిప్పులు కక్కారు. "నైతిక మానవుని" (Moral Man) ఆవిర్భావం కోసం వీరు అహోరాత్రాలూ కృషి జేశారు. "దేవుళ్ళకీ, చావుకీ వ్యతిరేకంగా పోరాటం చేయండని వీరు ప్రజలకి ఉద్బోధించారు," అని ప్రొఫెసర్ జయస్వాల్ అన్నాడు.

వీరి భావాలూ కార్యకలాపాలూ గూర్చి తెలుసుకోవడానికి, సాధికార మైన సాక్ష్యం మనకు లభించడం లేదు. ఏ బౌద్ధ-జైన గ్రంథాలు వీరిపై విషం కక్కి వీరి అమూల్య సిద్ధాంతాలకి వక్రభాష్యం జెప్పాయో, ఆ గ్రంథాలపైనే పూర్తిగా ఆధారపడవలసిన దుర్గతి మనకు పట్టింది. వైదిక మత సిద్ధాంతకర్తలూ, ఇతిహాస - పురాణ రచయితలూ, కక్కిన విషం కన్న ఈ బౌద్ధ-జైన గ్రంథకర్తలు తక్కువేమి కక్కలేదు.

## అసితకేశకంబళ్

భారతజాతి చరిత్రలో బహుశా ప్రప్రథమ భౌతికవాద తత్వవేత్తగా పరిగణింపబడాల్సినవాడు - అసితకేశకంబళ్. ఇతడు పారిపోయిన బానిసయనీ, వెంట్రుకల్తో నేయబడ్డ గొంగళిని ఎల్లప్పుడూ కప్పుకొనే వాడనీ, బుద్ధఘోషుని ద్వారా తెలుస్తోంది. బుద్ధునికన్న వయసులో పెద్దయైన ఈతడు, బుద్ధుని సమకాలికుడు. ప్రాచీన భౌతికవాదు లందరికీ ఆచార్యుడు.

నేల, నీరు, నిప్పు, గాలి, అనే నాలుగు భూతాలతో (Elements) మానవదేహం నిండివుంది అని ఈతడు చెప్పాడు.

బౌద్ధగ్రంథమైన శమన్నఫాలసూత్త, కంబళ్ భావాల్ని ఈ విధంగా వివరించింది- "దానధర్మాలు, యజ్ఞయాగాలు, బలిసమర్పణలు, అనేవి లేనేలేవు. సద్గుణ - దుర్గుణాలనేవి లేనేలేవు. పరలోకాన్ని అర్థం జేసుకొని

దానికి వెళ్ళిన బౌద్ధశ్రమణుడూ, వైదిక బ్రాహ్మడూ ఎవ్వడూ లేడు. పరలోక జ్ఞానం పొందినవాడు ఎవ్వడూ లేడు. చతుర్భూత సంయోగ ఫలితంగా, మానవుడు జన్మిస్తున్నాడు. అతడు మరణించి నప్పుడు - వానిలోని మట్టి నేలలోనూ, ద్రవం - నీటిలోనూ, వేడి - నిప్పులోనూ, ఊపిరి - గాలిలోనూ, మేధోశక్తులు (Faculties) విశ్వాంతరాళంలోనూ (Space) కలిసిపోతాయి. ఆ తర్వాత పాడెకట్టి శవాన్ని మోసుకెళ్తారు. మరణించిన వ్యక్తిని గూర్చి మంత్రాలు వల్లిస్తారు. కాలక్రమేణా వాని ఎముకలు చివికి, చివికి శిథిలమైపోతాయి.

శరీరం జీర్ణంగావడంతో పండితులూ పామరులూ అంతా నశిస్తారు. మరణానంతరం వారి ఉనికియే శూన్యం."

లోకాయత తత్వం యొక్క పునరుద్ఘాటనమే కంబళ్ సిద్ధాంతంగా కన్పిస్తోంది. చతుర్ భూతాల - యాదృచ్ఛిక సంయోగమే, చైతన్యాన్ని (Consciousness) జనింపజేస్తోంది.-అనేదే-ఈతని సిద్ధాంత సారాంశం. మదువును తయారుజేసే వస్తువులు, వాటంతటవే నిషాను కలిగివున్నవి కావు. వాటి సంయోగ ఫలితంగానే నిషా పుడుతోంది. ఆ విధంగానే చైతన్యం సైతం జనిస్తోంది. మానవదేహమూ చైతన్యమూ వొకటేనని, మదువూ నిషా వొకటేనని ప్రతిపాదిస్తోన్న కంబళ్, వస్తువునూ దాని గుణాన్నీ అవిభాజ్యంగానే (Indivisible whole) చూడాలని సూచిస్తో న్నాడు: అంతేగాదు - దేహమూ, ఆత్మా రెండూ వొకటేనని, దేహం నశిస్తే ఆత్మగూడా నశిస్తుందని కంబళ్ చెపుతున్నాడు. వాస్తవానికి - జైనమత సాహిత్యంలో ప్రతిపాదించబడ్డ అక్రియావాదమూ, బ్రహ్మజల సూత్రంలో ప్రతిపాదించబడ్డ ఉచ్ఛేద వాదమూ, కంబళ్ సిద్ధాంతం నుండి ఎరువు దెచ్చుకున్న అరువు సరుకే: ఈయన సమకాలికులైన పూర్ణకాశ్యప, ప్రకుధ కాత్యాయన ఈ భావాల్తో ఏకీభవించారు. పదార్థంతో కూడినది

తప్ప, మిగతాదంతా పూర్తిగా అబద్ధమని ఈతడు ప్రతిపాదించాడు. పదార్థాన్నీ దాని గుణాన్నీ అవిభాజ్యంగానే పరిగణించి, దాన్ని గూర్చి ఆలోచించేట్లు చేయగలగడం ద్వారా, గౌతమబుద్ధ–మహావీరులకి ఈతడు వేగుచుక్కలా దారిచూపాడు. "నేసిన వస్త్రాలన్నిటికన్న గొంగళి ఏ విధంగా అవాంఛనీయమో, ఈ సన్యాసుల సిద్ధాంతాలన్నిటికన్న కంబళ్ సిద్ధాంతం ఆ విధంగానే అవాంఛనీయం. కారణం – చలికాలంలో గొంగళి ఎంతో చలిగా, ఎండాకాలంలో ఎంతో ఉక్కగా వుంటుంది" అని గౌతమ బుద్ధుడు-కంబళ్ సిద్ధాంతంపై వ్యాఖ్యానించాడు (బుద్ధ-ఓల్డెన్‌బర్గ్-పేజీ-70) ఏ కంబళ్ సిద్ధాంతం తన ఆలోచనా సరళికి ప్రాతిపదిక నేర్పరిచిందో, దానినే ఎగతాళి జేయడానికి బుద్ధుడు సిద్ధపడ్డాడు. అట్టే చూడగా బుద్ధుడు తిన్న యింటి వాసాలు లెక్కబెట్టే సరుకులా కన్పిస్తోన్నాడు.

కంబళ్ శిష్యులను గూర్చి మనకు స్పష్టంగా తెలియడం లేదు. దిఘనికాయానికి చెందిన "సూత్తాంత"లో పాయాసి అనే వ్యక్తి, ఈయన శిష్యుడుగా చెప్పబడ్డాడు.

## పాయాసి

అసితకేశకంబళ్ శిష్యులను గూర్చి మనకు స్పష్టంగా తెలియడం లేదు. దిఘనికాయానికి చెందిన "సూత్తాంత" లో, పాయాసి అనే వ్యక్తి, ఈయన శిష్యుడుగా చెప్పబడ్డాడు. కోసలను పాలించిన ప్రసేన జిత్తుకు పాయాసి సామంతుడు. దిఘనికాయానికి చెందిన పాయాసి సూత్తాంతంలో ఇతణ్ణి గూర్చి చెప్పబడింది. ఈయన బుద్ధుని సమకాలికుడు; భౌతికవాది. ఈయనకు పరలోకంలోగానీ, ఆత్మలోగానీ, సగుణ దుర్గుణాల్లోగానీ కించిత్తు విశ్వాసంలేదు. నిదర్శనమే సుదర్శనమనీ, వాస్తవమే ప్రధానమనీ నమ్మిన ఈతడు, ఈ క్రింది పది పరిశీలనలద్వారా తన భావాల్ని ఏర్పరచుకొని, ఆస్తికులకి ఈ క్రింది పది ప్రశ్నలూ వేశాడు.

1. పరలోకంలో ఏగతి పడ్తుందో చెప్పమని, మరణశయ్యపై వున్న కొందరు పాపుల్ని ఇతడు ప్రశ్నించాడు. కాని ఎవ్వరూ జవాబు చెప్పలేదు.

2. ఈ విధమైన ప్రశ్ననే చావుకు సిద్ధంగావున్న పుణ్యాత్ముల్ని గూడా వేశాడు. సమాధానం శూన్యం!

3. దేవుళ్ళని చూసినవారు ఎవరైనా వున్నారా ?

4. దేవుణ్ణి ఎవరైనా ఎంచేత నమ్మాలి ?

5. దేవుళ్ళనీ పరలోకాన్నీ వొకడు ప్రత్యక్షంగా ఎంచేత చూడలేకపోతోన్నాడు ?

6. మరణానంతరం మహాపుణ్యం వొస్తుందని విశ్వసిస్తోన్నవారు యిప్పుడే ఎంచేత ఆత్మహత్య జేసుకోవడంలేదు ?

7. దేహంలోంచి ఆత్మ బయటికి వెళ్తోన్నప్పుడు, ఒకడు ప్రత్యక్షంగా దాన్ని ఎంచేత చూడలేకపోతోన్నాడు ?

8. ఆత్మ వుండడం ఖాయమైతే, మృతదేహం బరువు తక్కువగా, సజీవ దేహం బరువు ఎక్కువగా వుండాలి. కాని, వాస్తవానికి ఈ విధంగా ఎంచేత కన్పించడంలేదు ?

9. సజీవ ఖననం (పూడ్చి పెట్టడం) చేయబడ్డ వ్యక్తి - దేహంలోని ఆత్మ, భూమిని బద్ధలు గొట్టుకొని ఎంచేత బయటికి రావడంలేదు ?

10. శరీరాన్ని ముక్కముక్కల కింద నరికినప్పుడు, ఆత్మ ఎంచేత కన్పించడం లేదు ?

దాదాపు రెండువేల సంవత్సరాల క్రితం, అసితకేశకంబళ్ యొక్క శిష్యుడు- పాయాపి- వేసిన ఈ ప్రశ్నలకి, యూనివర్సిటీల్లో తిష్ట వేసిన- తల నెరిసిన- పండితులూ, పీఠాల్లో ఆసీనులైన అమాంబాపతు

జగద్గురువులూ, ఆదిశంకరుడు దగ్గరనించి, డాక్టర్ రాధాకృష్ణన్ వరకూ-ఎవ్వరూ-ఎవ్వరూ నేటికీ సమాధానాలు చెప్పలేకపోయారు. నిజానికి ఈ ప్రశ్నలకి జవాబులే లేవు!

## పూర్ణ కాశ్యప

ఇతడు గృహబానిస. ఇతడు పుట్టడంతో, ఇతని యజమానికి చెందిన బానిసల సంఖ్య వందకు చేరుకొందనీ, అంచేత ఈతనికీ పేరు వొచ్చిందనీ అంటారు. తన యజమాని యింటినించి ఈతడు పారిపోయాడనీ, దారి మధ్యలో దొంగలు యితణ్ణి చుట్టుముట్టి కట్టుగుడ్డల్తో సైతం దోచి, నగ్నంగా వొదిలి వేశారనీ, మహాయానశాఖకి చెందిన బుద్ధఘోషుడు రాశాడు.

"సిగ్గును దాచుకొనేందుకున్న సాధనమే వస్త్రం. నేను సన్యాసిని (అర్హత్) గాబట్టి, నాకీవిధమైన గుడ్డ అవసరం లేదు," అని ఈతడు చెప్పినట్లు బుద్ధఘోషుడు రాశాడు. ఈయన శిష్యులుగూడా దిగంబరులు గానే వున్నట్లు తెలుస్తోంది. "హత్య జేసినా; నరికి పేసినా, దొంగిలించినా, దాడి జేసినా యివేవీ పాపం కావు. యజ్ఞం జేసినా, దానమిచ్చినా, ఇవేమీ పుణ్యం కావు. ఆత్మ నిగ్రహం, సత్యవాక్కులూ- వీటివల్ల వొక వ్యక్తి సద్గుణవంతుడు కాలేడు", అని ఈతడు బోధించినట్లు బౌద్ధగ్రంథమైన దిఘనికాయం రాయడం ద్వారా, ఈతనిపై కడివెడు విషం కక్కింది. ఈతని బోధల్ని కసిదీరా వక్రీకరించింది.

## ప్రకుధ కాత్యాయన

పిప్పలాదుని శిష్యుడైన ఈతడు, యాంత్రిక భౌతికవాది. ఇతడు గౌతమ బుద్ధుని సమకాలికుడు. ఈయన మెడపై వొక కణితి వుండేది.

కాత్యాయనుని వ్యక్తిగత జీవిత విశేషాలు గూర్చి, మనకు బుద్ధఘోషుని "సుమంగళ విలాసిని" ద్వారా, బౌద్ధ గ్రంథమైన "మధ్యమ నికాయం" ద్వారా, కొంత తెలుస్తోంది. "ప్రశ్న ఉపనిషత్తు" లోని కావంధి కాత్యాయనుడూ ఇతడూ వొకడే అయివుంటాడని డాక్టర్ రాయ్ చౌదరి అభిప్రాయపడ్డాడు. (పొలిటికల్ హిస్టరి ఆఫ్ ఏన్షియంట్ ఇండియా- పేజి 33-34)

గౌతమ బుద్ధుడు జీవించియున్న కాలంలో, ఈ ముదుసలి సన్యాసి తన సిద్ధాంతాలు ప్రచారం జేస్తోండేవాడని, "మధ్యమ నికాయం" ద్వారా తెలుస్తోంది. ఈతని సిద్ధాంతం- సత్యకాయవాదం- అని బౌద్ధ గ్రంధమైన శమనఫాల సూత్రం పిలువగా, ఆత్మనష్టవాదం అని జైనగ్రంధాలు పేర్కొన్నాయి. పదార్థమే సమస్తానికి మూలమని ఈతడు ప్రతిపాదించాడు. ప్రపంచంలోని ప్రతీది, మౌలికమైన సప్తభూతాలతో (సెవెన్ ఒరిజినల్ ఎలిమెంట్స్) నిండియుందని ఈతడు ప్రచారం జేశాడు. నేల, నీరు, నిప్పు, గాలి, సుఖం, దుఃఖం, జీవం, అనేవే ఈ సప్తభూతాలు. ఈ సప్తభూతాలు, ఏ సృష్టికర్తచేత సృజింపబడలేదు; ఇవి- దేనినీ తిరిగి ఉత్పత్తి జేయవు; నిరంతరం ఒకేవిధంగా వుంటాయి. (ఫిక్సెడ్) యీ సప్తభూతాలకి మార్పుగానీ, చలనంగానీ లేదు. ఇవి పరస్పర విరుద్ధమైనవి కావు. పరస్పరమైన సుఖ దుఃఖాల్ని- ఇవి సృజించలేవు. ఈ కారణంవల్ల చంపేవాడుగానీ- తెలుసుకొనేవాడుగానీ- ఎవ్వడూ లేడు. కత్తితో వొక వ్యక్తి, మరొక వ్యక్తియొక్క శిరస్సును నరికివేసినప్పుడు, అతడు ఎవ్వరినీ చంపడంలేదు. నిజానికి అతడేం జేస్తోన్నాడంటే, ఈ చర్యద్వారా వొక ఎలిమెంట్‌లోంచి మరొక ఎలిమెంట్‌లోకి పదార్థాన్ని మార్చుతోన్నాడు.

సాంఖ్య- భగవద్గీతలలో ప్రతిపాదించబడ్డ కొన్ని భావాలకి, కాత్యాయనుని సిద్ధాంతం నాందియని, సుప్రసిద్ధ జైనమత వ్యాఖ్యాతయైన

శీలంకుడు వ్యాఖ్యానించాడు. "శూన్యంలోంచి శూన్యమే వొస్తుంది" అనేదే ఈతని మూలసూత్రం. ప్రాచీన భారతంలోని నాస్తిక సిద్ధాంతవేత్త లందరిలోనూ, ఈ నెగిటివ్ దృక్పధం వొక సామాన్య లక్షణంగా, వొక విశిష్ట లక్షణంగా మనకు కన్పిస్తోంది. చలనాన్ని (మోషన్) తిరస్కరించిన కాత్సాయనుణ్ణి, గ్రీక్ తత్వవేత్తయైన ఎంపిడోక్లెస్‌తో కొందరు పోల్చారు. మౌలికంగా ఈతడు యాంత్రిక భౌతికవాది.

## మక్కాలి గోసాల్

ఇతడు గౌతమబుద్ధ - మహావీరులకి సమకాలికుడు. వర్ధమాన మహావీరుని కన్న పదహారు ఏళ్ళు పెద్దవాడని, జైనగ్రంధమైన "భగవతి సూత్ర" ద్వారా తెలుస్తోంది. ఈతని బాల్యజీవితం గూర్చి మనకేమీ స్పష్టంగా తెలియడం లేదు. ఈయన పేరును గూర్చి బౌద్ధ - జైన గ్రంధాలు, భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చాయి. ఈయన పేరు — గోసాల మంఖలి పుత్త - అని జైన సాంప్రదాయం చెప్పింది. మంఖలి పుత్రుడైన గోసాల - అని దీని అర్ధం: మంఖ-నుండి మంఖలి అనే పదం వొచ్చింది. మంఖ - అంటే — బొమ్మలు అమ్మేవాడని అర్ధం. ఇతని తండ్రి, బొమ్మలు చేసి అమ్మేవాడనీ, తల్లి పేరు భద్రయనీ, జైన సాంప్రదాయం ద్వారా తెలుస్తోంది. ఈతని పేరు - మఖ్ఖలి గోసాల్ - అని బౌద్ధ గ్రంధాలు పేర్కొన్నాయి. మఖ్ఖలి - అంటే బురదలో దొర్లేవాడు - అని అర్ధం. గోసాల్ అనంతర జీవితానికి చెందిన వివరాల్ని బట్టి, ఈయనకు వొక కుమ్మరి కుటుంబంతో గాఢమైన సంబంధమున్నట్లు తెలుస్తోంది. గోసాల్- అంటే - గోశాలలో — పశువుల కొట్టంలో - జన్మించినవాడని అర్ధం. జైన మత స్థాపకుడైన వర్ధమాన మహావీరునిలా, బౌద్ధ మత స్థాపకుడైన గౌతమునిలా ఈతడు రాజప్రాసాదాల్లో పుట్టి పెరిగిన వాడు కాదు. గోశాలలో జన్మించిన ఈతడు బానిస.

ఈతడు తన బాల్యంలో, వొక యజమాని వద్ద సేవకుడుగా వుండే వాడని, "సుమంగల విలాసిని" లో బుద్ధఘోషుడు రాశాడు. అంచేత, ఈతడు గృహబానిస. వొక రోజు నూనె వున్న పాత్రను (Oil pot) తీసుకవెళ్తోండగా, దారిమధ్యలో అది కిందపడి ముక్కలై పోయింది. యజమాని తంతాడేమోననే భయంతో గోసాల్ పారిపోయాడు. పారిపో తోండగా తన గుడ్డలు పోగొట్టుకొన్నాడనీ, అంచేత నగ్నంగా ప్రయాణం చేశాడనీ, సమస్త ప్రాపంచిక వాంఛలనించి విముక్తి పొందిన సన్యాసిగా నాటి నుండి ఆతడు తత్వబోధ ప్రారంభించాడనీ, పొగరుబోతు బుద్ధ ఘోషుడు గోసాల్‌ను అపహాస్యం జేయడానికి తన గ్రంథంలో శతధా యత్నించాడు. భారతీయ భౌతికవాదాన్ని పెంచి పోషించి దాన్ని అభివృద్ధి జేసేందుకు అహోరాత్రాలూ కృషి సల్పిన ఈ బానిసలపై, బౌద్ధ - జైన మత వ్యాఖ్యాతలు ఎంతగా పేడకళ్ళాపు కొట్టాలో అంతగా కొట్టారు. ఎంచేతనంటే, పూర్ణకాశ్యపుని విషయంలో గూడా ఈ బుద్ధఘోషుడు ఈ విధమైన కట్టుకధనే, ఈ రకమైన పుక్కిటి పురాణాన్నే అల్లి, భవిష్యత్ తరాల కళ్ళల్లో కారం కొట్ట యత్నించాడు. కాబట్టి, బౌద్ధ - జైన రచయితల గ్రంథాలు చదివేప్పుడు, పాఠకులు అప్రమత్తులై వుండాలని మరోసారి తీవ్రంగా హెచ్చరిస్తోన్నాను.

గోసాల్ - వ్యభిచారియని జైనగ్రంథాలు రాశాయి: "హాలాహల" అనే పేరున్న వొక కుమ్మరి స్త్రీతో, గోసాల్ వున్న మాట వాస్తవమే. దీన్ని ఆధారం జేసుక, ఈయనపై వీరు విపరీతమైన దుష్ప్రచారం చేసారు. జైన మతగురువైన వర్ధమానుడూ, ఈతడూ, నలందాలో ఆరేళ్ళపాటు కలిసి వున్నారు. అప్పుడు వారి మధ్య తలయెత్తిన అభిప్రాయ భేదాలమూలంగా వారు విడిపోయారు. వాస్తవమిది కాగా, గోసాల్—భోగ లాలసుడనీ, టక్కరియనీ, జైనగ్రంథాలు చెడదిట్టాయి.

మక్కలి గోసాల్‌కి మహావీరుడు కొన్ని ఏళ్ళపాటు శిష్యుడుగా వున్నట్లు ఊహించడానికి కొన్ని ఆధారాలున్నాయి. సన్యాసం స్వీకరించిన మొదటి దశలో, మహావీరుడు వస్త్రాలు ధరించినట్లు, ఆ తర్వాత దిగంబరిగా మారినట్లు, భద్రబాహుడు రాసిన "కల్పసూత్ర" ద్వారా మనకు తెలుస్తోంది. అయితే, గోసాల్ మాత్రం మొదటి నుండీ నగ్నంగానే వుండేవాడు. బహుశా గోసాల్‌ను చూచిన తర్వాతనే, మహావీరుడు నగ్నంగా వుండేందుకు నిర్ణయించుకొన్నట్లు కన్పిస్తోంది. మహావీరునికి పూర్వమే, తాను తీర్థంకరుడనని, గోసాల తనకు తానే ప్రకటించాడు. (He himself declared) సత్యాన్వేషణలో మహోన్నత జ్ఞానం పొందినవాడే – తీర్థంకరుడు.

తాను తీర్థంకరుడనని ప్రకటించిన గోసాల్, శ్రావస్తికి వొచ్చి, వొక కుమ్మరిస్త్రీ రక్షణలో జీవించనారంభించాడు. ఇక్కడే వుండి జనానికి తన భావాలు బోధించసాగాడు. అనతికాలంలోనే అనంతమైన ప్రజాదరణకి పాత్రమయ్యాడు. దినదినాభివృద్ధి జెందుతోన్న ఈ ప్రజాదరణ, గౌతమబుద్ధ – మహావీరులకి శిరోభారంగా తయారైంది: ప్రత్యేకించి మహావీరుడు ఈతని బద్ధశత్రువుగా మారాడు.

అభిప్రాయ భేదాల వల్ల చీలిపోయిన వీరిద్దరూ తిరిగి 16 ఏళ్ళ తర్వాత, శ్రావస్తిలో కలుసుకొన్నారు. అప్పుడు మళ్ళీ తీవ్రంగా ఘర్షణపడి పరస్పరం నిందించుకొన్నారు. "పట్టరాని ఆగ్రహంతో మహావీరుడు రక్తం కక్కడం ప్రారంభించాడు." అని జైన గ్రంథాలు రాశాయి. గోసాల్ అంతిమ దశ చాలా విషాదకరంగా పరిణమించింది. తీవ్ర అస్వస్థతలో ఈతడు వుండగా, శ్రావస్తిలోనే వున్న మహావీరుడు, కొంతమంది శిష్యుల్ని అతని వొద్దకి పంపాడు. అపస్మారక దశలో వున్న గోసాల్‌ను, వారు కొన్ని ప్రశ్నలు వేయగా, అతడు అసందిగ్ధమైన జవాబులు చెప్పాడు.

దాన్ని ఆసరాగా తీసుకొన్న ఈ పరమానందయ్య శిష్యులు, గోసాల్‌ను అపహాస్యం జేయ ప్రారంభించారు. మరణానంతరం, గోసాల తప్పక నరకానికి వెళ్తాడని మహావీరుకు కసిదీరా శాపనార్థాలు పెట్టాడు.

## సిద్ధాంతాలు

ఈతని తాత్విక ధోరణి గురించి తెలుసుకోవడానికి, జైన గ్రంథాలైన- సూత్రకృతాంగ, భగవతిసూత్ర; బౌద్ధ గ్రంథాలైన- దిఘనికాయ, మధ్యమ నికాయ, అంగుత్తర నికాయ, మిలింద పన్హా, మహాబోధిజాతక- మనకు తోడ్పడతాయి.

"ఏ వ్యక్తి యొక్క సుఖ దుఃఖాలకి, ప్రత్యక్షమూ పరోక్షమైన కారణమంటూ ఏదీలేదు. దేవుళ్ళకీ, జీవులకీ, జంతువులకీ, వస్తువులకీ తమ స్వంత శక్తి, బలమూ అనేవి లేనేలేవు. ఇవన్నీ-తమ తమ పరిస్థితులవల్ల, నడపబడుతోన్నవి. కొన్ని మత నియమాలు పాటించడం ద్వారా (Following Some Vows) లేదా తపస్సుద్వారా, లేదా ఆత్మ నిగ్రహం ద్వారా, సత్‌కర్మలు చేసి, క్రమబద్ధమైన భవిష్యత్తును పొంద గలనని ఏ వ్యక్తయినా తలిస్తే, అతడు తప్పక నిరాశ చెందుతాడు. సుఖ దుఃఖాల్ని కొలబద్దతో కొందరు కొలుస్తున్నారు. అయితే, గుణంలోగానీ, పరిమాణంలోగానీ, ఇవి వృద్ధిచెందవు - క్షీణించవు. చుట్టచుట్టినపుడు, దానియొక్క పొడుగు పెరగదు- తరగదు. ఆ విధంగానే, సుఖదుఃఖాలు గూడా వృద్ధిచెందవు- క్షీణించవు." (శమన్నఫాలసూత్ర)

వైదిక మత వ్యతిరేక భావాల్ని ప్రచారం జేసిన గోసాల్, నిర్ణీత వాదాన్ని (Pre - determinism) ప్రతిపాదించాడు. సమకాలీన తాత్విక ధోరణులపై ఈతడు ఎంతో ప్రభావాన్ని ప్రసరింపజేశాడు. మనదేశంలో ఎన్నో వందల ఏళ్ళపాటు ఉనికిలోవుండి, దేశం నలుమూలలకీ వ్యాపించిన

ఆజీవికశాఖను ఈతడు స్థాపించాడు. అయితే, గోసాల్‌కి పూర్వమే, ఆజీవిక శాఖ వుందనీ, నందవాచ్ఛ- కిశ సాంకిచ్ఛ (కృత సాంకృత్య) అనేవారు ఇతనికి పూర్వం ఈ శాఖకి ఆద్యులనీ, గోసాల్ ఈ శాఖయొక్క చివరి గురువనీ కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. గోసాల్‌తత్వం- "అహేతుక" యనీ, కార్యకారణ సిద్ధాంతాన్ని ఈతడు విశ్వసించలేదనీ, ఆజీవికులు నైతికంగా పతనమైన వారనీ, అవినీతిపరులనీ, బౌద్ధగ్రంధమైన మధ్యమ నికాయం రాసింది. దేవతా విగ్రహాలపై మల మూత్ర విసర్జన చేశాడనీ, బ్రాహ్మలచే నుగ్గు నుగ్గుగా చితకకొట్టబడ్డాడనీ, గోసాల్‌ను గూర్చి జైనమత గ్రంధాలు రాశాయి!

ఆజీవికులకోసం అశోకుడు రెండు గుహలను దానం చేశాడు. అశోకుని మనుమడైన దశరధుడు, వొక గుహను దానం చేశాడు. ఏ వ్యక్తినీ, మరే సంస్థనూ ఆజీవికులు తలదాల్చరని బౌద్ధగ్రంధమైన దిఘనికాయం రాసింది. కాని, బౌద్ధ, జైన సన్యాసుల్లా వీరికి గూడా వొక నిర్ణీతమైన జీవనవిధానం వుంది. అంచేత, బుద్ధ- మహావీరులవలె, గోసాల గూడా వొక పరివ్రాజక సంఘాన్ని (Monastic Order) స్థాపించినట్లు, మనం ఊహించవొచ్చు. గోసాల, అతని శిష్యులూ పూర్తి దిగంబరంగా వుండేవారు.

"తల్లిగర్భము నుండి తాబుట్టినప్పుడు
మొ.నట బట్ట లేదు తుదను లేదు
నడుమ బట్ట గట్ట నగుబాటు కాదొకో
విశ్వదాభిరామ వినురవేమ"

అని చెప్పిన మహాకవి వేమన గూడా ఈ ఆజీవిక శాఖకి చెందిన వాడని కొంతమంది పండితుల అభిప్రాయం.

# సంజయ వేలతి పుత్త

ఇతడు గూడా బుద్ధుని సమకాలికుడే. సంజయుడు బానిస. బుద్ధుని శిష్యుల్లో సుప్రసిద్ధులైన - శారిపుత్త, మొగ్గలన్నలు- మొదట సంజయుని శిష్యులే కాని, 250 మంది శిష్యుల్తోపాటు, వీరిద్దరూ సంజయుని వదలి వేసి, బుద్ధుని వొద్దకి మూకుమ్మడిగా వెళ్ళిపోయారనీ, తత్ఫలితంగా సంజయునికి పిచ్చెక్కినంత పనై, రక్తం కక్కి, మరణించాడనీ బౌద్ధ గ్రంధాలు రాశాయి. గౌతమబుద్ధ - మహావీరుల గొప్పతనాన్ని చిత్రించ డానికి, ఈ రెండు మతాల గ్రంధకర్తలూ, విషయాల్ని గోరంతలు కొండంతలు జేసి, అతిశయోక్తులూ అర్ధసత్యాలూ రాయడం సర్వేసర్వత్రా మనకు గోచరిస్తుంది. తలపై కణితి (సంజ) వున్నందున ఈతనిని సంజయుడని పిలిచారనీ, "వేలతి" అనేది - ఈతడు బానిసయనే (Born Slave) విషయాన్ని సూచిస్తుందనీ, బుద్ధఘోషుడు సుమంగళ విలాసినిలో రాశాడు. అయితే, ఈ కృత్రిమ వర్ణనను బుద్ధున్నవాడెవ్వడూ నమ్మడు.

జైన మత సాహిత్యంలో ఈతడు "అజ్ఞానవాది"గా పేర్కొన బడ్డాడు. అజ్ఞానవాది ఎప్పుడూ గుడ్డిగా వుంటాడనీ, అంచేత, అతడు జ్ఞాన మార్గం వైపుకి వొకణ్ణి తీసుకపోలేడనీ, జైన సిద్ధాంతం భావించింది. బౌద్ధతత్వం - సంజయుణ్ణి - "అమర విక్షేపకుడు"గా పేర్కొన్నది. జైన – బౌద్ధ – గ్రంధాల్లో పేర్కొనబడ్డ అజ్ఞానవాదమూ, అమర విక్షేపకవాదమూ, ఆధునిక సందేహవాదానికీ (Scepticism) అజ్ఞేయ వాదానికీ (Agnosticism) అత్యంతసన్నిహితంగా వుంటాయి. మహా భారతంలోని - శాంతిపర్వం, అజ్ఞేయవాదులను గూర్చి ఉటంకించింది. ఈ అజ్ఞేయజిజ్ఞాసువుల ద్వారా, గౌతమబుద్ధ - మహావీరులు ఎంతగానో ప్రభావితమయ్యారు. శిష్యులు తమకు వేసిన ప్రశ్నలకి, ఖచ్చితమైన సమాధానాలు చెప్పడానికి, వీరిద్దరూ కొన్ని సందర్భాల్లో నిరాకరించారు.

సంజయుని సిద్ధాంత ప్రాతిపదిక - సందేహమే. అయితే, ముసిలి తాత అనుమాన పిశాచం మాత్రం, ఈ సిద్ధాంత సారాంశం గాదు: అత్యంత వివాదాస్పదమైన తాత్విక సమస్యలు తలెత్తినప్పుడు, మానవ అవగాహనకు అందని చిక్కు సమస్యలు ముందుకొచ్చినప్పుడు, వాటి నిర్ణయాల్ని - పరిష్కారమార్గాల్ని వాయిదా వేసి, మెదడుకు మరికొంత మేత నివ్వాలని కోరేదే ఈ అజ్ఞేయవాదం — అని డాక్టర్ బెల్వల్కర్ వ్యాఖ్యానించాడు.(History of Indian Philosophy-VOL II -P 454)

"భారతీయ గతితర్కానికి సంజయుడు పితామహుడు" అని గూడా బేల్వల్కర్ అన్నాడు. జైనగ్రంథమైన శమన్నఫాల సూత్త- ఈతని తాత్విక ధోరణిని ఈ విధంగా వివరించింది- "పరలోకం వున్నదా అని నువ్వు నన్ను అడిగితే, పరలోకం వున్నదని నేను భావిస్తే, నేను ఆ విధంగా చెప్పడం సహజమే; కాని నేను ఆ విధంగా చెప్పను. పర లోకం లేదని నేను భావిస్తే, నేను ఆ విధంగా చెప్పడం సహజమే; కాని, నేను ఆ విధంగా చెప్పను. పరలోకం ఈ విధంగా వుందనీ, ఆ విధంగా వుందనీ, నేను చెప్పను; పరలోకం ఈ విధంగా లేదనీ, ఆ విధంగా లేదనీ, నేను చెప్పను". ఈ విధమైన తార్కిక ధోరణిలో సంజయుని వివరణ సాగుతుంది. అంచేత, స్పష్టంగా నిర్ద్వంద్వంగా వొక విషయాన్ని చెప్పడమనేది ఈతని తాత్విక ధోరణిలో కన్పించదు. ఇతడు ఏ విష యాన్నీ పూర్తిగా అంగీకరించడు; దేన్నీ పూర్తిగా నిరాకరించడు. గ్రీక్ తత్వవేత్తయైన పైరో వలె సంజయుడు గూడా అజ్ఞేయవాదానికి వొక తాత్విక స్వరూపం యివ్వగలిగాడు. వ్యక్తి తన జ్ఞానపరిమితిని జాగ్రత్తగా అంచనా వేసుకోవాలనేదే- సంజయుని దృక్పథం.

చార్వాకుల్ని గూర్చి తుదిసారిగా ప్రస్తావించి ఈ వ్యాసాన్ని ముగిస్తాను. అందమైన మాటలతో ప్రజల్ని భట్టాజుల్లా పొగిడేవారే -

చార్వాకులని వాచస్పతి చెప్పాడు. సంపద పోగేసి, కోరికలు తీర్చుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొన్నవారే— చార్వాకులని మాధవాచార్యులు సెలవిచ్చాడు. పరలోక సమస్యపై చార్వాకుల దృక్పధాన్ని గూర్చి శాంత రక్షితుడు తన "తత్వసంగ్రహం"లో విపులంగా చర్చించి వారి భావాల్ని ఉటంకించాడు. చార్వాక తాత్విక ధోరణికి చెందిన పాండురంగడు అనే ఆచార్యుని భావాల్ని, కమలశీలుడు- తత్వసంగ్రహానికి రాసిన వ్యాఖ్యలో ఉల్లేఖించాడు. చార్వాకులు ప్రతిపాదించిన చతుర్భూత సిద్ధాంతాన్ని, కృష్ణమిశ్రుడు తన "ప్రబోధచంద్రోదయ" నాటకంలో అత్యంత వక్రంగా చిత్రించాడు. దీనినే సదానందుడు తన "అద్వైతబ్రహ్మసిద్ధి" అనే గ్రంధంలో చాలా విపులంగా చర్చించాడు. సంస్కృత కవి పండితుడైన శ్రీహర్షుడు "ఖండన ఖాద్య ఖాదక" అనే రచనలో, చార్వాక సిద్ధాంతాన్ని పరమవక్రంగా చర్చించడానికి వొక అధ్యాయాన్నే కేటాయించాడు.

ఈ విధంగా తరతరాలుగా భారతీయ తత్వచింతనను చార్వాకులు అత్యంత తీవ్రంగా ప్రభావితం జేయగలిగారు. అలా కాని పక్షంలో, మాధవాచార్యుల వంటి మహాపండితుడు దగ్గర నుండి, ఆయనకు పూర్వమూ, ఆయన అనంతరమూ రాయబడ్డ పురాణ - కావ్య - ధర్మ శాస్త్రగ్రంధాల్లో చార్వాక సిద్ధాంత చర్చకి తావే వుండేది గాదు!

చార్వాక తత్వశాస్త్రాన్ని వక్రీకరించడానికి, ఆస్తికులు తమ రచనల్లో తరచుగా చార్వాకుల భావాల్ని కోట్ జేసారు. మాధవాచార్యులు తన గ్రంధంలో, ఈ పనినే జేశాడు. అలాగే, బ్రాహ్మణమత ఆచార వ్యవహారాలకి బద్ధశత్రువులుగా చిత్రించబడ్డ అసురులూ - దైత్యుల ద్వారా ఈ సిద్ధాంతానికి చెందిన కొన్ని విశిష్ట భావాలు ప్రతిబింబించబడ్డాయి. విష్ణుపురాణంలో రాక్షసగురువైన మాయామోహుడు వెలిబుచ్చిన భావాలు,

చార్వాకానికి ఎంతో దగ్గరగా వున్నాయి. ఈ భావాలు క్రమేణా జన సామాన్యంలోకి అత్యంత వేగంగా పాకి, వొక మహత్తరశక్తిగా పరిణ మించాయి. చార్వాకుల్లో 1. ధూర్త చార్వాకులు 2. వితండవాదులు (తత్వోపప్లవవాదులు) 3. సుశిక్షిత చార్వాకులు అనే ధోరణులకు చెందిన వారున్నట్లు మనకు ప్రాచీన గ్రంథాల ద్వారా తెలుస్తోంది.

ప్రాచీన భారతంలో, భౌతికవాద తాత్విక ధోరణి నిర్ద్వంద్వంగా ఉనికిలో వుందని, ఆధునిక భారతీయ తత్వశాస్త్ర చరిత్రకారులు సైతం నిరూపించారు. ఈ రంగంలో విశిష్టమైన కృషి సల్పిన అగ్రగణ్యుడు — శ్రీదేవీప్రసాద్ ఛటోపాధ్యాయ. ఈయన రచించిన "లోకాయత" అనే ఆంగ్ల గ్రంథం నిస్సందేహంగా మణిమాణిక్యమే. అలాగే "షార్ట్ హిస్టరి ఆఫ్ ఇండియన్ మెటీరియలిజం" అనే ఉత్తమ రచన జేసిన డాక్టర్ దక్షిణ రంజన్ శాస్త్రి గూడా ఈ సందర్భంగా పేర్కొనదగ్గ పండితుడే.

మధ్యయుగాలకి చెందిన మాధవాచార్యులు తన "సర్వదర్శన సంగ్రహం"లో, చార్వాక సిద్ధాంతాన్ని సమూలంగా ఖండించిన తర్వాత, చివరికి "దురుచ్ఛేదంహి చార్వాకస్య చేష్టితమ్" అని ముగించాడు. అంటే —చార్వాకుని కృషిని నాశనం జేయడం అసాధ్యం — అని అర్థం. నిజమే — చార్వాక మహోద్యమాన్ని అంతమొందిచడం దుర్లభమనీ, ఆఖరికి నేటి కాలంలో కొమ్ములు తిరిగినవారికి సైతం అసాధ్యమనీ, మాధవాచార్యులతో పాటు మనమూ అంగీకరిద్దాం!

# రిఫరెన్స్ గ్రంధాలు


1. Madhavacharya - Sarva Darsana Samgraha - Trubner's Oriental Series - Translated by E.B. Cowell and A. E. Goush (London - 1882)
2. Rhys Davids - Buddist India
3. Cor porate Life in Ancient India - Dr. R.C.Majumdar.
4. Buddistic Studies - Dr. Law
5. Pre-Buddistic Indian Philosophy-Barua
6. Short History of Indian Materialism  
   Dr. Dakshina Ranjan Sastry
7 Lokayat - Devi pr asad chattopadhya
8. Sacred Books of the East - Jacobi
9. The Ajivikas - Besham


# సంస్కృత గ్రంధాలు


1. భారతం - శాంతిపర్వం, వనపర్వం
2. భాగవతం - చతుర్ధస్కంధం
3. రామాయణం — అయోధ్యకాండ
4. విష్ణుపురాణం - 3 - 18
5. సర్వదర్శన సంగ్రహం - మాధవాచార్యులు
6. షడ్దర్శన సముచ్చయం — హరిభద్రసూరి
7. తత్వసంగ్రహం - శాంతరక్షిత
8. తత్వసంగ్రహం — కమలశీల
9. అద్వైతబ్రహ్మసిద్ధి - సదానంద
10. తత్త్వోప ప్లవ సింహ - జయరాసిభట్ట
11. ఖండన ఖాద్యఖాదక — శ్రీహర్ష
12. ప్రబోధ చంద్రోదయం — ద్వితీయాంకం - కృష్ణమిశ్ర
13. వేణీ సంహారం -

# 4. మధ్యయుగాల్లో చార్వాకం

ఆంధ్రదేశంలో వీరశైవమతాన్ని అత్యంత తీవ్రస్థాయిలో ప్రచారం జేసిన మల్లిఖార్జున పండితారాధ్యుడు, క్రీ. శ. 1100 - 1175 సంవత్సరాల మధ్యకాలంలో జీవించాడు. ఓరుగల్లును రాజధానిగా చేసుక పాలించిన కాకతీయుల కాలంలో ఈతడున్నాడు. ఇతడు బ్రాహ్మడు. వైదిక సాంప్రదాయాల కనుగుణమైన శైవమత ప్రచారానికోసం ఇతడు దేశ సంచారం గావించి, అనేకమంది జైన-బౌద్ధ పండితుల్ని వాగ్వివాదంలో ఓడించాడు. వాదంలో ఓడిపోని వారిని, రౌడీల్లాంటి తన శిష్యుల ద్వారా నిర్దాక్షిణ్యంగా హత్యజేయించాడు.

"తనకంటె వేరె ఈశ్వరు
డన లేడని పల్కునట్టి యద్వైత విమూ
ఢునకును, **లోకాయతునకు**
వినగా భేదంబు గలదె? విష్ణువరేణ్యా-"

అని చెప్పిన పండితారాధ్యుడు, "నేనే బ్రహ్మను" అని ప్రచారం జేసిన అద్వైతికీ, "దేవుడు లేనే లేడు" అని బోధించిన లోకాయతునికీ మధ్య నున్న మౌలికభేదాన్ని గుర్తించనే లేదు. అవును - వీరశైవులకీ - వీర విప్లవకారులకీ - తరచుగా బుర్ర పనిజేయదు.

"శ్రుతి బాహ్యంబులు కావున
సతతంబును జైన బుద్ధ చార్వాకుల దు
ర్మతములు బట్టక పట్టి
శృతిసార భవన్మతము సుమతి మహేశా."

ఆనాటి వీరశైవులు, బౌద్ధ - జైన - చార్వాకుల్ని అత్యంత కిరాతకంగా నిర్మూలించినట్లు పాల్కురికి సోమనే చెప్పాడు:

"జైన బౌద్ధ చార్వాక దుష్పథ సమయములు
మూడును నిర్మూలనము జేయు దనుక
మూడు రాలను వైతు ముప్పొద్దు నీకు."
(పాల్కురికి సోమన – బసవ పురాణం)

చార్వాకుల్ని భౌతికంగా నిర్మూలించినా, చార్వాకానికి చెందిన భావాలు మాత్రం భారతీయ రచయితల్ని మధ్యయుగాల వరకూ వేటాడుతో వెంటాడుతోనే వొచ్చాయి। పోతన గజేంద్రమోక్షంలో (భాగవతం) తెలిసో తెలియకో, నాస్తికత్వాన్ని గూర్చి రాయక తప్పలేదు. తన కాలును వొక మొసలి పట్టుకొని, నీటిలోకి ఈడ్చుకపోతున్న విపత్కర పరిస్థితిలో గజేంద్రునిచే (ఏనుగుచే) పోతన యిలా అనిపించాడు:

"కలడందురు దీనుల యెడ
కలడందురు పరమయోగి గణముల పాలం
కలడందు రన్ని దిశలను
కలడు కలండనెడివాడు కలడో లేడో,"

అలాగే మానవజీవితం పట్ల చార్వాకుల దృక్పథాన్ని, వికృతమైన రూపంలో అల్లసాని పెద్దన - తన మనుచరిత్ర ప్రబంధంలో వరూధినిచే చెప్పించాడు. భౌతిక సుఖాల్ని అనుభవించాలనే అభిప్రాయం గల

వరూధినికీ, వైదిక శుష్క శ్రోత్రియ జీవితం గడపాలనే భావాలు గల ప్రవరుడనే బ్రాహ్మడికీ మధ్య జరిగిన సంఘర్షణ - వరూధినీ ప్రవరుల వృత్తాంతంలో మనకు గోచరిస్తుంది. ఏ సంభోగసుఖం ద్వారా ఇంద్రియ సౌఖ్యం లభిస్తుందో, అదే - ఆనందమనీ, "ఆనందో బ్రహ్మ" మనే వేదవాక్కును గూర్చి ఆలోచించమనీ, ఆమె ప్రవరుని కోరుతుంది. ఆమె ఈ విధంగా అంటుంది:

"ఎందే డెందము కందళించు రహిచే నేకాగ్రతన్, నిర్వృతిన్
జెందున్ కుంభగత ప్రదీప కళికా శ్రీదోప, నెందెందు బో
కెందే నింద్రియముల్ సుఖంబుగను నాయింపే పరబ్రహ్మ మా
నందో బ్రహ్మ మటన్న ప్రాజదువు నంతర్బుద్ధి నూహింపు మా"

ఈ విధంగానే వేమన నిసర్గసుందరమైన పద్యాల్లో, చార్వాకానికి చెందిన ఎన్నో భావాలు చోటుచేసుకొన్నాయి.

## సాంస్కృతిక విప్లవోద్యమ వేగుచుక్క - మహాకవి వేమన

మధ్యయుగాలనాటి సమాజంలో చెలరేగిన నంగిపూజ, దొంగభక్తి, దగా, దంభపుజీవనం, నైతిక విశృంఖలత్వం, వర్ణవ్యవస్థ, మతద్వేషాలకి వ్యతిరేకంగా ధ్వజమెత్తిన వేమన, ఆంధ్రప్రజల చరిత్రలో ప్రప్రధమంగా విప్లవాత్మక సాంఘిక చైతన్యాన్ని ప్రవర్తిల్ల జేసేందుకు ప్రయత్నించిన మహామేధావి.

తెగిన గాలిపటంలా, నడిసముద్రంలోని నావలా, నాటి సామాజిక జీవితం మతకలహాలతో, వంచకుల కుతంత్రాలతో, రాజకీయ సాంస్కృతిక కల్లోలాలలో కొట్టుమిట్టాడింది. అలాంటి సంఘానికి మహాకవిగా, సాంఘిక

విప్లవ సంస్కర్తగా, వేమన యిచ్చిన మహోన్నత సందేశం – ఉత్తమ జీవన సాధన. బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మద్ వలె, మరో నూతన మతస్థాపన కుద్యమించకపోయినా, మధ్యయుగ భూస్వామ్య సమాజ మూఢాచార వ్యవహారాల్నీ, నాటి సమాజాన్ని ఆవరించిన సమస్త కల్మషాన్నీ, తన అప్రతిహత కారణవిమర్శనా శక్తితో, అపూర్వ తార్కిక పటిమతో, క్షాళనం జేసేందుకుద్యమించిన సాంస్కృతిక విప్లవోద్యమ వేగుచుక్కయే - మహాకవి వేమన.

## వివిధ సామాజిక పరిస్థితులు

ఆంధ్రదేశచరిత్రలో పదిహేడవ శతాబ్దం - అంధయుగం. ఈ శతాబ్దంలోనే వేమన జీవించాడు. నాటి దేశ–కాల–పరిస్థితుల్ని గూర్చి తెలుసుకోవడానికి, వేమన కవిత బ్రహ్మాండమైన బంగారుగని. ఇందు నిమిత్తం యితర ఆధారాల కోసం వెదకడం పనికిమాలినపని.

క్రీ.శ. పదిహేడవ శతాబ్దంనాటికి, ఆంధ్రదేశంలోని రాజకీయ - సాంఘిక - మత - పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దక్షిణాపథాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన విజయనగర సామ్రాజ్యం, తళ్ళికోట యుద్ధానంతరం నాశనమై పోయింది. నేతిబీర స్వాతంత్ర్యమున్న చిల్లర మల్లర రాజ్యాలు, పుట్టకొక్కుల్లా తలెత్తాయి. తిని తాగి తిరగమరిగిన నిరంకుశ పాలకులు, గోళ్ళూడగొట్టి ప్రజల వద్దనుండి పన్నులు వసూలు జేసేవారు. మూగజీవాల్లా జనం పన్నులిచ్చేవారు. ఇదే - నాటి పాలక – పాలితుల మధ్యనున్న సంబంధం.

ఈ శతాబ్దానికి చెందిన రాయలసీమ, భీకరమైన రాజకీయ సంక్షోభానికి కేంద్రమైంది. రాబందుల్లాంటి ప్రాంతీయ పాలెగాండ్ర అంతః కలహాలతో, ముస్లిం సుల్తానుల నిరంతర దాడులతో, రాయలసీమ అతలాకుతలమై పోయింది. ఈ విధంగా శాంతిభద్రతలు కరువైన రాయలసీమయే, వేమన పద్యాల్లో నిండుటద్దంలోని నీడలా ప్రతిబింబించింది.

## కోతిబట్టి తెచ్చి కొత్త పుట్టము గట్టి
## కొండముచ్చు లెల్ల కొలిచినట్లు

నాటి చిల్లరమల్లర పాలెగాండ్ర పాలనను దృష్టిలో వుంచుకొన్న వేమన—

అల్ప బుద్ధి వాని కధికారమిచ్చిన
దొడ్డవారి నెల్ల తొలగజేయు-

అని అన్నాడు. రాజు దయపై ఆధారపడి, నానా కిరాతక కృత్యాలూ జేసి, జనాన్ని పీడించి, రాజ్యాన్ని (భూమిని) భ్రష్టు పట్టించినవాడు, ఆసాంతంలో ప్రజల ఉసురు తగిలి, నేలపై బంతిలా అమాంతం కూలుతాడు - అని వేమన అత్యంత తీవ్రంగా హెచ్చరించాడు.

భూపతి కృప నమ్మి భూమి చెరచువాడు,
ప్రజల ఉసురు తగిలి పడును పిదప,
ఎగురవేయు బంతి ఎందాక నిలుచురా?

ఎరుకలేని దొరల ఎన్నాళ్ళు కొలిచినా,
బ్రతుకు లేదు వట్టి భ్రాంతిగాని,
గొడ్డుటావు పాలు గోకితే చేపునా?

పరబలంబు జూచి ప్రాణ రక్షణమున
కురికి పారిపోవు పిరికి నరుడు-

అని అతడు వర్ణించిన పిరికిపందలైన చిల్లర రాజులూ.

పెక్కు జనుల చంపి, పేదల వధియించి,
డొక్క కొరకు ఊళ్ళు దొంగిలించె

రాచరిక లుచ్ఛాలే, నాటి ఆంధ్రలో ప్రత్యేకంగా రాయలసీమలో యథేచ్ఛా విహారం గావించారు.

దుండగీడు కొడుకు, కొండీడు చెలికాడు,
బండరాజునకును బడుగు మంత్రి,
కొండముచ్చునకును కోతియె సరియగు-

అని-పరమ దుర్మార్గులు నిండిన కొలువుకూటాల్నీ, నాటి పాలకులకి వంత పాట పాడే జోహుకుందార్లనీ గూర్చి వేమన చెప్పాడు.

కోతి బట్టి తెచ్చి, కొత్త పుట్టము గట్టి,
కొండముచ్చులెల్ల కొలిచినట్లు,
నీతిహీనులొద్ద నిర్భాగ్యు లుందురు.

కోతిని పట్టుకొచ్చి, కొత్త గుడ్డల్తో దానికి ముస్తాబుజేసి, కొండముచ్చు లన్నీ కొలిచినట్లు, ఎందుకూ కొరగాని పాలకుల వొద్ద పరమ దౌర్భాగ్యు లంతా జేరతారని ఆయన చెప్పాడు.

## జారులూ చోరులే నాటి స్వాములవార్ల శిష్యులు

"విశ్వగుణాదర్శం" అనే గ్రంథం నాటి పురోహితవర్గ దంభపు జీవనాన్ని యీ విధంగా వర్ణించింది : "ఈ ఆచార్య పురుషులు జారులు, చోరులు, బోయలు, దోపిడీగాళ్ళు, పాలెగాళ్ళు మొదలైన వారిని తమ శిష్యులనుగా జేసుకొని, వేద విద్యలు తెలియకపోయినా శ్రోత్రియులైన బ్రహ్మనిష్ఠులతో కలిసి సహపంక్తిలో భుజించరు." సంఘంలో అధికార సంపాదన కోసం ప్రభువుల్ని కుయుక్తుల ద్వారా లోబరచుకోవడం, నాటి వివిధ మత గురువులకి పరమావసరంగా పరిణమించింది.

"కౌపీనం భసితా లేపో
దర్భాః రుద్రాక్ష మాలికాః
మౌన మేకాసికా చేతి
మూర్ఖ సంజీవనా నిషట్."

కౌపీనం, వీబూది రేఖలు, దర్భ, రుద్రాక్షమాలికలు, మౌనం, ఒంటరిజీవితం, నాటి మతగురువుల దంభపు జీవనానికి, వంచనకి, ప్రధాన సాధనాలుగా మారాయి. ఆనాడు బ్రాహ్మలు తాము నిజంగా భూసురులమనే (భూమ్మీద దేవతలమనే) తలచారు. జంగాలు తాము సాక్షాత్తూ జంగమ పరమ శివులమనే భావించారు.

వీరశైవం, వైష్ణవం, లింగమతం, నామధారిమతం, యిత్యాది మత శాఖలెన్నో ఉద్భవించాయి. ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతాల చుట్టూ ఆవరించిన విపులమైన కర్మకాండ, కుళ్ళిగవులు కంపు కొడుతోన్న కులవ్యవస్థ, వేమన జీవించినకాలం నాటి ప్రత్యక్ష సత్యాలు. గ్రామ దేవతలకి పూజలు, జాతరల్లో బలులు, జంగమయ్యల పాదతీర్థాలు, సామాన్య ప్రజల్ని మూఢభక్తిలో ముంచెత్తి వేశాయి. "ఏ జాతిలో బుట్టినవాని కాజాతిలో పెద్దలు నిర్ణయించిన ధర్మమే మోక్షపథమనినమ్ముట, ఇతర మతములు నీచములు అసత్యములని తిరస్కరించుట, పైరెంటిని సాధించుటకు కావలసిన తర్కశాస్త్ర కౌశల్యము సంపాదించుట, యివి చిన్ననాటినుండి మనుష్యులకు నేర్పబడుచుండెను. ఇందుచే భుక్తిగోరి సంభవించు రాజకీయ కలహముల కన్న, ముక్తిని నిర్ణయించు మత కలహములే ప్రబలములై సంఘము నావరించి దేశము నన్యాక్రాంతము చేసి, పరలోక మోక్షమెట్లున్నను ఇహలోక బంధము ముడిని మరింత బిగువు చేసెను." (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ — వేమన)

వేమన కాలం నాటికి ద్వైత — అద్వైత - శాఖలమధ్య తీవ్రమైన వైషమ్యం పొడసూపింది. మధ్వులకూ - రామానుజ మతస్థులకూ విష్ణువే దేవుడైనా, పెట్టుకొనే పంగనామాలు గోపీచందనంతో ధరించాలా, కాక తిరుమణితో ధరించాలా అనే "బ్రహ్మాండమైన" అంశం గూర్చి వాగ్వివాదం చెలరేగి విద్వేషాగ్ని రగులొకన్నది.

# ఊరికొక దేవాలయం: దేవాలయానికొక దేవదాసి

మతమూ – దేవుని పేరిట యీ దాంభికుల మోసాలు వొకవైపున కొనసాగుతోండగా, వేశ్యల ఉనికి నాటి సమాజంలోని నైతిక విశృంఖలత్వానికి అగ్నికి ఆజ్యంలా తోడైంది. ఊరికొక దేవాలయం. దేవాలయానికొక దేవదాసి. పరమాత్మనీ, పురోహిత – పాలక – వర్గాల్నీ శృంగార డోలికల్లో తేలియాడించేందుకు, ఈ దేవదాసికి జీవనభృతి నిమిత్తం మడిమాన్యాలు యివ్వబడేవి. తరతరాల నుండీ హిందూసంఘంలోని సర్వ కాలుష్యాన్నీ భరించి సహించే ఈ దేవదాసీలు చాలరన్నట్లు, శైవ–వైష్ణవ–మతాలకి చెందిన బసివిరాళ్ళు గూడా అవతరించారు. వీరితోపాటు యిరుగు పొరుగు స్త్రీలలో సైతం వ్యభిచారం మహామారిలా చెలరేగింది. ఇంటి వొద్ద ఇల్లాలుగా వుండి, సంతలో సానివృత్తి జేసే "సంతబసివిరాండ్రూ" "సంతసానులూ" దొమ్మరి సానులు గూడా యీ కాలంలో వుండేవారు. ఈ పరిస్థితులన్నీ నాటి సామూహిక వ్యభిచారానికి దోహదం జేశాయి.

పరస్త్రీ సంగమం, వేశ్యా సంపర్కం, పాపమైతే కావచ్చుగాని అది – క్షమించదగిన నేరమనే దృక్పథమూ, వ్యభిచారం నాగరికానికి విశిష్ట లక్షణమనీ, ఏకపత్నీవ్రతం చాతగానితనమనే భావాలు బాహాటంగా చలామణీ అవుతోన్నకాలంలో వేమన పుట్టి పెరిగాడు. తత్ఫలితంగా యీభావాల ప్రభావం వేమన ఆలోచనాధోరణిపై గూడా తమ ముద్రను వేశాయి. అంచేతనే కొన్ని సందర్భాల్లో వేమన స్త్రీపై అనుమానాన్ని ప్రదర్శిస్తాడు.

## మానవ జీవితమే వేమన పాఠశాల

ఇలాంటి రాజకీయ సాంఘిక నైతిక మత పరిస్థితుల మధ్య వేమన పుట్టి పెరిగాడు. జన్మతః సంక్రమించిన హేతువాదశక్తి, తార్కికదృష్టి, నిశితమైన మానవజీవిత పరిశీలన, సామాజిక సమస్యల పట్ల తీవ్రమైన

జిజ్ఞాస, విశాలమైన మానవజీవితానుభవం, మానవ మనస్తత్వ అవగాహన, యిత్యాదులన్నీ ఆయన చేతిలో ఎదురులేని సాధనాలయ్యాయి. మధ్య యుగాలనాటి మానవజీవితమే, వేమన చదివిన బృహత్తర పాఠశాల. ఈ పాఠశాలలోనే ఆయన ఎన్నో అమూల్యమైన సత్యాల్ని గ్రహించాడు; పరస్పర విరుద్ధమైన అనుభవాల్ని గడించాడు. తాను దేనినైతే కళ్ళారా చూశాడో, స్వయంగా చేశాడో, దానినే తన ప్రతిభలో రంగరించి ఇంద్ర నీలమణుల్లాంటి అందమైన ఆటవెలదుల్లో చెప్పాడు.

మహమ్మదీయులు ప్రభువులుగా కడపసీమను పాలిస్తోన్న కాలంలో, అంటే – పదిహేడవ శతాబ్దం కడపటి భాగంలో వేమన జీవించి వుంటాడని–ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ చెప్పాడు. క్రీ. శ. 1540–1600 మధ్యకాలంలో వేమన వుండివుంటాడని, శేషాద్రిరమణ కవులు అభిప్రాయపడ్డారు. పదిహేనవ శతాబ్దంలో వేమన జీవించివుంటాడని, శ్రీ వంగూరిసుబ్బారావు అన్నాడు. "నాకు జూడగా 18వ శతాబ్ది ఆదియందే వేమన్న ఉండెనని యూహించుట యనుకూలముగా దోచుచున్నది" అని శ్రీరాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ చెప్పాడు. చాలామంది వేమన క్రీ.శ. 1650 ప్రాంతాల జీవించి వుంటాడని అభిప్రాయపడ్డారు. వేమన కడప–అనంతపురం జిల్లాల్లో ఏదో వొక గ్రామానికి చెందినవాడై వుండాలి.

## గడిపిన సామాన్య జీవితం

రెడ్డిరాజుల్లో చివరివాడైన రాచవేమారెడ్డికి వేమన తమ్ముడనే సినిమా కట్టుకథ వొహటున్నది. ఇదే నిజమైతే, ఆయన కవితలో నాటి రాచనగరు వాసన, అంతఃపుర భోగభాగ్యాలు తప్పక ప్రతిఫలించి తీరాలి.

ఎంత సేవజేసి యేపాటు పడినను,
రాచమూక నమ్మరాదురన్న,
పాముతోడి పొందు పదివేలకైనను–

అని చెప్పిన ఆయన, రాజవంశానికి చెందుతాడా? రెడ్డిరాజుల వంశానికి చెందిన వేమనకు రాచమూకను నమ్మాల్సిన అవసరమూ, వారికి సేవ జేయాల్సిన అగత్యమూ ఏమి వొచ్చింది? అంతేగాదు-ఆయన కవితల్లో తిని తాగి తిరగమరిగిన రెడ్డియువరాజుల భోగలాలసత్వంగానీ, సుంచర భవనాల్లో వెన్నెలాంటి పరుపులపై విరహంలో బాధపడుతో, మన్మధ జ్వరంతో సొక్కి-సోలిపోయే అంగనామణుల కొవ్వెక్కిన జీవితంగానీ మనకు కన్పించదు: ఆనాటి అతిసామాన్యమైన జానపదజీవితంలోని కటికి వాస్తవాలూ—అనుభవాలూ-ఆయనకు పూర్తిగా తెలుసు. సాధారణ రెడ్డి కుటుంబంలో జన్మించిన వేమనకు యీ కింది అంశాలు గూడా కూలంకషంగా తెలుసు :

"పుంజు గూటనుండి పొద్దెరింగియె కూయు"
"కడుపునిండ తవుడు గంపలో బెట్టక
చన్ను ముట్టనీదు తన్ను బర్రె"
"దొమ్మ తెగులు చేత తూలిన గేదెకు
వాతవేయ బతికివచ్చు"
"గడ్డివేయ పోట్లగొడ్డు కొమ్మాడించు"
"గొడ్డుటావు పాలు గోకితే చేపునా?"
"పాలలోన పులుసు లీలగా గలిసిన
విరిగి తునకలగును విరివిగాను"
"కుండ చిల్లిబడిన గుడ్డ దోపగవచ్చు
పనికి వీలుపడును బాగుగాను"
"పచ్చి కుండలొ నీళ్ళు పట్టిన నిలవవు"
"కుక్క యిల్లు సొచ్చి కుండలు వెదకదా?"
"చెప్పు దినెడి కుక్క చెరకు తీపెరుగునా?"
"పంట చేను విడిచి పరిగ లేరినయట్లు"

యిత్యాది రైతుల జీవితాల్లో ప్రతినిత్యం జరిగే విషయాల్నీ, దైనందిన సంఘటనల్నీ, వేమన చూశాడు—చేశాడు— అనుభవించాడు. "పండిన చేలోని పల్లేరుగాయలు" తొక్కాడు. సామాన్య రైతుజీవితంలో యెదురయ్యే కష్టనష్టాల్ని స్వయంగా అనుభవించాడు. తాను ఏం చూశాడో, ఏం చేశాడో, దేన్ని అనుభవించాడో, ఎలా ఆవేదన జెందాడో, ఆ అంశాల్ని తన పద్యాల్లో చెప్పాడు.

"గోచి ఊడెననుచు, కోతి ఆటల నాడి,
వెర్రియోగి నూరు వెడలమండ్రు,
ఎవరి గోచులూడ వీ పొద్దు గుంకిన?"

అని ప్రశ్నించిన వేమన, నాటి వెర్రిజనంచే "వెర్రివాడు" గా పరిగణించబడి, దిగంబరిగా దేశసంచారంజేస్తో, పేరు తెలియని ఊరులో శాశ్వితంగా కన్నుమూశాడు.

అన్నవస్త్రాలకు లోటు లేని మధ్యతరగతి రైతుకుటుంబంలో పుట్టిన వేమన, బతుకులో విసిగి వేసారి, చివరికి యోగిగా మారాడు. అయితే యితర కుహనా సన్యాసుల్లా ముక్కు మూసుకొని, సామాజిక జీవిత సమస్యలనించి పలాయనం చిత్తగించి, ఏమారుమూల మఠంలోనో గంజాయిదమ్ము గొడుతో, మేకనంజుడు ఆరగిస్తో, దొంగ వేదాంతాన్ని బోధిస్తో, అమాయక పడతుల శీలానికి ఉరితాళ్ళు బిగిస్తో, జడలూ గెడ్డాలూ పెంచుకొని దంభపు జీవితాన్ని గడపలేదు. ఇదే—వేమనకీ, మిగతా సన్యాసులకీ మధ్య నున్న ప్రధానమైన భేదం. దేశసంచారం జేస్తో రకరకాల సంఘటనల్ని చూశాడు. అనేకానేక జీవితానుభవాల్ని గడించాడు. నాటి సంఘంలో సమస్త రూపాల్లో తలెత్తిన దుర్మార్గాన్నీ, కపటాన్నీ, వేషధారి తనాన్నీ, వంచననీ బట్టబయలు జేసి, సామాన్య ప్రజల్లో జ్ఞానోదయం కలిగేందుకు యత్నించాడు. సాతాను జియ్యర్లనీ,

లింగ మతంలోని దొంగల్నీ, ముంజి కోకల్నీ, బొరెదేసి జడల్నీ, భస్మపు పూతల్నీ, లోభుల్నీ, కపట యోగుల్నీ, పాలకవర్గాల గులాముల్నీ, అలిపేతిలోని తొత్తుల్నీ, రకరకాల మతశాఖలకి చెందిన పశుపుక త్తెల్నీ, శైవుల్నీ, వైష్ణవుల్నీ, బ్రాహ్మల్నీ, అబ్రాహ్మల్నీ, దిక్కుల్నీ, దేవుళ్ళనీ, ఈ ఔల్లాంటి మాటల్తో— బాకుల్లాంటి పోటుల్తో—హేతుబద్ధంగా ఖండించాడు. నడి బజార్లో అవహేళన జేశాడు. ప్రతిభావంతుడైన వైద్యుడు రోగ కారణాల్ని ఎలా డయాగనైజ్ చేసి మందు యిస్తోడో, అలాగే వేమన గూడా నాటి సామాజిక—నైతిక—జాడ్యాల్ని నిశితంగా పరిశీలించి, ఆటవెలదుల పేరిట నాటి సమాజానికి మరో దోవ చూపేందుకు యత్నించాడు.

## త్రిమూర్తులు

సృష్టి-స్థితి- లయాలకి కారకులుగా చెప్పబడే బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులను సైతం ఖాతరు జేయని హేతువాదియైన వేమన యిలా అన్నాడు.

బ్రహ్మవ్రాత కెదురు పల్కెడు వాడును,  
ఆదివిష్ణు సూత్ర మడచువాడు,  
మూడు కనులవాని మొనసి నిల్చినవాడు.

సర్వసాధారణంగా మానవుల్లో కన్పించే అవివేకం, ముందు చూపులేని తనం, కామక్రోధాదులు, త్రిమూర్తుల్లో సైతం చూడగలిగిన ఆయన మహోజ్వల తార్కికశక్తికి సర్వులూ నమోవాకాలు అర్పించవాలసిందే! వెధవ పునుగు పిల్లికి పరిమళం కలిగించి సృష్టించకపోతే, ఆ తావి పసిడికే కలిగించి పుట్టించినట్లయితే, బంగారానికే పరిమళం అబ్బేది గదా!! ఈ విషయంలో సృష్టికర్త ఎంత అవివేకంగా ప్రవర్తించాడంటూ, ప్రకృతి సూత్రాలనే తన తార్కిక పటిమతో ఉల్టా గొట్టించేందుకు ఊహిస్తాడు.

పునుగు పిల్లి కేల పుట్టించె వాసన?
కనకము తనకేమి కల్ల జేసె?
బ్రహ్మ చేత లెల్ల పాడైన చేతలు.

పాలసముద్రంపై పవ్వళించిన విష్ణుమూర్తి, గొల్లవారి యిళ్ళలోని పాలు ఎంచేత దొంగిలించాడో చెప్పాడు.

పాల సాగరమున పవ్వళించినవాడు
గొల్ల యిళ్ళ పాలు కోరనేల?
ఎదుటివారి సొమ్ము లెల్లవారికి తీపి.

శివుని నొసటిమీద మూడోకన్ను వుంటుంది. ఆ కన్నువున్న శివుడు తన కంటి మంట ద్వారా కాముని (మన్మధుని) బూడిద జేసి, చివరికి కామంతోనే పార్వతితో జతగూడాడు—అని అంటాడు.

కంటిమంట చేత కాముని దహియించి,
కామమునను కడకు గౌరి గూడె,
ఎట్టివారికైన పట్టు ప్రారబ్ధము.

## త్రిమూర్తుల దౌర్బల్యం

శివుని భార్యయైన పార్వతి స్నానంజేయబోయే ముందు, ఒంటికి నలుగుపెట్టుకొంది. నేలమీద పడ్డ నలుగుపిండిని వొక బొమ్మగా జేసి, దానికి ప్రాణం పోసింది. ఆ నలుగుపిండి కొడుకే—వినాయకుడు! ఈ కొడుకును గుమ్మం ముందు కాపలాబెట్టి,స్నానానికి లోపలికెళ్ళింది. అంతలో శివుడు వొచ్చాడు. ఈ వొచ్చిన శివుడికి గుమ్మం ముందు కూర్చున్న వాడెవ్వడో తెలియదు. వినాయకుడు శివుణ్ణి లోపలికెళ్ళ నివ్వలేదు. ఆగ్రహించిన శివుడు అమాంతం తన శూలంతో వినాయకుణ్ణి పొడిచేశాడు.

వినాయకుశ్మ మరణించాడు. మనిషి తలపోయిన వినాయకుని మొండేనికి, ఆ తర్వాత శివుడు ఏనుగు తలను తెచ్చి అతికించాడు. అంతేగాని యథాతధంగా వినాయకుణ్ణి బతికించుకోలేక పోయాడు.

విష్ణుమూర్తి కుమారుడే - మన్మధుడు. మన్మధజ్వరం రప్పించడంలో ఈతనికి అఖండమైన పాండిత్యముంది! వొకసారి ఈ మన్మదుడు శివునికి సెక్స్‌జ్వరం రప్పించడానికి చాలా తీవ్రంగా ప్రయత్నించాడు! ఆగ్రహించిన శివుడు తన మూడోకన్ను తెరిచి, మన్మధుని అమాంతం బూడిదజేసివేశాడు. ఈ విధంగా శివుడు తన నలుగుపిండి కుమారుణ్ణి యథాతధంగా బతికించుకోలేకపోయాడు. విష్ణుమూర్తి తన కొడుకునూ బతికించలేకపోయాడు. దీన్నిబట్టి దేవుళ్ళ శక్తుల బండారం బయటపడుతుంది- అని వేమన అన్నాడు.

కొడుకును బ్రతికించు కొనలేదు శంభుండు
కొడుకును బ్రతికించు కొనడు శౌరి,
దైవబలము లెల్ల దీననే కనిపించు.

శివుడు తన భార్యల్లో వొకతెయైన గంగను అమాంతం నెత్తిమీద పెట్టుకొని మోశాడు. మరొకడు పడతిని మేశాడు. విష్ణుమూర్తి తన భార్యయైన లక్ష్మిని, సాక్షాత్తూ ఎదమీద - వక్షస్థలంమీద- పెట్టుకొని బతికాడు. ఈ విధంగా దేవుళ్ళే పడతుల కోసం అడ్డమైన పాట్లూపడ్డారు- అని అన్నాడు.

పడతి మోసె నొకడు, పడతి మేసె నొకడు,
పడతి నెదనుబెట్టి బ్రతికె నొకడు,
పడతి కొరకు నిట్లు పలుపాట్లు పడిరయా.

హిమవంతుని కూతురు- పార్వతి. ఆ పార్వతి యొక్క సంకేతమే హేమనగం. ఇలాంటి హేమనగాన్ని ఎప్పుడూ చేతిలో గలిగిన

వాడూ, వెండికొండ మీద కాపరముండే శివుడు- బిచ్చమెత్తాడు గదా ? అని అన్నాడు.

హేమనగము చేత నెప్పుడు గలవాడు,
వెండికొండపైన వెలయువాడు,
ఎత్తవలసివచ్చె బిచ్చ మేమన వచ్చు ?

## పురాణ పురుషులు

బంగారులేడి రూపంలో వొచ్చిన మారీచుడు రాక్షసుడని గ్రహించలేక, సీతను విడిచి వెళ్ళిన శ్రీరాముడు దేవుడు ఎలా అయ్యాడంటూ తర్కబద్ధంగా ప్రశ్నించాడు.

కనకమృగము భువిని కద్దు లేదనకుండ,
తరుణి విడిచిపోయె దాశరధియు,
తెలివిలేనివాడు దేవు డెట్లాయెరా ?

అగ్నిబాణం చేత సముద్రం యింకినప్పుడే, సైన్యంతో సహా లంకలో ప్రవేశించకుండా, వానరసేన సహాయంతో వారధికట్టి సముద్రాన్ని దాటిన రాముని బుద్ధిమాంద్యాన్ని వేమన అవహేళన జేశాడు.

అగ్నిబాణము చేత అంబుధింకినపుడె,
రాము డవలికేగ లావు మరచె,
వరుస కొండలు మోసి, వారధేటికి గట్టె ?

కామ (కోరిక) దాసులూ, కామానికి దాసులూ, ఆసాంతాన నాశనమవుతారని వేమన హెచ్చరించాడు. అహల్యను మోసగించి ఆమెతో భోగించిన ఇంద్రుడు, హీనుడై పోయాడు. శివుణ్ణి రెచ్చగొట్టి, ఆతనిలో కామోద్రేకం సృష్టించాలనే కోరిక కల్గిన మన్మధుడు, శివుని కంటిమంటకి

ఆహుతై భస్మమైపోయాడు. సొంత కూతురైన సరస్వతిని కామించిన బ్రహ్మదేవుడు భ్రష్టుడైపోయాడు.

ఇంద్రుడాయె కామి, హీనుడై పోయెను,
మారుడాయె కామి, మడిసిపోయె,
బ్రహ్మయాయె కామి, బయసిపోనాడెను.

కనక పర్వతంపై కాపరమున్నా, దేవేంద్రునికి (అనిమిషేశ్వరునికి) ఆశ మాత్రం పోలేదు. ఎలాగంటే– భారతయుద్ధ సమయంలో ఇంద్రుడు పేదబ్రాహ్మడి వేషం వేసుకొని, కర్ణుని వొద్ద కెళ్ళి, అతని బంగారు కవచకుండలాల్ని దానమడిగాడు గదా ? – అని వేమన ప్రశ్నించాడు.

కనక పర్వతమున కాపురముండినా,
అనిమేషేశ్వరునకు ఆశపోదు,
కనక కుండలములు కర్ణుని యడుగడా ? !

కురుక్షేత్ర రణరంగంలో కౌరవసేనా నాయకుడుగా, ద్రోణాచార్యులు శత్రుభీకరంగా పోరాడుతోన్నాడు. అట్టి పరిస్థితిలో ద్రోణుని ధాటికి తట్టుకోలేక, పాండవసేన మొత్తం గొర్రెలమందలా పారిపోతోన్నది. అప్పుడు "అశ్వత్థామ హతః" అని ధర్మరాజు ద్రోణునికి విన్పించేట్లు బిగ్గరగా అని, "కుంజరః" (ఏనుగు) అని చిన్నగా అన్నాడు. తన కుమారుడైన అశ్వత్థామ రణరంగంలో మరణించాడని తలచిన ద్రోణుడు, అక్కడే పడిపోయాడు. ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, ధర్మరాజంతటి వాడే ఏనుగంత అబద్ధమాడి, గురువైన ద్రోణాచార్యుని మోసగించి, అతని హత్యకు దోహదం జేశాడనీ, తద్వారా పాండవవంశ ప్రతిష్టను నీరుగార్చాడనీ వేమన అన్నాడు. అంచేత, ఇలాంటి భ్రష్టుని పేరు– ధర్మరాజైనా, నిజానికి ఈతడు పెనువేపవిత్తేనని వేమన తర్కబద్ధంగా వాదించాడు. ఎంత చిన్న పద్యంలో ఎంత భావం పొదిగాడు ? చూడండి :

కులము నీరుజేసి గురువును వధియింప,
పొసగ ఏనుగంత బొంకు బొంకె,
పేరు ధర్మరాజు పెనుపేపవిత్తయా.

భారతం పంచమ వేదమని ఎంచేత పొగిడారు- అని ప్రశ్నించిన వేమన యీ విధంగా అన్నాడు :

పంచమ వేదంబు భారతం బగునని,
పొగిడిరేల జనులు బుద్ధిలేక ?
హింసకార్యము తమ కిష్టమేలాయెరా ?

## మనుషులు చేసిన దేవుళ్ళు

హేతువాదానికి పట్టాభిషేకం గట్టిన వేమన, విగ్రహారాధనను తుత్తునియలుగా ఖండించాడు. ప్రాణం లేని రాయి — రప్ప - చెక్క — మట్టితో మానవుడే జేసిన రకరకాల బొమ్మలు, ఎలాంటి ఫలాన్నీ యివ్వ లేవని మూడువందల ఏళ్ళక్రితమే నిర్ద్వంద్వంగా ప్రబోధించాడు.

మనుషులు తాము చేసే దేవుళ్ళని, తమ కాళ్ళతోనే తొక్కి, తమ ఉలులతోనే చెక్కి, వాటిని నానా "బాధ" పెడతారు. అలా మనుషులు జేసిన రాతిబొమ్మల్ని దేవుళ్ళగా కొలిచే మొప్పెల్ని - మూర్ఖుల్ని ఏమనాలి - అని ప్రశ్నించాడు.

గట్టురాళ్ళు దెచ్చి, కాలుచేతుల ద్రొక్కి,
కాసె ఉలుల చేత గాసిజేసి,
మొరపరాళ్ళ కెరగు మొప్పెల నేమందు?

పలుగురాళ్ళు దెచ్చి, పరగ గుడులు గట్టి,
చెలగి శిలల సేవ జేయనేల?
శిలల సేవజేయ ఫలమేమి గల్గురా?

మన్ను మెత్తి కరిగి, మరి రూపు గావించి,
గుంట నిండ పూడ్చి, గురుతు నిలిపి,
మనుషులెల్ల జేరి, మరి దేవుడందురు.

రాతిబొమ్మల కేల రంగైన వలువలు?
గుళ్ళు గోపురములు కుంభములును?
కూడు గుడ్డ తాను కోరునా దేవుండు?

దొంగకుక్క యింట్లో జొరబడి కుండలు వెదికినట్లు, దొంగవెధవ (ముచ్చు) గుడికి పోయి పంచముడి విప్పుతాడే గాని, దేవుని చూడ్డానికి మాత్రం కాదని వేమన అంటాడు.

"ముచ్చు గుడికి పోయి ముడి విప్పునే గాని
పొసగ స్వామి జూడ పోడతండు
కుక్క యిల్లు జొచ్చి కుండలు వెదకదా?
విశ్వదాభిరామ వినురవేమా?

## చిత్తం శివుని మీద - భక్తి చెప్పుల మీద

రాళ్ళకీ రప్పలకీ గుళ్ళూ గోపురాలూ కట్టించి, కుంభాలు పోసి, రంగైన వలువలతో శృంగారించడం అవివేకమని, దేవుడు కూడూ గుడ్డా కోరతాడా అని వేమన ప్రశ్నించాడు. ఆత్మశుద్ధి లేని ఆచారమూ, భాండ (పాత్ర) శుద్ధిలేని పాకమూ, చిత్తశుద్ధి లేని శివపూజా పూర్తిగా నిరర్థకమని చెప్పాడు. చాలామంది గుడికి వెళ్ళినప్పుడు, చెప్పులు బయట వొదులుతారు. ఈ వొదిలిన చెప్పుల్ని ఏ దొంగైనా ఎత్తుకపోతాడేమోనని, చెప్పులపైనే తమ భక్తినంతా కేంద్రీకరిస్తారు. అంచేతనే ఆయన యిలా అన్నాడు.

ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల?
భాండశుద్ధి లేని పాకమేల?
చిత్తశుద్ధి లేని శివపూజ లేలయా?

ప్రాణమున్న బసవన్నకు (ఎద్దుకు) యింత గడ్డి గూడా వేయక తరిమికొట్టే పాపులు, శివుడి గుడిలోని రాతి బసవన్నకు సాగిలబడి మొక్కుతారని వేమన చెప్పాడు.

రాతి బసవని గని రంగుగా మ్రొక్కుచు,
గునుక బసవని గని గుద్దుచుంద్రు
బసవ భక్తులెల్ల పాపులు తలపోయ.

భూతి దేహమందు పూసితే నాయనా,
నిష్ట శివునియందు నిలుపవలయు,
గాక భస్మమందు గాడిద పొర్లదా.

## మనుషుల్ని వంచించే మతగురువులు

ఆనాటి మతాలన్నీ మోసానికి మారుపేరుగా తయారైనందువల్ల, వేమన ఆశీర్వాదాలను సమానంగానే పొందాయి. మతం పేరిట మనుషుల్ని వంచించే భ్రష్టులపై వేమన అగ్నిగోళాలు విసిరాడు. క్రీ. శ. 1565లో జరిగిన తళ్ళికోట యుద్ధానంతరం బహమనీ సుల్తానులు హంపీ విజయ నగరంపై పడి, గుళ్ళనీ గోపురాల్నీ గండ్రగొడ్డళ్ళతో నిర్దాక్షిణ్యంగా బద్దలగొట్టి, సర్వసంపదల్నీ కొల్లగొట్టిన విషయాన్ని క్రింది పద్యాలు మనకి జ్ఞాపకం జేస్తాయి. రాతి దేవుళ్ళను నమ్ముకొన్న రాజాధిరాజులు, కూడూ గుడ్డా లేక దిక్కులేని కుక్కచావు చావగా, వాళ్ళు నమ్ముకొన్న రాతిదేవుళ్ళను ముస్లింలు ముక్కలుముక్కల కింద గొట్టి మాళ్ళూ - ఊళ్ళూ కలిగి సమస్త సుఖాలూ అనుభవించారని వేమన అన్నాడు.

లింగమతములోన దొంగలుగా బుట్టి,
ఒకరి నొకరు నింద నొనర జేసి,
తురకజాతి చేత ధూళియైపోయిరి.

రాళ్ళ నమ్మియున్న రాజాధి రాజులు,
కూటి కెడలి భువిని కూలి చనిరి,
రాళ్ళ పగులగొట్టి రాక్షసపుత్రులు
మాళ్ళ నూళ్ళ గలిగి మనిరి వేమ.

ఆరు మతములందు అధికమైన మతమ్ము
లింగమతము కన్న లేదు భువిని,
లింగధార్ల కన్న దొంగలు లేరురా :

.... .... .... .... .... .... లింగంబు
నిష్టమీర మెడను నీల్గగట్టి,
కష్టపడుటె గాని కలుగదు మోక్షము.

మధ్యయుగాలకి చెందిన వైష్ణవ దాసర్లూ, సాతాన్లూ, గరుడబసివి రాళ్ళూ, కనీస నీతినియమాలు సైతం లేకండా, పచ్చివేషధారుల్లా జీవించే వారు. నాటి వైష్ణవమతగురువులు తీర్థం పేరిట సారాయి తాగి, ప్రసాదం పేరిట మాంసం తిని, వావీ వరుసల్లేకుండా పశువుల్లా ప్రవర్తించేవారు. అట్టి వారిని చూచి వేమన యీ విధంగా ఖండించాడు.

ఎంబెరు మతమని, యెసగ మాంసము దిని,
మారుపేరు బెట్టి మదువు త్రాగి,
వావి వరుస దప్పి వలికి పాలౌదురు.

రంగధామమునకు హంగుగా తానేగి,
కల్లుకంపు సొంపు గలిగియుండు.

పట్టుబట్ట గట్టి, పట్టె నామము బెట్టి,
వట్టి భ్రాంతి జెంది వైష్ణవుడయి,
లొట్టి దాగి నతడు లోకుల చెరచురా.

# మతపు వేషధార్లు మహిమీద పదివేలు

బారెడేసి జడలు పెంచుకొని, లేదా పొన్నకాయిలా గుండు నున్నగా గొరిగించుకొని, ఒంటినిండా బూడిద పూసుకొని, కాషాయం గుడ్డలు కట్టుకొన్న ప్రతి సన్యాసీ, తాను సాక్షాత్తూ జంగమ పరమశివుడిననే భావించాడు. అలాంటి దాంభికులైన కపటయోగుల్నీ, వారి బూటకాల్నీ వేమన బట్టబయలు జేశాడు. అంచేతనే, "కుటిల మతాచారములు, మూఢ భక్తి, వేషధారితనము మొదలగు వానిని దూలనాడుట యందీతం డద్వితీయుడు" అని డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి వ్యాఖ్యానించాడు.

బారెడేసి జడలు, భస్మంపు పూతలు,
మరునితోడ మారు మలయగలరు,
ముంజికోకలెల్ల లంజకోకల కాయె.

పొడుగు గల్గునట్టి పులితోలు, భూతియు,
కక్షపాలలు పది లక్షలైన,
మోత చేటె గాని మోక్షంబు లేదయా.

మనసు నిలుపలేని మాయావిరక్తులు
మనసు పడుదురేల మగువ కొరకు ??
సంతపాప పొత్తు — సన్యాసి జేరడా ??

మత గురువులన్నా, దేవుని పేరిట మోసంజేసే కపటులన్నా, వేమన తోక తొక్కిన తాచులా లేస్తాడు. మతమూ దేవుణ్ణీ అడ్డం బెట్టుకొని, అడ్డమైన గడ్డిమేసే వంచకుల్నీ, పామరజనం కాణాచిని దోచివేసే గాల్లోని పందికొక్కుల్నీ ఆయన అత్యంత తీవ్రంగా విమర్శించాడు. ఎందుకూ కొరగాని తిండిపోతులూ, పనిదొంగలూ, బతుకుదెరువు



...దరమ్మ గ్రంథాలయ ...
A C No ..........

లేని బడుగులూ, సిద్ధులమనీ– విరక్తులమనీ– యోగులమనీ–నేటి స్వాములవార్లూ బాబాలవలె, అనాడూ వేషాలు వేసుకొని అమాయక జనాన్ని మోసగించేవారు. అట్టివారిని గూర్చి యీ విధంగా అన్నాడు.

బతుకుదెరువులేని బడుగులందరు, పెద్ద
యోగివరుల మనుచు సాగిరాగ,
బండవాళ్ళు ముందు దండంబు లిడుదురు.

అల్లబోడి తలలు, తెల్లని గొంగళ్ళు,
ఒడల బూది పూసియుందు రెపుడు,
ఇట్టి వేషము లిల పొట్టకూటికె గాని.

వేషబాష లెరిగి కాషాయవస్త్రముల్,
కట్టగానె ముక్తి కలుగబోదు ;
తలలు బోడులైన తలపులు బోడులా ?;

మతపు వేషధార్లు మహిమీద పదివేలు,
మూఢజనుల గలప మూగుచుంద్రు.

కావిబట్ట గట్టి, కడు యోగివలె నుండి,
వెలికి కోర్కెలెల్ల విడిచిపెట్టి,
తొడరి తిరుగువాడు దొంగసన్యాసయా ;

తప్పు రూపుగట్టి ధరలోన తిరిగెడి,
సీతలెల్ల మిత్తి జేరువిధము,
కడుపు నిండ నింత కష్టంబు లేలరా?

శిష్యవర్గమునకు శివు జూపనేరక
కాని మతములోన కలుపునట్టి,
గురువు యెరుక నరయ గుడ్డెద్దు జొన్నరా;

# దొమ్మరిసాము కన్న హీనమైన యోగాసనాలు

మన వేదాంతులు మంత్రయోగం, హఠయోగం, రాజయోగం, లయయోగం యిత్యాది యోగాలు గూర్చి చెప్పారు. ఇలాంటి అమాంబాపతు యోగాల్ని అమలు జేసినవారు, ఆ కాలంలో పరమ నీచాతినీచమైన పనులు జేసేవారు. అట్టివాటిలో పచ్చిపెంట తినడం, ఉచ్చతాగడం, యిత్యాదులు గూడా వుండేవి. ఇలాంటి పనులు జేసి, గోసీబిగించి యోగాసనాలు వేస్తే మోక్షం లభిస్తుందా — అని అడిగాడు.

పచ్చిపెంట తినుచు, పండుటాకులు నమలి,
ఉచ్చ దప్పితీర్చ, ఉడుకు కోర్చి,
కచ్చను బిగియించ కలుగునా తత్వంబు?

పరమహంస ననుచు బరువుచేయగ భూమి
పరధనమ్ముల కాశ పడెడువాడు,
పరమహంస కాడు, పరమహింసకుండు.

జడలు దాల్చుటెల్ల, జగము ఛీయను టెల్ల,
ఒడలు విరచుటెల్ల, యోగమెల్ల
ముక్తికాంత బట్టి ముద్దాడు కొరకురా.

సన్యాసి కడుపు మాడ్చుకొని, యోగనిష్టలో తేలుతుంటాడు. కూడు లేకండా వున్నందుచేత, అతడి ఆకలిమంట కడుపులోని మలాన్నే భోంచేస్తుంది. కాబట్టి అన్నానికి బదులు సన్యాసి పెంటనే తింటాడని వేమన తార్కికంగా నిరూపిస్తాడు.

కూడు బెట్టకున్న కుక్షిలో జఠరాగ్ని,
భక్షణంబు జేయు కుక్షిమలము,
కూడు విడిచి మలము గుడుచురా ఉపవాసి.

కడుపు బోరగించి, కన్నులు మూసుకొని, శవంలా బిర్రబిగుసుకొన్న యోగి ఏమి సాధిస్తాడు? చివరికి దిక్కులేని చావు చచ్చి, యముని పాలిట గొర్రెగా మారతాడని చెప్పాడు.

కడుపు బోరగించి, కన్నులు ముకుళించి,
బిర్ర బిగుసుకొన్న బీదయోగి,
యముని బారి గొర్రె, యతడేమి చేయును?!

యోగులూ విరాగులూ అడవులూ కొండగుహల్లో ముక్కు మూసుకొని తపస్సు జేసుకొంటారనీ, అట్టివారిని సేవించి ఆశ్రయిస్తే తప్పక ముక్తి లభిస్తుందనీ, నాటి మూర్ఖులు నమ్మేవారు. గుహల్లో "ఘోరమైన" తపస్సు జేసుకొనే గురువును, మోక్ష సంపాదన కోసం వెదకడానికి వెళ్ళితే, గురువుకు బదులు ఏ క్రూరమృగమో తారసిల్లిందా, గురువు చూపే ముక్తిమార్గాన్ని ఆ పెద్దపులే ముందుగా చూపి, నోటిలో కటిక్కన వేసుకొని, సరాసరి స్వర్గానికి అదే టిక్కట్టు యిప్పిస్తుందని వేమన చెప్పాడు.

గుహలలోన జొచ్చి, గురువుల వెదకంగ,
క్రూరమృగమొకండు తారసిలిన,
ముక్తిమార్గమదియె ముందుగా చూపురా!

ఆడదాని అందమైన పెదవి - రాచపదవి కన్న గొప్పది! అంచేత ఆమె అధరాన్ని చూచినప్పుడు, యోగి తన మతందారినే పూర్తిగా మరిచి పోతాడు! మగువ అందాన్ని జూచి ఆతడు తన్మయత్వం జెందుతాడు. యోనిని జూచిన తక్షణం ఆతడు సర్వయోగాన్నీ మరిచిపోతాడని వేమన అన్నాడు! తపోనిష్ఠా గరిష్ఠులైన పరాశర - విశ్వామిత్ర - ఋష్యశృంగ - మాందకర్ణి - యిత్యాది మహామహా మునులంతా, అందగత్తెలైన స్త్రీల తొత్తులేనని వేమన చెప్పాడు.

మతముదారి మరచు మధురాధరము చూచి,
మగువరూపు జూచి మనసు మరచు,
యోని జూచి సర్వయోగంబు మరచురా!

శరీరం ఎండుటాకులా వాడిలిపోయినా, పళ్ళన్నీ సాంతం వూడి పోయినా, ముసిలితనం వల్ల దేహం గజగజ వాణికిపోయినా, కళ్ళు కన్పించక ముప్పుతిప్పలు బడుతోన్నా, స్త్రీలపై మోహం మాత్రం యీ మునిపుంగవులు వొదలరు, అని అన్నాడు.

అంగమెల్ల వడలి, అట దంతములు వీడి,
తనువు ముదిమిచేత తరచు వడకి,
ముప్పుతిప్పలైన మోహంబు వీడరు.

కదిలిన పళ్ళూ- సడిలిన కీళ్ళూ- మళ్ళీ బిగవడానికీ, పచ్చిపేడ తొక్కితే పదహారు వక్కలవడానికీ, నాటి యోగులూ సిద్ధులూ అడవుల్లో దొరికే అడ్డమైన ఆకుల్ని మేసి, కాయకల్ప చికిత్సకు ఉపక్రమించేవారు. ఇట్టి ఆశపాత్రుల్ని గూర్చి వేమన యిలా అన్నాడు.

ఆకులన్ని తిన్న మేకపోతున కేల
కాకపోయెనయ్య కాయసిద్ధి ?
లోకులెల్ల వెర్రిపోకిళ్ళు పోదురు.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధులు - అనేవి హఠయోగానికి చెందిన వివిధ సాధనాలు. (మార్గాలు) యోగాసనం వేసి, అంగాన్ని (శరీరాన్ని) బిగించి, ఒడలు విరుచుకొనే యోగమంతా (కసరత్తు అంతా) దొమ్మరిసాము కన్న పది వీసాలు తక్కువైందని వేమన ఖచ్చితంగా చెప్పాడు.

ఆసనములు పన్ని, అంగంబు బిగియించి,
ఒడలు విరుచుకొనెడు యోగమెల్ల,
జెట్టిసాము కన్న చింతాకు తక్కువ.

## మూఢ విశ్వాసాలపై దాడి

మానవ మేధస్సుకీ, జిజ్ఞాసకీ, తార్కిక దృష్టికీ, హేతువాదానికీ, వేమన యిచ్చినంత విలువ, భారతీయ మేధావుల్లో చార్వాకులు తప్ప ఏ ఆస్తిక జిజ్ఞాసువూ - మత సంస్కర్తా - యివ్వలేదంటే, ఏ మాత్రం అతిశయోక్తి గాదు. అర్థమూ ప్రయోజనమూ శూన్యమై, వైదిక పురోహితవర్గ కుక్షింభర జీవితానికి మూలమైన యాంత్రిక కర్మకాండనీ, బ్రహ్మజెముడు పొదల్లా మానవ వివేచనను చుట్టుముట్టిన నాటి అంధ విశ్వాసాల్నీ, వేమన అత్యంత తీవ్రంగా అపహాస్యం పాల్జేశాడు. యజ్ఞ యాగాల్నీ, వాటిపై బతికే పురోహితవర్గాన్నీ, రాతిదేవుళ్ళను చుట్టుముట్టిన పూజాపునస్కారాల్నీ, ఆయన చాకిరేవు బండపై నిర్దాక్షిణ్యంగా ఉతికి వేశాడు.

మరణించిన మాతాపితలూ, తాతముత్తాతలూ, పరలోకంలో వుంటారని నమ్మి వారికి తద్దినాలూ మాసికాలూ పెట్టి పిండాలు వేస్తారు. ఆ పిండాలు, వాటిని తినే కాకి ద్వారా, పరలోకంలోని తమ పితరులను జేరతాయని, వేసినవారి గుడ్డి నమ్మకం. ఈ అంధవిశ్వాసాన్ని వేమన యీ విధంగా గేలిజేశాడు.

పిండములను జేసి, పితరుల తలపోసి,
కాకులకును బెట్టు ఖలుడు దినము,
పియ్యి దినెడి కాకి పిత యెట్టులయ్యెనో ?

పితరయన్న మనసు ప్రీతితో బిలిపించి,
కాకులకును బెట్టు గాడ్దెలార,
కాకులందు నేమి, ఘనులకు బెట్టుడీ.

మూఢనమ్మకాల మురికిని పోగొట్టాలంటే, సమాజంలో చెలామణి అవుతోన్న మలిన సిద్ధాంతాల్ని నడిబజార్లో నిర్దాక్షిణ్యంగా ఉతికి తీరాలి. అంచేతనే హిందూసంఘం ముక్కుమీద గుద్ది, దానికి బుద్ధిజెప్పడానికి వేమన సిద్ధమయ్యాడు. "బుద్ధి జెప్పువాడు గుద్దితే ఏమయా?" అని అడిగాడు.

మేనమామ బిడ్డ మెరసి పెండ్లామాయె,
తురకలందు చెల్లె లాయె నదియు,
వలసిన పుణ్యంబు, వలదన్న పాపంబు.

పాలపక్షి శకునఫలమిచ్చు నందురు,
పాలపక్షికేమి ఫలము తెలియు?
తనదు మేలు కీళ్ళు తనతోడ నుండగ.

పండగ రోజున ఒక్క పొద్దువుండి (అంటే ఒంటిపూట భోజనం జేసి) నీళ్ళలో మునిగి, కూడు వండి "ఓ దేవుడా ఆరగించు" అని అంటారు. నిజానికి ఆ దేవుడి నోరు కట్టి తామే తింటారు– అని వేమన అన్నాడు.

ఒక్కపొద్దు లుండి, ఒగి నీళ్ళలో మున్గి,
కూడు వండి వేల్పు కుడువమనుచు,
దాని నోరు కట్టి, తామె తిందురు గదా!!

తీర్థయాత్రల కోసం కాశీ–రామేశ్వరాలకీ, తీర్థస్నానాల కోసం గంగా–గోదావరి–కృష్ణానదులకి పోతారు. అక్కడ నీళ్ళలో మునిగి, రాతి

దేవుళ్ళకి మొక్కుతారు. కించిత్తు ప్రయోజన మనేది వుందా-అని వేమన ప్రశ్నించాడు. (మూడొందల అరవై రోజులూ నీళ్ళలో స్నానంజేసే చాపలకి రాని పుణ్యం, యీ తీర్థస్నానాలు జేసేవారికి వొస్తుందా? అని ప్రాచీన భారతంలోని చార్వాకులు ప్రశ్నించారు.)

కాశి కాశియనుచు కడు వేడ్క బోదురు,
అందు గలుగు దేవు డెందులేడు?

భూమిపేరు వల్ల పుణ్యస్థలములాయె,
వెలయ రాళ్ళ వల్ల వేల్పులాయె,
నీళ్ళపేరు వల్ల నిఖిల తీర్థములాయె.

నీళ్ళ మునగనేల? నిధుల మెట్టగనేల?
మొనసి వేల్పులకును మ్రొక్కనేల?
కపట కల్మషములు కడుపులో నుండగా.

మక్కకు జననేల? మగుడ తా రానేల?
ఏకమైన చిత్తమెందు గలదు?

అడవి తిరుగలేదు, ఆకసమున లేదు,
అవని తీర్థయాత్ర లందు లేదు,
ఒడలు శుద్ధిజేసి ఒడయని చూడరా.

మనసు లోని ముక్తి, మరియొక్క చోటను
వెదుక బోవువాడు వెర్రివాడు.

అక్షరం బెరుగక, అడవుల తిరుగుచు,
కొండరాళ్ళ గుళ్ళ కొలువనేల?

# తిరపతి మొక్కు

ఈనాడు చదువుకొన్నవాళ్ళూ, చదువురానివాళ్ళూ, బీదా-భాగ్యవంతుడనే తేడా లేకండా, పార్లమెంటు మెంబర్ దగ్గరనుండి తాలూకా ఆఫీసు బంట్రోతువరకూ, ఆలిండియా డెలిగేట్లూ, హోలిండియా ఏజెంట్లూ, మంత్రులూ సామంతులూ వారివారి ప్రాంతీయ దండనాయకులూ, సర్వులకీ తిరపతివెళ్ళి గుండు గొరిగించుకోవడం వొక వెర్రిగా-వొక ఫ్యాషన్‌గా తయారైంది. ఎలాంటి హేయమైన మార్గాలు అనుసరించియైనా, ఎన్నికల్లో గెలిచి ఎదో వొకసీటు సంపాయించాలనే ఉద్దేశంతో, తిరపతి వెంకన్న డిబ్బీలో పచ్చనోట్లని దక్షిణగా-గౌరవనీయ లంచంగా సమర్పించు కొంటున్నారు. డిబ్బీలో వేయబోయిన డబ్బు గాలికెగిరి కిందపడినందువల్ల ఓటమి కలిగించని కొందరు సంతృప్తి జెందుతోంటే, గెలిచినవారు నున్నగా గుండు గొరిగించుకొని పత్రికల్లో సైతం ఫోటోలు వేయించుకొంటోన్నారు. వ్యాపారం దగ్గరనుండి ప్రజాస్వామ్యం దాకా విస్తరించిన సమస్త లాభదాయక రంగాల్లోనూ, ఏ మార్గం ద్వారా నైనా "కలిసి" వొస్తే, తిరపతి దేవుడికి ముడుపు చెల్లించే స్థితి దాపరించింది. అధికధరల వల్ల పేదల కడుపులు కొట్టి లక్షలు ఆర్జించితే, చిలక్కొట్టుడు ద్వారా పాలు పొంగినట్లు పొంగితే, వొచ్చిన రోగం నయమైతే, పట్టుకొన్న విరోచనాలు ఆగిపోతే, పదవి వొస్తే, ప్రమోషన్ లభిస్తే, ప్రొబేషన్ ప్రకటించబడితే, తగ్గిపోయిన మామూళ్ళు మళ్ళీ ఎక్కువైతే, వొక్కటేంటి - పిల్లికీ బిచ్చానికీ - తిరపతి వెళ్ళి గుండు గొరిగించుకోవడం మందులేని జాడ్యంగా పరిణమించింది. రైళ్ళలో, బస్సుల్లో, రోడ్లపై సర్వేసర్వత్రా చీరలు గట్టుకొన్న చిగురుబోడి బోడిగుళ్ళూ, ఈవినింగ్ టోపీల్లో దర్శనమిచ్చే నాగరీకం మగవిధవలూ నేడు తారసిల్లుతోన్నారు. ఈనాడులా అనాడు గూడా

తిరపతికి ఉసిళ్ళపుట్టలా తరలివెళ్ళేవాళ్ళను జూచి, వారి అవివేకాన్నీ మౌఢ్యాన్నీ ఎలా ఎగతాళిజేశాడో చూడండి.

తిరుమలకును బోప తురక — దాసరి గాడు,
కాశి కేగ పంది — గజము కాదు,
కుక్క సింగమగునె గోదావరికి బోవ॥

తిరపతి వెంకన్నకి తలవెంట్రుకలిచ్చే ముందు, తలకి నీళ్ళు రాసి, ఆ తర్వాత మంగలి గుండు గొరుగుతాడు. అంచేత, మంత్రజలము కన్న మంగలి జలమే యెక్కువైందని వేమన గేలి జేస్తాడు॥

సకల తీర్థములను, సకల యజ్ఞంబుల,
తలలు గొరుగకున్న ఫలము లేదు,
మంత్రజలము కన్న మంగలిజలమెచ్చు.

ఈ విధంగానే కబీర్ గూడా యీ గుండు గొరుగుడు భక్తి గూర్చి యిలా అన్నాడు.

గొరుగనేల జుట్టు కొన్ని వంచలసార్లు?
దాని నేరమేమొ కానరాదు॥
నిఖిల దోషములకు నిలయమై తనరారు
మనసు గొరుగదేమి మానవుండు?

## ముహూర్తాలు - విధవరాళ్ళు

సైన్స్ గణనీయమైన ప్రగతిని సాధించిన నేటి వైజ్ఞానిక యుగంలో గూడా, విద్యాధికులమని విర్రవీగేవారు సైతం, లగ్నాలూ ముహూర్తాలూ పెట్టి, వధూవరుల జాతకాల్ని అతిజాగ్రత్తగా జ్యోతిష్కునికి చూపించి, పురోహితునిచే పెళ్ళిళ్ళు జేయిస్తోన్నారు. నిర్జీవ కర్మకాండ స్వైరవిహారం గావిస్తో, అంధవిశ్వాసం మానవమేథను

రేగుకంపలా ఆవరించిన మధ్యయుగాల్లోనే, యీ తతంగమంతా అర్థరహిత మని వేమన స్పష్టంగా చెప్పాడు. అనాడు (ఈనాడు గూడా) జాతకాలూ శుభలగ్నాలూ వేలం వెర్రిగా తయారయ్యాయి. జ్యోతిష్యుని వొద్దకెళ్ళి, జాతకాల ప్రకారం పెళ్ళి ముహూర్తం పెట్టించి, బ్రాహ్మలంతా జేరి పెళ్ళిమంత్రాల పేరిట వెర్రికూతలు కూసి, వధూవరులకి శుభంగా వివాహం జేయగా, పుసుక్కున మొగుడు చచ్చి, పెళ్ళికూతురు కాస్తా ముండ మోసింది! ఇది- "శుభలగ్నం" పెట్టిన జ్యోతిష్యుని పొరపాటా? కాక- జ్యోతిష్యుల పేరిట చలామణీ అవుతోన్న సోంబేర్లని తెగ మేపే బుద్ధి హీనుల విశ్వాస జాడ్యమా- అని వేమన ఆనాడే ప్రశ్నించాడు! ధర్మ శాస్త్రాలూ, పురాణాలూ, జాతకాలూ, ప్రాచీన ఆచార వ్యవహారాలూ కర్మ కాండల్ని ప్రసవించిన, వైదిక పురోహితవర్గ పరాన్నభుక్కు సంస్కృతిపై వేమన చేసినంత విప్లవాత్మక విధ్వంసకర దాడి లాంటిది, బహుశా చార్వాకుల తర్వాత యావదాంధ్ర సాహితీ చరిత్రలో మరెవ్వరూ చేయ లేదు. ముహూర్తాలు గూర్చి ఏమన్నాడో చూడండి.

విప్రులెల్ల జేరి, వెర్రి కూతలు కూసి,
సతిపతులను గూర్చి సమ్మతమున,
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా?!

## వేదాలు వల్లె వేయడం

వాస్తవ జీవితానుభవానికి పూర్తిగా దూరమైన కేవల శాస్త్ర పాండిత్యంపై, వేమనకి చింతాకంత గౌరవం సైతం లేదు. వేద మంత్రాలూ, మతగ్రంధాలూ, యాంత్రికంగా వల్లిస్తో, స్వానుభవం శూన్యమైన "శాస్త్రజ్ఞానాన్ని" ప్రదర్శిస్తే, వీసమంత ప్రయోజనం గూడా లేక చివరికి చిత్తభ్రమ (మతిపోవడం)మాత్రమే మిగులుతుందని చెప్పాడు. చిత్ర (గారడీ) దీపం వల్ల చీకటి పోతుందా- అని ప్రశ్నించాడు.

స్వానుభవము లేక శాస్త్రవాసనలచే,
సంశయంబు చెడదు సాధకునకు
చిత్రదీపమునకు చీకటి చెడనట్లు.

గుడ్డి వేదాంత సూత్రాల్నీ, వేదమంత్రాల్నీ సూక్తిముక్తావళి లోని రూళ్ళకర్ర సిద్ధాంతాల్నీ, దోపిడీవర్గాల్ని సమర్థించే శ్లోకాల్నీ బట్టీ కొట్టి, అమాయకుల్ని మోసగించే కపటుల్ని గూర్చి ఈ విధంగా చెప్పాడు.

చదువులన్ని చదివి, చాల వివేకింప,
కపటి కెన్నఁడేల కలుగు ముక్తి ?
దాలిగుంట కుక్క దలచిన చందంబు.

ఎంగిలెంగిలనుచు యీనోటి తోడనే,
వేదములను చదువు వెర్రులార,
ఎంగిచూడ నదియె ఎంగిలి కాదొకో ?

వెర్రికుక్కల వలె వేదాలు చదివితే,
ఆశయంబు లెరుగ రయ్యవార్లు.
వేద విద్యలెల్ల వేశ్యల వంటివి,
భ్రమల బెట్టి తేటపడగనియవు.

## యజ్ఞ యాగాలు

యజ్ఞం జేసేప్పుడు, యజమాని భార్య (సోమయాజీగారి భార్య) తాను గతంలో వ్యభిచరించి వుంటే, ఎన్నిసార్లు ఎవరెవరితో వ్యభిచరించిందీ సూచించడానికి, అన్ని గడ్డిపోచల్ని యజ్ఞ వేదిక వాద్ద పెట్టేవారు. తద్వారా ఆలి రంకు - సోమయాజిగారి భార్య రంకు బయటపడుతుంది. తద్దినం పెట్టేప్పుడు, పేరుకు తండ్రీ యెవడైనా, తనకు జన్మనిచ్చినవాడికే స్మశానంలో వేసే పిండం చెందుతుంది. అంటే

పిండం పేసేవాడి యొక్క తండ్రి, తల్లి యొక్క రంకుమగడైతే, ఆ పిండం వీడికే చెందుతుందిగానీ, పేరుకు తండ్రిగా చెప్పబడేవాడికి మాత్రం చెందదు— అని యజ్ఞంలోని గుట్టునీ, తద్దినంలోని రట్టునీ వేమన బట్టబయల్జేశాడు. ఈ విధంగా యజ్ఞాలు — కట్టుకొన్న భార్య రంకునూ, తద్దినాలు— కన్నతల్లి రంకునూ బయటపెట్తాయి అని వేమన అన్నాడు.

అలిరంకు తెలుపు అఖిల యజ్ఞంబులు,
తల్లి రంకు తెలుపు తద్దినములు,
కాని తెరువు కర్మకాండ కల్పితమాయె.

## రంభ కోసం యజ్ఞం

యజ్ఞయాగాలు జేస్తే, మరణానంతరం స్వర్గానికి వెళ్ళి, దేవేంద్రుని ఉంపుడు కత్తైయైన రంభతో సంభోగసుఖాన్ని పొందవొచ్చుననే రాక్షస కాంక్ష— అంధవిశ్వాసం, నాటి పాలక— పురోహిత వర్గాల్లో వుండేది. రంభా సంభోగం కోసం యజ్ఞంజేసి, యజ్ఞంలో నల్ల మేకను చంపి, ఆ మేకనంజుడు ఆరగిస్తే, ఆ యజ్ఞం కామయజ్ఞంగా మారుతుంది. అప్పుడు సోమయాజి కాస్తా కామయాజిగా మారతాడు— అని వేమన దారుణాతి దారుణంగా గేలిజేశాడు. రంభా సంభోగం కోసం చేసే యజ్ఞయాగాల్నీ, వాటిని అత్యంత భక్తిశ్రద్ధల్తో చేసే కామయాజుల్నీ ఆతడు నడిబజార్లో కడిగివేశాడు.

లంజ కొరకు మేకనంజుడు తినసాగ,
యజ్ఞమెల్ల కామయజ్ఞమాయె,
మొదట సోమయాజి, తుద కామయాజిరా!

# సోమయాజులు - కామయాజులు

యజ్ఞం జేస్తామని విఱ్ఱవీగుతో, కచ్చ కడిగే నెయ్యిని కడుపారా తాగే రంకుకొడుకుల్ని వైకుంఠంలో (రంగాన) మెచ్చుతారా- అని ప్రశ్నిం చాడు.

క్రతువు జేసెదమని కడు విఱ్ఱవీగుచు,
కచ్చ కడుగు నెయ్యి కడుపు దించు
రంకు కొడుకులను రంగాన మెత్తురో ?

ఒంటిపై సొంపైన శాలువ కప్పుకొని, చెవులకి ముచ్చటగా మకర కుండలాల్ని ధరించి, తాను సోమయాజినని బ్రాహ్మడు చెబుతాడు. అయితే వీటిని సింగారించుకొన్న యీ మకరకుండల మండితుడైన వైదికపండిత ప్రకాండుని వల్ల, ప్రజల కెలాంటి ప్రయోజనం కల్గుతుంది- అని వేమన సూటిగా ప్రశ్నించాడు.

సోమయాజిననుచు సొంపైన శాలువల్,
మకర కుండలములు మనసుతీర
తా ధరించు, మనకు తానేమి లాభించు ??

ఈ విధంగా అంధవిశ్వాసాల్ని, నిర్జీవమైన యజ్ఞయాగాది కర్మ కాండను విమర్శించినా, వేమన మాత్రం బ్రాహ్మణద్వేషి కాదు. ఆయన బ్రాహ్మణమత ద్వేషి. వేమన చేసింది- విధ్వంసనాత్మకమైన విమర్శ మాత్రమే కాదు. అంచేతనే యిలా అన్నాడు.

బ్రాహ్మణులకు సకల భాగ్యంబు లీవచ్చు,
గౌరవింపవచ్చు, కోరి వారు
జ్ఞానమొసగి జనుల కడతేర్చగలిగిన.

అయితే వేమన ఆశించినట్లు, వారు జనులకి జ్ఞానమిచ్చి కడతేర్చ లేదు. అయినా పాల్కురికి సోమనవలె, శివమెత్తి పచ్చి మతద్వేషంతో

"బ్రాహ్మణ గార్దభాలు" అని నానా తిట్లూ తిట్టలేదు. నాటి అమాయక ప్రజల అంధవిశ్వాసాల్ని, పురోహితవర్గం తమ సోంబేరు జీవితానికి సాధనంగా ఉపయోగించుకొంటున్నారనే వేమన దుగ్ధ. భూమ్మీద "దేవుని ప్రతినిధులైన" బ్రాహ్మలకి సేవజేస్తే, స్వర్గం సులభంగా ప్రాప్తిస్తుందని నాటి పురోహితులు ప్రజల్లో పట్టిగ్గా ప్రచారం జేశారంటే, యితర కులాలపై బ్రాహ్మణాధిక్యత యెంతగా పెచ్చుపెరిగిపోయిందో మనం గ్రహించవొచ్చు. అంచేతనే వేమన యిలా అన్నాడు.

బ్రహ్మవంశ భవులు ప్రబలులై యుండగా,
ఇతర జాతులకును గతులు గలవె?

బ్రాహ్మలు సంఘంలో ప్రబలులుగా వుండగా, యితర జాతులకు (కులాలకు) గతులున్నవా-అని వేమన ప్రశ్నించాడు.

జన్మరీత్యా ప్రతి బ్రాహ్మణ బాలుడూ శూద్రుడే. జందెం వేసి నప్పుడే ఆతడు ద్విజుడు అవుతాడు. ద్విజుడంటే- రెండవసారి పుట్టిన వాడు-అని అర్థం. అయితే బ్రాహ్మణ స్త్రీకి ఉపనయన సంస్కారం లేదు గాబట్టి-జందెం వేయరు గాబట్టి, బ్రాహ్మణకులంలో పుట్టినా ఆమె ఆజన్మాంతమూ శూద్రస్త్రీయే. అలాంటప్పుడు ఉపనయన సంస్కారం ద్వారా బ్రాహ్మణత్వం - ద్విజత్వం - అపాదింపబడని శూద్రస్త్రీకి పుట్టినవాడు, ఏ విధంగా బ్రాహ్మడౌతాడు? పుట్టుకతోనే శూద్రుడైనవాడికి ఉపనయనం — బ్రాహ్మణత్వాన్ని ప్రసాదించగలదా?! జన్మతః శూద్రుడైనవాడు, జందెం వేయగానే అగ్రవర్ణస్థుడుగా ఎలా పరిగణింపబడతాడు? అంటూ మూడు పాదాల్లో తల తిరిగిపోయే ప్రశ్నలు వేసి, అగ్ర-అధమ-వర్ణాల బూటకాన్ని అపూర్వ తార్కిక పటిమతో వేమన బట్టబయల్జేశాడు. చూడండి ఏమన్నాడో.

ఉపయమందు శూద్రు డుత్తమోత్తముడెట్లు?
సతికి శూద్రతనము సత్యమె కద??
తల్లి శూద్రయయ్యె - తానెట్లు బాపడు??

# బూటకమైన ఉపనయనం

తన అమ్మమ్మా, తన అమ్మా, తన పిన్నమ్మా, నాయనమ్మా, తాతమ్మా - వీరందరికీ ఉపనయన సంస్కారం — జందెం వేయడం — పూర్తిగా నిరాకరించబడింది. ఉపనయన సంస్కారం లేని యీ "బ్రాహ్మణ" స్త్రీలు, కేవలం శూద్రస్త్రీలతో సమానం. అలాంటి శూద్ర స్త్రీలకి అటు ఏడు తరాలూ, యిటు ఏడు తరాలూ, మొత్తం పధ్నాలుగు తరాలుగా జన్మిస్తో వొచ్చిన తాను, ఏ విధంగా బ్రాహ్మడు ఔతాడు — అని వేమన తర్కబద్ధంగా సూటిగా ప్రశ్నించాడు. మూడుపందల ఏళ్ళు దాటిన తర్వాత నేటికైనా కొమ్ములు దిరిగిన ఏ వైదికపండిత ప్రకాండుడైనా, వేమన ప్రశ్నకి సవ్యంగా సమాధానం జెప్పగల దమ్ములున్నాయా??

తల్లిగన్న తల్లి, తన తల్లి, పినతల్లి,
తండ్రిగన్న తల్లి, తాత తల్లి,
ఎల్ల శూద్రులైరి, ఏటి బాపడు తాను?

మెడకి తాడు (జందెం) వేసుకొని, జన్మరీత్యా తనకున్న శూద్రత్వం పోయిందని వదరడం - బుద్ధిలేనితనం గాదా?? చంచలచిత్తునికి ఈ జందెం వన్నె తెస్తుందా? కడుగును (బియ్యం కడిగిన నీళ్ళను) తాగిన కాకి- క్రురుక్రుమని అరిచినట్లు, పడుగు చాలా ముఖ్యమైందని బ్రాహ్మలు వదరుతుంటారు. - అని ఉపనయనం తంతును, వేమన అత్యంత నిశితంగా ఖండించాడు. బ్రాహ్మణత్వంలోని బండారాన్నీ, జందెం తంతులోని కపటనాటకాన్నీ, అగ్రవర్ణ దురహంకారాన్నీ, వేమన నిర్దాక్షిణ్యంగా చీల్చి చెండాడాడు.

తాడు మెడను వేసి, తనకు శూద్రత్వంబు
పోయెననెడి దెల్ల బుద్ధిలేమి!
మది నిలువక తాడు మరి వన్నె దెచ్చునా?

వడుగు ద్విజులకెల్ల కడు ముఖ్యమందురు,
వడుగు చేసెదమని వదరుకొనుచు,
కడుగు తాగి, కాకి కర్రు కర్రన్నట్లు.

శ్రీరాముని కులబ్రాహ్మడు – వసిష్టుడు. ఈ వసిష్టుని తల్లియైన ఊర్వశి - వేశ్య. ఈతని భార్యయైన అరుంధతి - మాదిగ వనిత. వేశ్యయైన ఊర్వశికి పుట్టిన వసిష్టుడు, తాను బ్రాహ్మడని చెప్పకొంటే సరిపోతుందా? వసిష్టుని కులమేదో ప్రపంచానికి తెలియదా - అని వేమన ప్రశ్నించాడు. ఊర్వశి వంటి వేశ్యకి జన్మించిన వసిష్టుడు, మన పురోహితులచే ఎలా బ్రాహ్మడుగా యెంచబడ్డాడు - అని వేమన తర్కబద్ధంగా నిగ్గదీశాడు. (మన బ్రాహ్మల్లో చాలామంది వసిష్టగోత్రానికి చెందినవారే.)

తల్లి ఊర్వశి లంజ, తన ఆలు మాదిగ,
తాను బ్రాహ్మణుడన తగునె జగతి?
వాసిష్ట కులమును వసుధలో నెరుగరా!

శమదమాది గుణాలూ, ఉత్తమజ్ఞానం కలిగినవారే బ్రాహ్మలు గాని, ఊరక జన్నిదములు (జందేలు) దాల్చి, దిమ్మమీద బొమ్మల్లా కూర్చునే బడుగులంతా బ్రాహ్మలెలా ఔతారని ప్రశ్నించాడు.

బ్రాహ్మణుల మటంబ్రడు బ్రహ్మత్వమదిలేని
బ్రాహ్మ్యమద్దియేల బ్రాహ్మణుడటె?
బొమ్మవలెను తాను దిమ్మపై గూర్చుండ.

విప్రవరుల మనుచు, వేదంబు చదువుచు,
పామరులను జూచి పరిహసించు
ధరణిసురుల కన్న దాసరిమత మెచ్చు.

కులగోత్రాల వల్ల ఎవ్వడూ బ్రాహ్మడూ - శూద్రుడూ కాడు అని వేమన బోధించాడు. కులభేదం మనిషిలో అగ్రవర్ణ దురహంకారాన్ని రెచ్చగొట్టి, సంకుచిత మనస్తత్వాన్ని ప్రేరేపించి, కూపస్థమండూక తత్వాన్ని వృద్ధిపరిచి, తరతరాలుగా మనిషికీ మనిషికీ మధ్య కృత్రిమ సరిహద్దుల్ని సృష్టించి, మానవుని పశుతుల్యునిగా చేస్తుందని వేమన బోధించాడు. తిక్కన కాలంనుండి విజయనగర సామ్రాజ్య పతనం వరకూ, ఆ తర్వాతా నడిచిన దేశచరిత్రను నిశితంగా పరిశీలిస్తే, కుల మత భేదాల కుమ్ములాటల వల్ల ఎన్ని సామ్రాజ్యాలు కూలిపోయాయో, మతం పేరిట ఎంత మానవరక్తం అకారణంగా రణరంగంలో పారిందో, దేశ ఐక్యతకి ఎంతటి ఘోరవిపత్తు వాటిల్లిందో గత అధ్యాయల్లో మనం చూశాము. వేమన కులం హెచ్చుతగ్గుల్ని గూర్చి యిలా అన్నాడు.

కులము హెచ్చుతగ్గు కొదువలు పనిలేదు,
సానుజాతమయ్యె సకల కులము,
హెచ్చు తగ్గుమాట లెట్లెరుంగవచ్చు?

ఎరుక–జ్ఞానం–లేనివాడు ఏ కులానికి చెందినా అధముడేననీ, జ్ఞానం గలవాడు ఏ కులంలో పుట్టినా గౌరవనీయుడేననీ వేమన అంటాడు. జాతి అనే పదాన్ని కులం అనే అర్థంలో వేమన వాడాడు.

జాతులందు నెట్టి జాతి ముఖ్యము చూడ,
ఎరుక లేక తిరుగ నేమి గలదు?
ఎరుక గలుగు మనుజుడేజాతి గలవాడు?

ఎరుకలేనివాడు యే జాతియైనను,
మాల కంటె చెడుగు,

జన్మతః సర్వమానవులూ సమానమేననీ, పుట్టుక వల్ల ఏ మనిషీ ఎంతటి తక్కువకులానికి చెందినా నీచుడుగాడని చెప్పి, అణువణువునా తొణికిసలాడే మానవతావాదానికి హృదయపూర్వకంగా నీరాజనం బట్టిన మానవతావాది—వేమన. అంటరానివారంటే యిందువల్లనే ఆయనకెంతో అభిమానం. అగ్రవర్ణ దురహంకారం నరనరానా జీర్ణించుక పోయిన కొందరి దృష్టిలో, నేటికీ హరిజనులు— మనుషుల కిందనే జమ కాదు: అలాంటి దీన మానవులకి సంఘంలో సముచితమైన స్థానమివ్వాలని వేమన ఆనాడే ప్రబోధించాడు. అస్పృశ్యులనే పేరు బెట్టి, కనీస హక్కులు సైతం లేకండా వారిని శతాబ్దాల తరబడీ అణగదొక్కి, వారిని ముట్టుకోరాదని శాసించిన అధర్మ ధర్మవేత్తల్ని నేలా వింగీ దద్దరిల్లేట్లు యీ విధంగా ప్రశ్నించాడు.

ముట్టు ముట్టనుచును ముట్టరాదందురు,
ముట్టుకు దరియేమి మూలమేమి ?
నవబిలముల మురికి నరులకందరకును
పుట్టగానె ముట్టు పుట్టు వేమ.

## మాలవాని జూచి ఏల నిందింపగ

మానవత్వంలో మాలత్వం లేదనీ, మనిషి లోని అగ్రవర్ణ మలినత్వాన్ని నిర్మూలించమనీ వేమన ప్రబోధించాడు. బ్రాహ్మణ్ణి కోస్తే పాలూ, మాలని కోస్తే నీళ్ళూ రావని చెప్పాడు. ఏవ్యక్తీ పుట్టుకతో మాలకాదనీ, అతని ప్రవర్తనయే అతన్ని హీనునిగా చేస్తుందని ఆయన చెప్పాడు.

మాల మాలకాడు మహిమీద నే పొద్దు,
మాట తిరుగువాడు మాలగాక.

వాక్కు-శుద్ధి లేనివాడు ఛండాలుడు.
మాలవాని జూచి యేల నిందింపగ?
పాటికాని మాట పలుకుచె గద?
వానిలోన పలుకు, వాని కులంబేది?

అంటరానితనాన్ని సృష్టించిన తుంటరివెధవల్ని వేమన యీ విధంగా ప్రశ్నించాడు.

మాలవాని నంటి మరి నీట మునిగితే,
కాటి కేగినపుడు కాల్చు మాల!
అప్పుడంటిన యంటు యిప్పుడెందేగెనో?

గడ్డిమేసే గొడ్డును - తినే పంచములు అధములనీ, పెంట తినే పంది - కోడిని భోంచేసే శూద్రులను ప్రాజ్ఞులనీ అంటారా - అని వేమన ప్రశ్నించాడు! ఆకూ అలము మాత్రమే మేసే గొడ్డును తినేవారిని అధములుగానూ, పెంట తినే పంది - కోడిని - భోంచేసే వారిని అధికులుగానూ పరిగణించే హిందూసమాజ మూర్ఖత్వాన్ని, మేథో దౌర్భాగ్యాన్ని వేమన అత్యంత తర్కబద్ధంగా గేలిజేశాడు. గొడ్డుమాంసం తినే పంచముల కన్న అశుద్ధం గతికే వాటిని భోంచేసే శూద్ర అగ్ర కులాలవారు యీ విషయంలో హీనులు గారా - అని తల తిరిగిపోయే తర్కంతో వేమన వాదించాడు.

కసవు నేరి తినెడు పసరము తినువాని,
మాలయండ్రు గాని మహిని జనులు,
పంది-కోడి తిన్న ప్రాజ్ఞులటందురా?!

# పసిడి గలుగువాని బానిసకొడుకులు

మనిషికి పంచేంద్రియాలున్నా, వాటన్నిటి కన్న ప్రధానమైన ఆరో ఇంద్రియం-ధనం-లేకపోతే ఆతడు గుడ్డిగవ్వకైనా చెల్లడు. ధనమూల మిదం జగత్తనే పైశాచిక నీతిని పాటించే సాంఘిక వ్యవస్థలో; డబ్బుంటే కులగోత్రాల్తో బ్రాహ్మణ - అబ్రాహ్మణ భేదాలతో పనిలేదు. చచ్చిన శవం మీద ముసిరే ఈగల్లా, డబ్బుగలవాడి చుట్టూ అగ్రవర్ణ దురహంకారంతో విర్రవీగేవారు సైతం మాదాకవళానికి నిస్సిగ్గుగా మూగుతారు. విజయనగరాంధ్ర సామ్రాజ్య చక్రవర్తియైన శ్రీకృష్ణదేవరాయలు వేశ్యకి జన్మించినా, ఆతనికి విష్ణుఅంశ సంభూతుడనే బిళ్ళని తగిలించి, అతన్ని గూర్చి నాటి పురోహితవర్గ పండితులు చిలవలు పలవలుగా ప్రచారం జేయలేదా? రెడ్డిరాజులూ - పద్మనాయక వెలమదొరలూ శూద్రులైనా, వారి చుట్టూ జేరిన వందిమాగధ పండితమ్మన్యులు వారికి సచ్ఛూద్రులనే అందమైన బిరుదాన్ని తొడిగి చెక్క-భజన చేయలేదా? సిరిసంపదలూ అధికారమూ ప్రధానమైనవని చెప్పిన వేమన, సంఘంలో సంపదకున్న గౌరవం మనిషికి లేదని అన్నాడు. "కులహీనుడు" గూడా డబ్బుంటే వెలుగుతాడు. సంపదలేనివాడు కులం అంతస్థులో కిందికి జారతాడు. కాబట్టి సమాజంలో కులం కన్న కలిమియే ముఖ్యమైందని ధనం ప్రాబల్యాన్ని వివరించాడు. వర్ణం రీత్యా ఎంత బ్రాహ్మడైనా, స్వర్ణమున్న వాడికే అతడు లొంగి వుంటాడని వేమన చెప్పాడు.

కులము లేనివాడు కలిమిచే వెలయును,
కలిమి లేనివాడు కులము దిగును;
కులము కన్న మిగుల కలిమి ప్రధానంబు.

మాసిన తలతోడ, మలిన వస్త్రము తోడ,
ఒడలు జిడ్డుతోడ నుండెనేని,
అగ్రజన్ముడైన అట్టె ఛీ యందురు;

పూస పోగులును, పుట్టంబు, విడియంబు,
కాయపుష్టి మిగుల గలిగియున్న,
హీనజాతినైన యిట్టె రమ్మందురు॥

అంచేత, ఇటు రమ్మనడానికీ - అటు పొమ్మనడానికీ, ధనమూ డాంబికమూ దర్పమే ప్రధానమైనవనీ, శుచిలేనివాడు అగ్రకులంవాడైనా అతన్ని అంతా అసహ్యించుకొంటారనీ వేమన చెప్పాడు. కులగోత్రాల మదంతో విర్రవీగేవారూ, పండిత ప్రకాండులమని కండకావరం ప్రదర్శించేవారూ, డబ్బున్నవాడికి సిగ్గూబిడియం లేకండా ఊడిగం జేసే బానిసకొడుకులేనని వేమన ఖండితంగా చెప్పాడు. అగ్రకులాలకీ - గొప్పగోత్రాలకీ చెందినవారు ధనవంతులకి వొంగి వొంగి సలాములు జేసే గులాములేనని ఆయన అత్యంత తీవ్రంగా విమర్శించాడు. శ్రీమంతుల సంపదను రక్షించే వివిధ ధర్మశాస్త్రాల్ని రచించి, వారి సచ్ఛారిత్వాన్ని నిరూపించే రకరకాల పురాణాల్ని రాసి, వారు సూర్య - చంద్ర -వంశాలకి చెందినవారనే కట్టుకథల్ని సృష్టించి, వారి ముండలములాకోరుతనాన్ని రసికజీవనంగా వ్యాఖ్యానించి, వారు విసిరే ఎంగిలిమెతుకుల్ని దానధర్మాలుగా కీర్తించి ప్రచారంజేసే యీ అగ్రవర్ణ దురహంకారులు, వాస్తవానికి పసిడి గల్గువాని బానిసకొడుకులు మాత్రమేనని చెప్పిన వేమన, తోక తొక్కిన తాచులా ధనం చేతిలోని గులాములపై విరుచుకపడ్డాడు.

ఉర్వివారి కెల్ల నొక్క కంచము బెట్టి
పొత్తు గుడిపి కులము పొలయజేసి
తలను చేయిబెట్టి తదనమ్మ జెప్పరా.

భూమ్మీద వున్న జనులందరికీ వొకే కంచంలో పెట్టి, పొత్తు కుడిపి, కులాన్ని సర్వనాశనం జేయమనీ, ఈ పరమసత్యాన్ని అందరూ నమ్మే విధంగా వారి తలపై చేయిపెట్టి (ప్రమాణపూర్తిగా) వారు విశ్వసించేట్లు చెప్పరా-అని ఆనాడే బోధించాడు. కులరహితమైన సమాజాన్ని నిర్మించమని

ఆ మహామహుడు మూడు వందల ఏళ్ళ క్రితమే ఎలుగెత్తి చాటాడు. ఇంతటి విప్లవాత్మకమైన సూచనను ప్రతిపాదించిన వ్యక్తి, ఆంధ్రప్రజల చరిత్రలోనే నిస్సందేహంగా లేడు. పల్నాటికి చెందిన బ్రహ్మనాయుడు, "చాపకూడు" పేరిట ఆనాడు సహపంక్తి భోజనాలు ఏర్పాటుజేసినా, కన్నడరాష్ట్రంలోని బసవయ్య కులభేదాల్ని ఖండించినా, వీరెవ్వరూ కుల వ్యవస్థను సమూలంగా నాశనం జేయమని చెప్పలేదు. మహామారి లాంటి కులపిశాచాన్ని ఏడు నిలువుల గోతిలో పాతిపెట్టి, మానవ సోదరత్వాన్ని స్థాపించాలని నిర్ద్వంద్వంగా చెప్పినవాడు—మధ్యయుగాల భారతచరిత్రలో వేమన వొక్కడే. కులవ్యవస్థలోని అగ్రకులాల దౌర్జన్యానికీ, అధమకులాల బాధలకీ మూలకారణం-కులమేనని గూడా ఆయన చెప్పాడు.

## కలిమి లేములు లేని కాలం వొస్తుందా?

పుత్తడి గలవాని పుండుబాధయు గూడ
వసుధలోన చాల వార్త కెక్కు,
పేదవాని యింట పెండ్లైన యెరుగరు.

పుత్తడి (బంగారం) గలవాని పుండుబాధ గూడా, లోకంలో గొప్పవార్తగా -విశేషంగా—చెప్పుకొంటారు. కాని పేదవాని యింట్లో జరిగిన పెళ్ళిగూర్చి నోరుగూడా మెదపరు? ధనిక-దరిద్ర భేదాలపై నిల్చిన సాంఘికవ్యవస్థ లోని అత్యంత దుర్మార్గమైన "నీతిని," యీ పద్యంలో వేమన యెంతో ప్రతిభావంతంగా చిత్రించాడు. చదువులూ (పాండిత్య ప్రకర్ష) పాడి మొదవులూ (ఆలమందలు) స్త్రీల పెదవులూ, రాజ్య పదవుల పట్ల ఆశలు లేనట్టివారే నిజంగా స్వేచ్ఛాజీవులు అని చెప్పాడు.

ఊతకంటె లోతు యెంచగ పనిలేదు,
చావుకంటె కీడు జగతి లేదు,
గోచిపాత కంటె కొంచెంబు మరిలేదు.

కలిమి కలిగెనేని కాముగా చూతురు,
లేమి చేత చిక్కి లేవలేని
మదను వంటి వాని మాలగా చూతురు.

పాగ పచ్చడంబు, పైకి కూసంబును,
పోగు లుంగరములు, బొజ్జ కడుపు,
కలిగినట్టి వాని కందురు చుట్టాలు.

ఎంత సేవ జేసి యేపాటు పడినను,
రాచమూక నమ్మరాదురన్న,
పాముతోడి పొందు, పదిపేలకైనను.

దొడ్డవాండ్ర మనుచు, దోవ డొంకలు కట్టి,
అడ్డమైన జనుల నంటగట్టి,
దోచుకొన్నయట్టి దోషమెక్కడ పోవు?

కలిమి నాడు నరుడు కానడు మదమున,
లేని నాడు మొదలె లేదు పెట్ట,
కలిమి లేమి లేని కాలంబు కలుగునా?

సంపద వున్న నాడు కండకావరంతో, మనిషికి కన్నూ మిన్నూ కన్పించదు. దారిద్ర్యంతో బాధపడే నాడు, యితర్లకి పెట్టేందుకు వాని వొద్ద ఏమీ వుండదు. అంచేత, కలిమి లేమి లేని కాలం ఎప్పుడైనా వొస్తుందా?! –అని ఆ మహోన్నత ప్రతిభాశాలి, ధనిక–దరిద్ర వ్యత్యాసంలేని సాంఘిక వ్యవస్థను గూర్చి ఆనాడే ఆలోచించాడు. ఈ పద్యంలో వేమన ప్రదర్శించిన ముందుచూపుకి, మనం చేతులెత్తి నమస్కరించవలసిందే.

# యుగకర్తగా వేమన

వేమన రాజులిచ్చే ధనం కోసం కవిత్వం చెప్పలేదు.

"బ్రహ్మవ్రాత కెదురు పల్కెడు వాడును,
ఆదివిష్ణు సూత్ర మడచువాడు,
మూడు కనులవాని మొనసి నిల్చిన"

వాడైన వేమన, జానెడు పొట్ట కోసం కవిత్వం రాస్తాడా? "ఏమియ్యని దొర పేరిట నా మంచిడి కవిత చెప్ప నాలుక తీత" అని వొక కవినామధేయుడు అన్నాడు. నాటి రాజులూ పాలెగాళ్ళూ తమ పేరును కవులచే ప్రచారం చేయించుకోవడం కోసం నానా తిప్పలూ పడేవారు. రాజుగారి కోరమీసాల గురించీ, చిల్లరముండల్తో శ్రీవారు చేసే లీలా విలాసాల గురించీ, నాటి కవులు కావ్యాలు రాసి అగ్రహారాలు సంపాయించుకొనేవారు. ఈ స్థితి ఎంతదాకా దిగజారిందంటే, తమిద కుడుముకీ, దొగ్గలికూరకీ కావ్యాలు రాసే గండాలు ఆనాడు తయారయ్యారు. వేమన ఏమన్నాడో చూడండి:

"తోటకూరకైన, దొగ్గలికైనను,
తమిద కుడుముకైన, తవుడుకైన,
కావ్యములను జెప్పు గండాలు ఘనమైరి."

గౌడ డిండిమభట్టు యొక్క కంచుఢక్కను బద్దలు గొట్టేందుకు గానీ, కనకాభిషేకాలకి మోజుపడిగానీ, రమణీ ప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడెం కోసం గానీ, ఉయ్యాల మంచం కోసం గానీ, వేమన కవిత్వం చెప్పలేదు.

మధ్యయుగాలనాటి మానవజీవిత గని నుండి, తవ్వి తలకెత్తిన అనుభవం ముడిసరుకును, చురకత్తి లాంటి హేతువాద దృష్టితో సానబట్టి,

ఎన్నో సత్యాల్నీ, సామెతల్నీ, పాఠాల్నీ వేమన మనకంద జేశాడు. ఆయన ఏ గురుకులంలోనూ, ఏ వేదశాస్త్రాల్నీ, ఏ ఛందో - వ్యాకరణ - అలంకారశాస్త్రాల్నీ చదవలేదు.

మనిషిలో మాలిన్యం తప్ప "మాలతనం" లేదని గుర్తించి, లోకానికి నిర్భయంగా చాటిన దెంతమంది కవులు? మానవకళ్యాణ మంటప సీమలో తమ కావ్యకుసుమాల్ని తోరణాలుగా కట్టిన దెంతమెంది కవులు? ఇంట్లో – వంటిల్లో - నడివీధిలో - ఏ భాషను సామాన్యుడైన తెలుగువాడు మాట్లాడుతాడో, ఏ భాషను తెలుగుతల్లి ఒళ్ళో, తెలుగుబళ్ళో, తెలుగువాడు నేర్చుకొంటాడో, ఆ సజీవమూ వాస్తవమైన తెలుగే, ఆ తియ్యని తెలుగు జాతీయాలే, ఆ తెలుగు సామెతలే, ఆ తెలుగు నుడికారపు సొంపుయింపులే, వేమన కవితాసామగ్రికి మౌలికమైన ప్రాతిపదికలయ్యాయి. విద్వదౌషధం లాంటి నైషధం నుండి గానీ, భీకర కీకారణ్యాల్లాంటి సంస్కృతాంధ్ర నిఘంటువుల నుండి గానీ, భాషను వేమన ఎరువు తెచ్చుకోలేదు. అంచేతనే, యావదాంధ్ర సాహితీచరిత్రలో వేమనయే ప్రథమ తెలుగు కవి అని నిర్ధరించడం ఏమాత్రం సత్యదూరం గాదు. అంతేగాదు - మధ్యయుగాల నాటి తెలుగుభాషకు, వేమన కవిత్వం – మహోన్నతమైన సాహితీ భాండాగారాం. అందువల్ల, ప్రజల భాషలో, ప్రజల కోసం రాసిన ప్రప్రథమ ప్రజాకవి - వేమనయే!

## శూద్రుని కవిత్వం - కాకి ముట్టిన హవ్యం

"కాపు కవిత్వపు కూతలు, బాపన కవివరుని చెవికి ప్రమదం బగునే?" అని నాటి కవిపండిత శిఖండులు, వేమన కవిత్వాన్ని కాపువాని కూతలుగా జమకట్టి, అవి తమ చెవిన పడకుండా చెవులు గట్టిగా మూసుకున్నారు. సుప్రసిద్ధ అలంకార శాస్త్రవేత్తగా చెప్పబడే అప్పకవి యిలా అన్నాడు:

"ఉపమ గలిగిన, శయ్యల నొప్పియున్న,
అంధ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు,
పాయసంబైన, సంస్కార పక్వమైన,
కాక జుష్టంబు హవ్యంబు గానియట్లు."

కాకి ముట్టిన హవ్యంలా, శూద్రునిచే రాయబడిన కావ్యం నీచమైంది - అని అప్పకవి చెప్పాడు। స్వయం నియమిత ఫాసిస్టు నియంతలా వొక సూత్రాన్ని రచించి పారేసిన ఈ అప్పకవి, వేమన కవిత్వాన్ని వెలివేసి, తన అగ్రవర్ణ దురహంకారాన్నీ, శూద్ర వ్యతిరేకతనీ చాటుకొన్నాడు। ఇలాంటి వెధవలు ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఆ మహాకవి కవిత్వం తెలుగు సాహితీ భాండాగారంలా రూపుదాల్చింది.

భావంలో బిగువు వుండాలే గాని, భావప్రకటనకి ఛందస్సూ అలంకారాలూ ఏమాత్రం అడ్డురావని, కుండ బద్దలగొట్టినట్లు చెప్పగలిగిన వాడూ, ఆ విధంగా నిరూపించినవాడూ, యావదాంధ్ర సాహిత్య చరిత్రలో వేమన వొక్కడే। వేమన - ఆటవెలదిని - మాత్రమే, తన భావప్రకటనకి వాహనంగా స్వీకరించాడు. వావిళ్ళ రామస్వామి శాస్త్రుల్లు (మద్రాసు) ప్రకటించిన "వేమన పద్యాలు"లో అడ్డమైన సీసాలూ, మత్తేభాలూ, కందాలూ వున్నాయి. ఇవన్నీ "వేమ" పేరిట అమాంబాపతు వాళ్ళంతా పద్యాలు రాసి, వేమన పద్యాల్లో సిగ్గూ లజ్జా లేకుండా దోపివేసిన ఫలితంగా జరిగిన ద్రోహమే. యతిప్రాసల కోసం తడుముకోకుండా, శివసముద్ర జలపాతంలా హృదయోద్వేగం కట్టలు తెంచుక పరవళ్ళు తొక్కగా హిమవత్పర్వత సానువుల నుండి కిందికురికే ఉత్తుంగ గంగాతరంగమే వేమన కవిత్వం. వాస్తవమిది కాగా, వేమన పద్యాల పేరిట చలామణిలో వున్న భీకర కీకారణ్యంలో వేమన పేరుతోవున్న శార్దూలాలు-మత్తేభాలు-సీసాలు - చివరికి కందపద్యాలు సైతం మనకి గోచరిస్తాయి. ఇంతకన్న దారుణమైన విషయం మరొకటి వుండదు. భారతం రాసిన ఎన్నో వందల ఏళ్ళ తర్వాత, దాంట్లోకి భగవద్గీతనీ - హరిశ్చంద్ర నలోపాఖ్యానాల్నీ అమాంతం దోపివేసిన మన కవిపండితులు, వేమన పద్యాల్లో శార్దూలా

లేంటి - అవసరమొస్తే జంబుకాల్నీ మార్జాలాల్నీ మత్తగజాల్ని సైతం దోపివేయగలరు. వారు చేయని — చేయలేని - పని ఏదైనా వుందా?

## మానవతకి పట్టాభిషేకం

మానవుని కష్టసుఖాల్నీ, అతని బతుకులోని చీకటి వెలుగుల్నీ, అగ్ర - అధమ - కులాల భేదాల్నీ, పాలక - పురోహితవర్గాల దోపిడీనీ, హేతువాదం కాంతిలో పరిశీలించిన వేమన, మానవతకి పట్టాభిషేకం కట్టాడు. అంచేత, ఆయన తాత్వికచింతనకి మానవతయే ప్రధాన ప్రాతిపదిక.

మధ్యయుగాల్లో గడ్డకట్టుకపోయిన మతమౌఢ్యాన్నీ, తెలుగు ప్రజల మేధస్సుకు పట్టిన బూజునూ, సానబట్టిన కత్తిలాంటి కవితతో దులిపివేసి, హేతువాద జ్వాలను మానవ మస్తిష్కాల్లో జాజ్వలింపజేసిన తార్కికుడూ, మానవ సమానత్వాన్ని ప్రబోధించిన అసమాన మానవతావాది, అసాధారణ ప్రతిభావంతుడైన వేమన, మూడువందల సంవత్సరాల క్రితమే తెలుగు సాంస్కృతిక విప్లవోద్యమానికి నాంది పల్కాడు. ఆ విధంగా నాందిపల్కిన అతడు, చార్వాక - ఆజీవక - సిద్ధాంతాల వల్ల ప్రభావితుడై వుంటాడని ఊహించడం సత్యదూరం కాదేమో? ఈ సిద్ధాంతాల వల్ల ఉత్తేజితుడైన వేమన అగ్నిగోళాల్లాంటి ఆటవెలదుల్ని చెప్పడం వల్ల, రాయలసీమలో చార్వాకం మధ్యయుగాల వరకూ కొనప్రాణంతో బతికివుండి వుండాలని ఊహించడానికి గూడా వీలు కల్గుతోంది. ప్రాచీన భారతంలో చార్వాకాన్ని ప్రచారంజేసిన వారు, వైదికమత గూండాల భీకర చిత్రహింసలకి గురిజేయబడి చరిత్రకి అందకుండా కన్నుమూశారు. ఆ విధంగా చరిత్రనించి కనుమరుగైన నాటి చార్వాకుల పేరును, ఇంటిపేరుగా కలిగియున్నవారు నేటికీ కర్నూలు జిల్లాలో వున్నారు. మొదట శైవుడుగా, ఆ తర్వాత అద్వైతిగా, అనంతరం నాస్తికుడుగా వేమన పరిణామం చెందాడని ఆరుద్ర అంటున్నాడు.

# వైతాళికులకు వైతాళికుడు

ఆదునిక భారతజాతి పితామహుడుగా పరిగణింపబడే రామమోహన రాయ్‌కి వంద సంవత్సరాలకి పూర్వమే, స్వామీదయానంద, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, జస్టిస్ గోవిందరెనడె, నారాయణగురు, పెరియార్ రామస్వామి యిత్యాది సాంఘిక తిరుగుబాటుదార్లకి రెండు శతాబ్దాలకి పూర్వమే, ఆదునికాంధ్ర జాతి వైతాళికుడుగా పరిగణింపబడే వీరేశలింగానికి పూర్వమే, భావవిప్లవానికి బీజాలు వేసిన వేమన, భారత సాంస్కృతిక విప్లవోద్యమ వియత్తలాన వేగుచుక్కలా ప్రకాశించాడు. ఆవిధంగా ఆదునిక భారతంలో మరో రెండు శతాబ్దాల అనంతరం ఉద్భవించనున్న బ్రహ్మాండమైన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమానికి నాంది పల్కిన వేమన, వైతాళికులకు వైతాళికుడయ్యాడు.

గుళ్ళనీ, అందులోని నల్లరాళ్ళనీ, మతగురువుల వేషాలేసుకొన్న ఎర్రతేళ్ళనీ, అంధమత విశ్వాసాల బ్రహ్మజెముళ్ళనీ, వేయేల — నాటి యావత్ సామాజిక వ్యవస్థా పునాదుల్ని తన ప్రచండ కవితాశక్తితో మొదలంటా కుదిపివేయ యత్నించిన ప్రళయభీకర ప్రభంజనమే వేమన. మధ్యయుగాల సాంఘిక గగనాన్ని కమ్మివేసిన కారుచీకట్ల లోంచి మహోజ్వలంగా ఉదయించిన కాంతిరేఖయే — వేమన. అంతవరకూ రాజాంతఃపురాల్లో పాలకవర్గాల ఉప్పు పులుసు తిని, వాళ్ళకి అడ్డమైన చాకిరీజేస్తోన్న తెలుగు కవితా సరస్వతి కొప్పుబట్టి బైటికీడ్చి, సాహితీ రంగంలో అపూర్వమైన భూకంపం పుట్టించయత్నించిన వాడే - వేమన. అంచేత, అతడు తెలుగువాడు మాత్రమే కాడు. యావత్ మానవ కుటుంబానికీ జెందినవాడు. వేమన లాంటి సాంస్కృతిక విప్లవోద్యమ వేగుచుక్కని, మహామేధావిని, ప్రప్రథమ ప్రజాకవిని, మధ్యయుగాల చీకటి భారతం సృష్టించడం అత్యంత ఆశ్చర్యజనకం!

# వేమన నాస్తికుడా?

ఇంతకీ వేమన ఆస్తికుడా - కాక - నాస్తికుడా? ఈ అంశం గురించి మరింత లోతుగా, మరింత శాస్త్రీయంగా పరిశోధన జరపవలసిన అవసరం ఎంతైనా వుంది. మొదట వీరశైవుడుగా వున్న వేమన, ఆ తర్వాత యోగ - తాంత్రిక - అద్వైత - ధోరణుల వేపు ఆకర్షించబడి, చివరికి లోకాయతుడుగా పరిణతి చెంది వుంటాడని నేను భావిస్తోన్నాను. ఈ కారాణం వల్లనే ఆయన పద్యాల్లో ఈ విభిన్న తాత్విక ధోరణులు కన్పిస్తోన్నాయి.

వర్ణవ్యవస్థనీ, మాల - మాదిగ - గూడేల్నీ-"ధర్మ" బద్ధం జేయ డానికీ, ఆటవికయుగం నాటికి దేశాన్ని మళ్ళించడానికి ప్రయత్నాలు జరుగుతోన్న ఈ సమయంలో, మనిషిలోని హేతువాద ఆలోచనా ధోరణికి నీరాజన మెత్తిన వేమన కవితాధ్యయనం, నేడు అందరికీ అవసరం.

★

## రిఫరెన్స్ గ్రంథాలు - పత్రికలు


1. వేమన పద్యాలు - వావిళ్ళ రామస్వామి శాస్త్రుర్లు (మద్రాసు)
2. వేమన - రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
3. వేమన మనీష - సి. వి.- భారతి మాసపత్రిక-1956 అగస్టు
4. సంస్కరణోద్యమ వేగుచుక్క- వేమన - సి. వి. (విశాలాంధ్ర దినపత్రిక - 6-12-1964)
5. వర్ణవ్యవస్థ ఖండనలో వేమన హేతువాద దృష్టి- సి. వి. (విశాలాంధ్ర దినపత్రిక - 13-12-1964)

# బుసకొడుతున్న హిందూ పునరుద్ధరణవాదం :

# జస్టిస్ చిన్నపరెడ్డి ప్రసంగం

(అనుబంధం)

"సనాతన ధర్మ పునరుద్ధరణవాదం- మేధావి" అనే అంశంపై బెర్ట్రాండ్ రస్సెల్ అధ్యయనవేదిక- ఢిల్లీ శాఖ-వాకగోష్టిని ఏర్పాటుజేసింది.

"పాలక బూర్జువావర్గం ఎంతో జిత్తులమారిదనీ, తన ఉనికిని సమర్ధించుకోవడం కోసం, ప్రజల్ని నమ్మించడం కోసం, అనేకమంది కుహనా మేధావులను సృష్టీకరించడమే గాక, ప్రచార సాధనాలను సైతం తెలివిగా ఉపయోగించుకొంటున్నారని" ఢిల్లీలో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ చిన్నపరెడ్డి అన్నారు. "అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం, బూర్జువా పాలకవర్గానికి చెందిన కుహనా మేధావులు, ప్రమాదకరమైన కర్మసిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారని బెర్ట్రాండ్ రస్సెల్ ద్వితీయ స్మారకోపన్యాసం యిస్తూ ఆయన విమర్శించారు.

"ఆకాశవాణి ప్రతిరోజూ వెంకటేశ్వర సుప్రభాతంతోను, దూరదర్శన్ యోగప్రచారంతోను, తన దైనందిన కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. అవి రెండూ కలిసి కుహనా మేధావులకి చెందిన క్షీణ సనాతనధర్మ పునరుద్ధరణవాదాన్ని ప్రబోధిస్తోన్నాయి."

"మనదేశంలోని బూర్జువా పాలకవర్గం చాలా టక్కరిది. దాని అధీనంలో గల కపట మేధావుల సైన్యం, పాలకవర్గ ఆజ్ఞల్ని నిర్వహిస్తూ వుంటుంది. జనబాహుళ్యాన్ని తమ గుప్పిట్లో వుంచుకోవడం కోసం, తాము న్యాయబద్ధమైన పాలకులమని జనంచే నమ్మించడం కోసం, వినాశకరమైన కర్మసిద్ధాంతాన్ని ప్రచారం చేయడం కోసం, బూర్జువా పాలకులు ప్రచార సాధనాల్ని ఎంతో నేర్పుగా ఉపయోగించుకొంటున్నారు. కర్మసిద్ధాంతం

ద్వారా ఒక అన్యాయమైన సాంఘిక వ్యవస్థను హేతుబద్ధం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తరతరాలుగా జనానికి దీన్నినూరిపోస్తుండడం వల్ల, విషతుల్యమైన ఈ కర్మసిద్ధాంతం భారతీయుల రక్తంలో జీర్ణించుక పోయింది. ఎటువంటి అన్యాయాన్ని అయినా, ఎటువంటి అసమానతనైనా, మనదేశప్రజలు నిర్వికారంగా భరించేటట్లు చేయడంకోసం ఈ సిద్ధాంతాన్ని ఉపయోగించుకొంటున్నారు. మన పూర్వీకులకు మనకన్న ఆధునికమైన శాస్త్రీయపరిజ్ఞానం వుండేదనీ, వైదిక రుషులకు విమానాలు, అణ్వస్త్రాలు తెలుసునని నిరూపించడం కోసం, ఈ కుహనా మేధావుల్లో అత్యధికులు, రామాయణ భారతాలలోనూ, ఇతర మతగ్రంథాలలోనూ సాక్ష్యాలు కనుగొనడానికి ప్రయత్నించడం గర్హనీయం. మేధావుల్లో అత్యధికులు ధైర్యంగా శాస్త్రీయవిజ్ఞానాన్ని ప్రచారం చేయడానికి బదులు, సాంప్రదాయాన్నీ మూఢనమ్మకాలనీ రక్షించేవారుగా వ్యవహరిస్తున్నారు.

అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, బీదలు, ధనికులు, మంత్రులు, జడ్జీలు, రాజకీయవేత్తలు, బ్యూరాక్రాట్లు, ప్రొఫెసర్లు, సైంటిస్టులు, ఒకరేమిటి– అన్ని తరగతులవారూ స్వామీజీల, బాబాల, భగవాన్ల, మహారుషుల, యోగిపుంగవుల, తదితర దేవదూతల దర్శనంకోసం పడరాని పాట్లు పడుతున్నారు. వారి కాళ్ళముందు సాగిలపడి, వారిచ్చే విభూతిని స్వీకరిస్తున్నారు. ఇదంతా పాపపరిహార కోసమట.

ఈ పునరుజ్జీవనం కోసం కపట మేధావులూ, భారతీయ బూర్జువా పాలకులూ సాగిస్తున్న కృషి, అనుకోకుండా జరుగుతున్న పరిణామమేమీ కాదు. ఈ పునరుద్ధరణవాదం (రివైవలిజం) చారిత్రక విప్లవ ప్రతీఘాత క్రమంలో ఒక భాగమే. విప్లవ దార్శనికత అనే సూర్యునికి మబ్బు పట్టించడం కోసం, జనబాహుళ్యంలో విప్లవస్ఫూర్తి పెరగకుండా చేయడం కోసం, పునరుజీవనమనే ముసుగును తొడుగుతున్నారు. పునరుజ్జీవనం, మతం, మూఢవిశ్వాసాలపై యుద్ధం సాగించాలి." (ఈనాడు– 27–8–8.)

★

సుందరయ్య గ్రంథాలయం
A C No. 58.866